
సురవరం సుధాకరరెడ్డి
వ్యాసాలు - లేఖలు
రూ॥200/- పేజీలు:290
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 80 | మంగళవారం | 09-09-2025 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00



వెనుజులా కబళింపుకై అమెరికా యుద్ధ నౌకలు 06

గుజరాత్ మోడల్ 'చట్టబద్ధ అవినీతి'
కేంద్ర దర్యాప్తు సంస్థల కంటికి కనిపించదా?





## ఎల్లంపల్లి నుంచి మూసీకి గోదావరి


### ఎవరడ్డొచ్చినా హైదరాబాద్‌కు జలాలు తీసుకొస్తాం

- మూసీ పునరుజ్జీవంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారం
- నల్లగొండ ప్రజల కోసమే మూసీని ప్రక్షాళన చేస్తున్నాం
- తుమ్మిడిహట్టి వద్ద 150 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు కట్టితీరుతాం
- రంగారెడ్డి, వికారాబాద్, చేవెళ్లకు సాగునీరందిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టీకరణ
- గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 2, 3 ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎవరడ్డొచ్చినా శ్రీ పాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి హైదరాబాద్‌కు గోదావరి జలాలు తీసుకొస్తామ ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గోదావరి జలాలను హైదరాబాద్‌కు మ ల్లన్న సాగర్ నుంచి తీసుకురావడం లేదన్నారు. ఎల్లంపల్లి కట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. మూసీ పునరుజ్జీవంలో భాగంగా ఉస్మాన్ సాగర్ (గండిపేట) వద్ద చేపట్టిన గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 2, ఫేజ్ 3 ప్రాజెక్టు పనులకు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంఎల్‌ఎలు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాష్ గౌడ్‌తో కలిసి ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. రూ. 7,360 కోట్లతో హ్యామ్ విధానంలో ఈ పనులు చేపట్టనున్నారు. రెండేళ్లలో గోదావరి ఫేజ్2, ఫేజ్ 3 పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సందర్భంగా జరిగిన స భలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ ప్రజల తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించే దిశగా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగర దాహర్తి తీర్చడానికే ఈ ప్రాజెక్ట్ చేపట్టామన్నారు. కాంగ్రెస్ తరువాయి 2లో



## ఉపరాష్ట్రపతి ఎన్నికకు రంగం సిద్ధం

### నేడు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
### ఎన్నికలకు బిఆర్ఎస్, బిజెడి దూరం

**న్యూఢిల్లీ :** ఉప రాష్ట్రతి ఎన్నికకు రంగం సిద్ధమైంది. మంగళవారం పోలింగ్ జరగనుంది. అధికార ఎన్‌డిఎ అభ్యర్థి సి.పి. రాధాకృష్ణన్, ప్రతిపక్షఉమ్మడి అభ్యర్థి బి.సుదర్శన్ రెడ్డి మధ్య ప్రత్యక్ష పోటీ జరగనుంది. ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. పార్లమెంట్ ఉభయ సభల సభ్యులు మంగళవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల మధ్య పార్లమెంటు హౌస్‌లో తమ ఓటు వేయనున్నారు. ఓట్ల లెక్కింపు సాయంత్రం 6 గంటలకు ప్రారంభం కానుండగా అనంతరం ఫలితం వెలువడనుంది. అయితే ఎన్‌డిఎ కూటమికి స్పష్టమైన సభ్యుల సంఖ్య ఉన్నప్పటికీ ఉపరాష్ట్రపతి ఎన్నికలకు రహస్య బ్యాలెట్ విధానంలో పోలింగ్ జరగనుందున పార్లమెంటు సభ్యులు పార్టీ విప్‌లకు కట్టుబడి ఓటు వేయకపోవచ్చు. ఎన్నికల ప్రక్రియ గురించి వారికి అవగాహన కల్పించడానికి బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీలు సోమవారం సంబంధిత ఎంపిలతో వేర్వేరు సమావేశాలు నిర్వహించాయి. మాక్ పోల్స్ కూడా నిర్వహించాయి. పోటీలో ఉన్న ఇద్దరు అభ్యర్థుల పేర్లతో కూడిన బ్యాలెట్ పత్రాలను ఎంపిలకు అందజేస్తారు. వారు ఎంచుకున్న అభ్యర్థి పేరుకు ఎదురుగా '1' అంకెను రాయడం ద్వారా వారి ప్రాధాన్యతను గుర్తించాలి. సంఖ్యలను అంతర్జాతీయ భారతీయ సంఖ్యల రూపంలో లేదా రోమన్ రూపంలో లేదా ఏదైనా భారతీయ భాషలో గుర్తించవచ్చు. కానీ పదాలలో సూచించకూడదని ఉపరాష్ట్రపతి ఎన్నికల నియమాలు పేర్కొంటున్నాయి. ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన ఎలక్టోరల్ కాలేజీలో మొత్తం 788 మంది సభ్యులు ఉంటారు. రాజ్యసభ నుండి 245 మంది, లోక్‌సభ నుండి 543 మంది. రాజ్యసభకు నామినేటె అయిన 12 మంది సభ్యులు తరువాయి 2లో

## మేడారం అభివృద్ధి పనులు వంద రోజుల్లో పూర్తిచేయాలి

- దేవాదాయ శాఖ అధికారులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశం
- మేడారం, బాసర ఆలయాల అభివృద్ధిపై సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

వంద రోజుల్లో మేడారం అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం సిఎం రేవంత్‌రెడ్డి మేడారం, బాసర ఆలయాల అభివృద్ధి పనులపై మంత్రులు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మేడారం, బాసర ఆలయాల అభివృద్ధి కి సంబంధించిన తరువాయి 2లో



## తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- డిసెంబర్ నాటికి ప్రాజెక్టుల నిర్మాణాలు వేగవంతం చేయాలి
- అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం అధికారులను ఆదేశించారు. రానున్న డిసెంబర్ నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు.సోమవారం హైదరాబాద్‌లోని నీటిపారుదల తరువాయి 2లో



## తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సురవరం కృషి చిరస్మరణీయం

సిఆర్ ఫౌండేషన్‌లో సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ




నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో గ్రంథాలయానికి సురవరం సుధాకరరెడ్డి లైబ్రరీగా నామకరణ ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా॥రియాజ్

03

## హామీల అమలుకు వ్యవసాయ కార్మికులు భారీ ప్రదర్శన

- బికెఎంయు ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన
- వయోవృద్ధులైన వ్యవసాయ కార్మిక దంపతులకు పింఛన్లు ఇవ్వాలి : బాగం

ప్రజాపక్షం/ ఖమ్మం



రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తెచ్చిన సవరణలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. ఖమ్మంలో వ్యవసాయ కార్మికులు కదం తొక్కారు. ఎస్ఆర్ గార్డెన్ సమీపం నుంచి కలెక్టరేట్ వరకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వ్యవసాయ కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన అగ్రభాగాన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ తరువాయి 12లో

## ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బిఆర్ఎస్ పాల్గొనడం లేదు

- కాంగ్రెస్, బిజెపిలు రాష్ట్ర రైతాంగాన్ని వేధిస్తున్నందువల్లే నిర్ణయం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్

యూరియా దొరక్క ఇబ్బందులు పడుతున్న 71 లక్షల తెలంగాణ రైతుల కోసం తాము ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనడం లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు స్పష్టం చేశారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థులు ఇద్దరూ ఎన్‌డిఎ, ఇండియా కూటముల ప్రతినిధులని, వారు వ్యక్తులుగా పోటీ చేయడం లేదన్నారు. కాంగ్రెస్,బిజెపి తెలంగాణ రాష్ట్ర రైతులను వేధిస్తున్నాయని, సతాయిస్తూ ప్రాణాలు తరువాయి 2లో

## ఎందుకు పాల్గొనదో బిఆర్ఎస్ చెప్పాలి



- జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వకపోవడంపై కారణాలు స్పష్టం చేయాలి
- ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

భారత ఉపరాష్ట్రపతి ఎన్నికల ఓటింగ్‌లో బిఆర్ఎస్ ఎందుకు పాల్గొనడం లేదో, జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వకపోవడానికి కారణమేమిటలో స్పష్టమైన సమాధానం చెప్పాలని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. 'ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో నోటా లేదు మా వాటా లేదు' అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అంటున్నారని, ప్రతిపక్షాల అభ్యర్థిగా పోటీ చేస్తున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి తరువాయి 2లో

## బిహార్ ఎస్ఐఆర్‌లో 12వ డాక్యుమెంట్‌గా ఆధార్‌ను ఆమోదించాల్సిందే

- ఎన్నికల సంఘానికి 'సుప్రీం' మార్గదర్శకాలు జారీ
- అయితే, ఆధార్ పౌరసత్వానికి ధ్రువీకరణ కాదని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న బిహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కసరత్తులో ఓటర్ల జాబితాలో గుర్తింపును స్థాపించడానికి ఎన్నికల సంఘం (ఇసి) ప్రకటించిన ధ్రువీకరణ పత్రాల జాబితాలో ఆధార్‌ను తప్పకుండా 12వ పత్రంగా పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టు సోమవారం ఎన్నికల సంఘానికి మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రస్తుతం బిహార్‌లో ఎస్ఐఆర్‌కు సంబంధించి ఓటర్లు తమ గణన ఫారమ్‌లతో 11 ప్రతిపాదిత తరువాయి 12లో

## నేపాల్ యూత్ ర్యాలీ రక్తసిక్తం

### కాల్పుల్లో 19 మంది మృతి
### సోషల్ మీడియా నిషేధంపై తీవ్ర వ్యతిరేకత

- దేశంలో పలు చోట్ల కర్ఫ్యూ
- 300 మందికి పైగా గాయాలు
- హోంమంత్రి రమేశ్ లేఖక్ రాజీనామా




**ఖాట్మండు:** నేపాల్ రాజధాని ఖాట్మండు న్యూబనేశ్వర్‌లో సోమవారం సాయంత్రం వేలాదిమంది యువకులు,స్కూలు విద్యార్థులు నిర్వహించిన ర్యాలీపై పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య 19కి చేరగా.. 300 మందికి పైగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో అక్కడ కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. నేపాల్ హోంమంత్రి రమేశ్ లేఖక్ తన పదవికి రాజీనామా చేశారు. ఆ దేశ ప్రధాని కెపి శర్మ ఓలి అధికారిక నివాసంలో జరిగిన అత్యవసర భేటీలో రాజీనామా లేఖను ప్రధానికి అందజేసినట్లు సమాచారం. మరోవైపు, యువత నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం పలు సోషల్ మీడియా యాప్‌లపై నిషేధం ఎత్తివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కూడా వార్తలు వస్తున్నాయి. సోషల్ మీడియాపై ప్రభుత్వం నిషేధం విధించడంతో జనరేషన్–జెడ్ (1990–2010మధ్యతరం) బ్యానర్‌పై విద్యార్థులు,యువకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తూ వీధుల్లోకి వచ్చారు. తక్షణం నిషేధం ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. పార్లమెంటు భవనంలోకి ప్రవేశించేందుకు విఫలయత్నం చేశారు. ఇతర నగరాలు,పట్టణాలలో కూడా ప్రదర్శకులపై పోలీసులు నీటిగొట్టాలను, బాష్పవాయువు,రబ్బరు బుల్లెట్లను ప్రయోగించారు. ఈ మరణాలపై ప్రభుత్వం ఎలాంటి అధికారిక ప్రకటనా తరువాయి 12లో




## తలసరి ఆదాయంలో తెలంగాణ అగ్రస్థానం : భట్టి

03


చలో చండీఘడ్




భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
25వ కాంగ్రెస్
21-25 సెప్టెంబర్, 1925
చండీఘడ్ (పంజాబ్)


రాజకీయ పంథాను మలుపు తిప్పిన సిపిఐ 3కాంగ్రెస్ – 6వ పేజీలో



# ప్రపంచం
WORLD NEWS

## వాణిజ్య ఒప్పందం రద్దుచేసుకోండి

### భారత్‌– చైనాలకు నేపాల్ అధికారపార్టీ విజ్ఞప్తి

**ఖాట్మండు:** వాణిజ్యసంబంధాలను పునరుద్ధరించుకుంటూ ఇటీవల చేసుకున్న ఒప్పందాన్ని రద్దుచేసుకోవాలని భారత్‌–చైనా దేశాలకు నేపాల్ అధికారపార్టీ విజ్ఞప్తి చేసింది. లిపులేక్ కనుమ మార్గం ద్వారా భారత్‌–చైనాలు వాణిజ్యాన్ని పునరుద్ధరించుకోవాలని గతనెలలో ఒప్పందం చేసుకున్నాయి. నేపాల్ అధికారపార్టీ సిపిఎన్‌–యుఎంఎల్ దీనిని వ్యతిరేకించింది. లిపులేక్ కనుమ దారి తమదేశానికి చెందినదని నేపాల్ ప్రభుత్వం వాదించడం ప్రారంభించింది. ఐతే ఒప్పందం కుదిరిన వెంటనే నేపాల్ వ్యక్తం చేసిన అభ్యంతరాన్ని భారత్ ఖండించింది. అనేక తరాలుగా ఈ కనుమ మార్గంలో చైనా–భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు కొనసాగుతున్నాయని, ఇటీవల కొన్ని కారణాలతో ఈ వాణిజ్యం ఆగిపోయిందని నేపాల్ ప్రభుత్వానికి భారత్ స్పష్టం చేసింది. ఐనప్పటికీ ఇప్పుడు నేపాల్ అధికారపార్టీ తాజాగా ఈ ప్రకటన చేసింది. 2020లో కూడా నేపాల్ ప్రభుత్వం తన రాజకీయ పటంలో లిపులేక్, కాలాపానీ,లింపియాధుర ప్రాంతాలను తనదేశ ప్రాంతాలుగా చూపించుకుని వివాదానికి తెరలేపింది.

## హమాస్‌కు ట్రంప్ తుది హెచ్చరిక



### బందీలను వదలకపోతే సమూల నిర్మూలన

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ హమాస్ ఉగ్రవాదులకు తుది హెచ్చరిక జారీ చేశారు. మధ్యవర్తుల చర్చల ద్వారా పంపిన సందేశం ప్రకారం ఒప్పందానికి కట్టుబడాలని, అనుకున్న విధంగా బందీలను విడుదల చేయకపోతే హమాస్‌ను పూర్తిగా నిర్మూలిస్తామని ట్రంప్ సోమవారం తన సొంట్రూత్ సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. తాము ప్రతిపాదించిన ఒప్పందాన్ని అంగీకరించడం తప్ప హమాస్‌కు మరోమార్గం లేదని ఆయన పేర్కొన్నారు. మరోవైపు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూపై స్వదేశంలో తీవ్ర ఒత్తిడి పెరిగిపోవడంతో ఆయన కూడా బందీను విడుదల చేయాలని హమాస్‌కు విజ్ఞప్తి చేశారు. ఆయుధాలు వదిలిపెట్టేదిలేదని, సైన్యాన్ని వెనక్కు తరలించి రాజీ పడితేనే బందీలను విడుదల చేస్తామని హమాస్ కూడా తెగేసి చెప్పింది. ఇంకోవైపు గాజాసిటీలో ఐడిఎఫ్ దళాలు నగరంలో లోపలికి చొచ్చుకుని వెళుతున్నాయి. ప్రజలు దక్షిణప్రాంతంలోకి తరిలివెళ్ళిపోవాలని సైన్యం హెచ్చరికలు చేస్తోంది. గడచిన మూడు రోజులుగా గాజాసిటీలో ఉన్న హైరైజ్ భవంతులను ఐడిఎఫ్ దళాలు క్షిపణులు, గగనతల దాడులతో నేలమట్టం చేస్తున్నాయి. హమాస్ ఇంటిలిజెన్స్ విభాగం ఈ హైరైజ్ భవంతులు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తోందని ఐడిఎఫ్ ఆరోపిస్తున్నది.

గాజాలో హమాస్‌వద్ద సజీవంగా ఉన్న ఇరవైమంది బందీలను విడుదల చేయించేందుకు ఆ సంస్థ ప్రతినిధులతో తాము చాలా ముమ్మరంగా లోతైన చర్చలు జరుపుతున్నామని డోనాల్డ్ ట్రంప్ గడచిన శుక్రవారం ప్రకటించారు. ట్రంప్ ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ పారిస్‌లో గురువారం ఖతార్ అధికారులను కలిశారు. హమాస్ ప్రతినిధులతో చర్చలు ఎంతవరకూ వచ్చాయో ఆ పురోగతిని సమీక్షించారు. ఖతార్,ఈజిప్టు దేశాలు హమాస్ ప్రతినిధులతో బందీల విడుదలకు మధ్యవర్తిత్వం చేస్తుండగా ట్రంప్ ఇజ్రాయెల్ తరపున మధ్యవర్తిత్వం చేస్తున్నారు.

# జెరూసలెంలో కాల్పులు :ఆరుగురు మృతి

### హమాస్ ప్రశంస : పోరు విస్తరించాలని పిలుపు... గుర్తు తెలియని వ్యక్తుల కోసం ఐడిఎఫ్ గాలింపు



**జెరూసలెం:** ఉత్తర జెరూసలెంలోని ఒక బస్‌స్టాప్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరపడంతో ఆరుగురు మరణించారు. మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఏడుగురి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ఇజ్రాయెల్ పోలీస్, ఎమర్జెన్సీ సహాయ సిబ్బంది తెలిపారు. అదేసమయంలో అక్కడ ఉన్న భద్రతాధికారి, మరో పౌరుడు వీరోచితంగా ఎదురు తిరిగి దాడికి పాల్పడిన వారిలో ఇద్దరిని హతమార్చారు. మిగిలినవారి కోసం సైన్యం గాలిస్తోంది. మృతుల్లో 30 ఏళ్ళ వయసువారు, 50 యేళ్ళ వయసువారు ఉన్నారు. ఘటన అనంతరం పదులసంఖ్యలో భద్రతా సిబ్బంది ఆ ప్రాంతానికి తరలివచ్చారు. ఉదయంపూట చాలా రద్దీగా ఉండే సమయంలో అదనుచూసి దుండగులు ఈ కాల్పు లు జరిపారు. ఇటీవలి నెలల్లో ఈ ప్రాంతంలో ఇలాంటి ఆకస్మిక దాడులు పెరిగాయి. గత ఏడాది అక్టోబరు నెలలో టెల్‌అవీవ్ ప్రాంతంలో భారీస్థాయిలో కాల్పులు జరిపి ఏడుగురిని చంపారు. గాజాలో యుద్ధం మొదలైనప్పటినుండీ ఇప్పటివరకూ ఈ ప్రాంతంలో 49 మంది ఇజ్రాయెలీ పౌరులు ఈ విధంగా కాల్పుల్లో మరణించారని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. బస్‌స్టాప్‌లో రికార్డైన వీడియోలో కాల్పుల సందర్భంగా పదులసంఖ్యలో అక్కడ ఉన్న ప్రజలు తలోదిక్కుకూ భయంతో పరుగులు తీయ డం కనిపించింది. పలువురు గాయాలతో నేలకూలిపోయారు. ఆ ప్రాంతంలో తీవ్ర గందరగోళపరిస్థితి ఏర్పడింది. ఈ ఆకస్మిక ఘటనతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. కాల్పుల బారిన పడినవారిలో నలుగురు అక్కడికక్కడే మరణించారు. ఇద్దరు వేరు వేరు ఆసుపత్రులలో చికిత్సపొందుతూ మరణించారు. ఇజ్రాయెల్ ప్రభుత్వం కాల్పు లు జరిపిన ఆగంతకులకోసం భారీ ఎత్తున గాలింపు చర్యలు చేపట్టింది. దీంతో హమాస్ స్పందించి హర్షం ప్రకటించింది. కాల్పులు జరిపిన వారిని వీరోచిత యోధులుగా, కథానాయకులుగా చిత్రీకరించింది. ఉత్తర జెరూసలెంలో, ఆక్రమిత ప్రాంతాలలో పాలస్తినా ప్రజలు తమ పోరాటాన్ని ఉద్ధృతం చేయాలని, మరింతగా విస్తరించాలని పిలుపు ఇచ్చింది. ఆక్రమిత జెరూసలెంలో ఇజ్రాయెల్ చేస్తున్న దారుణాలపై ప్రజలు స్వచ్ఛందంగా స్పందించారని, పోరు చేస్తున్నారని హమాస్ ఉగ్రవాద సంస్థ కొనియాడింది. ఐతే ఈ కాల్పుల ఘటనకు హమా స్ బాధ్యత వహించలేదు. గడిచిన 23 నెలలుగా గాజా వెస్ట్ బ్యాంక్, జెరూసలెం ప్రాంతాలలో ఇజ్రాయెల్ చేస్తు న్న దాడుల్లో 1200 మంది పాలస్తీనియన్లు మరణించారు. ప్రధానమంత్రి నెతన్యాహూ కాల్పులు జరిగిన రామోత్ జంక్షన్ ప్రదేశాన్ని సోమవారం మధ్యాహ్నం వెళ్ళారు. అక్కడే పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఉగ్రవాదంపై సర్వశక్తులూ కూడదీసుకుని ఇజ్రాయెల్ ప్రభు త్వం అన్నిరంగాల ద్వారా బలమైన పోరాటం చేస్తోందని అన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన తీవ్ర సం తాపం తెలియజేశారు. గాయపడినవారికి మంచి చికి త్స అందించాలని ఆదేశించారు. వారు త్వరగా కోలుకోవాలని ఆశించారు. కాల్పులకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులకోసం ఇజ్రాయెల్ గ్రామాలను చుట్టుముడుతున్నామని, త్వరలో వారిని అరెస్టు చేస్తామని చెప్పారు. దుండగులు ఇద్దరూ రామల్లాకు ఆగ్నేయంగా ఉన్న ఖతన్నా, అల్ కుబైబా పట్టణాల నుండి వచ్చినట్లు గుర్తించామని చెప్పారు.

## రేపు ద.కొరియాకు కార్మికులు తరలింపు

**జార్జియా:** హ్యుండయ్ ప్లాంట్‌లో అరెస్టు చేసిన 300 దక్షిణ కొరియా కార్మికులు, ఉద్యోగులను బుధవారం స్వదేశానికి తిప్పిపంపుతారు. అమెరికా జార్జియా రాష్ట్రంలోని హ్యుండయ్ కంపెనీ ఎలక్ట్రిక్ వెహికిల్ బ్యాటరీ ప్లాంట్‌పై అక్రమ వలస కార్మికుల నిరోధక అధికారులు గడచిన గురువారం దాడి చేశారు. విజిటర్ వీసాలతో అక్రమంగా ప్లాంటులో పనిచేస్తున్న 475 మంది ఉద్యోగులను అరెస్టు చేశారు. వీరిలో 300 మంది దక్షిణ కొరియా దేశీయులే ఉన్నట్లు ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) అధికారులు గుర్తించారు.అరెస్టుల విషయం తెలియగానే కొరియా ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఆ దేశ విదేశాంగమంత్రి సోమవారం వాషింగ్టన్ చేరకున్నారు. ఇప్పటికే ఫోన్‌ద్వారా మంతనాలు జరిగాయి. ఈ సమస్యలో జోక్యం చేసుకుని పరిష్కరిస్తారని అధ్యక్షుడు ట్రంప్ కూడా హామీ ఇచ్చారు. ఫ్లోరిడాలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఈనెల పదో తేదీన ఈ కార్మికులను తీసుకువెళ్ళేందుకు ఒక ఛార్టర్డ్ విమానాన్ని అక్కడి ప్రభుత్వం పంపుతోంది. అమెరికాలోని కీలక పరిశ్రమల్లో కొన్ని వందల బిలియన్ డాలర్లు పెట్టుబడులుగా పెడతామని హ్యుండయ్ కంపెనీ ట్రంప్ ప్రభుత్వానికి ఇటీవల భరోసా ఇచ్చింది. ఐతే స్వల్పకాలిక, తాత్కాలిక పర్యటనల వీసాలపై వచ్చి ఉద్యోగాలు చేయడానికి అమెరికా నిబంధనలను ఒప్పుకోవని అధికారులు చెప్పారు. స్వదేశీయులకు ఉద్యోగ రక్షణ చర్యల్లో భాగంగా ఈ దాడులు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు.

## బిఆర్ఎస్ చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ బిడ్డ అని, న్యాయ కోవిదుడనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. హైదరాబాద్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీని బిఆర్ఎస్ పార్టీగా మార్చిన అనంతరం తెలంగాణకు సంబంధం లేకుండా పోయిందని, రాజకీయాలకు సంబంధం లేకుండా బిఆర్ఎస్ మారిందని విమర్శించారు. ఇంట్లో ఆడపిల్ల పంచాయితీ ఉందని, పైసల కోసం కొట్టుకుంటున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు గుండు సున్నా వచ్చిందని, తెలంగాణలో జరిగే ఎన్నికల్లోనూ ప్రజలు బి ఆర్ ఎస్‌కు ఓట్లు వేయొద్దని ఆయన ప్రజలను కోరారు.

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యామ్‌లను ఏ విధంగా అయితే కట్టిందో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో 50 నుంచి 100 ఏళ్ళు మూసీకి మంచినీళ్లకు ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతో మల్లన్నసాగర్ నుంచి సిఎం రేవంత్ రెడ్డి నీళ్లు తెస్తున్నారన్నారు. మల్లన్నసాగర్ నుంచి నీళ్లు తేవడం వల్లే రూ.7400 కోట్లు అయిందన్నారు. రూ.1100 కోట్లతోనే కొండపోచమ్మపల్లి నుంచి హైదరాబాద్ కు గోదావరి నీళ్లు తీసుకొద్దామని అనుకున్నామని, సిఎం రేవంత్ రెడ్డి హయంలో కొండపోచంపల్లి నుంచి కాకుండా మల్లన్న సాగర్ నుంచి రూ.7400 కోట్ల ఖర్చుతో నీల్లు తీసుకొస్తున్నారని కెసిఆర్ చెబుతున్నారని, అయితే కొండపోచంపల్లి 15 టిఎంసి సామర్థ్యం కాగా మల్లన్న సాగర్‌లో 50 టిఎంసి ల సామర్థ్యం ఉందని ఆయన స్పష్టం చేశా రు.

గతంలోనే చర్లపల్లిలో డ్రగ్స్ కంపెనీ ఉందని, గత పదేళ్లలో చర్యలు తీసుకోకపోవడం వల్ల విచ్చలవిడిగా డ్రగ్స్ దొరుకుతున్నాయన్నారు. సిఎంగా రేవంత్ రెడ్డి బాధ్యత తీసుకున్న అనంతరం డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపారన్నారు. ఆర్ ఎస్.ప్రవీణ్ కుమార్ చేసిన వాఖ్యలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. పోలీస్ అధికారిగా ఉండి, తన తోటి పోలీసులు నిర్వహిస్తున్న విధులను కించపరిచేలా ప్రవీణ్ కుమార్ మాట్లాడడం విచారకరమన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ స్వేచ్ఛగా దొరుకుతున్నాయని గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు బిఎస్‌పి నేతగా ప్రవీణ్ కుమార్ మీడియా సమావేశం పెట్టి విమర్శలు చేసిన విషయం మర్చిపోయారా? అని ప్రశ్నించారు. ఇపుడు ప్రవీణ్ కుమార్ పార్టీ మారి బిఆర్ఎస్ నాయకులను ప్రసన్నం చేసుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారన్నారు.

## వంద రోజుల్లో పూర్తిచేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మాస్టర్ ప్లాన్ ను సిఎంకు అధికారులు వివరించారు. మేడారం మహాజాతర నాటికి భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సిఎం సూచించారు.

మేడారం అభివృద్ధికి సంబంధించి పలు డిజైన్లను సిఎం పరిశీలించారు.పూర్తిగా సహజసిద్ధమైన రాతి కట్టడాలతో నిర్మాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఎంట్రీ, ఎగ్జిట్, పార్కింగ్ వసతులు ఉండాలని అన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జంపన్న వాగులో నీరు నిలిచేలా ఏరియాలవారీగా చెక్ డ్యామ్ ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఈ వారంలో మేడారంకు వచ్చి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తానని తెలిపారు.ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. అలాగే బాసర జ్ఞాన సరస్వతీ దేవాలయ విస్తరణ, అభివృద్ధికి సంబంధించి కూడా పలు సూచనలు చేశారు. అన్ని దేవాలయాల అభివృద్ధికి సంబంధించి స్థానిక సెంటిమెంట్ ను వించడంతోపాటు, స్థానిక నిపుణులు, పూజారుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, దనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మ ణ్, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సంప్రదాయాలు ఉట్టిపడేలా చేయాలి: మంత్రి పొంగులేటి**

ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గిరిజన జాతర, తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు అవసరమైన ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేపడతున్నామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సిఎం సూచనల మేరకు సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో పంచాయితీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో కలిసి మంత్రి పొంగులేటి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా గిరిజనుల మనోభావాలకు అనుగుణంగా ఆలయ ఆధునీకరణను చేపడుతున్నామని, ఈ పనులను ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభించి జనవరి మొదటి వారంలోగా పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే మేడారం ఆలయాలకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పరిశీలించారని, మూడు నెలల వ్యవధిలో పనులు పూర్తయ్యేలా ఆదేశించారని తెలిపారు. వారం రోజుల్లో ముఖ్యమంత్రి గారు స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్నందున తగు ప్రణాళికలు, సమాచారంతో సిద్దంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదా య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఎన్నికల్లో ఓటు వేయడానికి అర్హులు. రాజ్యసభలో ఆరు సీట్లు, లోక్‌సభలో ఒక సీటు ఖాళీగా ఉన్నందున ఎలక్టోరల్ కాలేజీ ప్రస్తుత బలం 781. దీనితో మెజారిటీ మార్కు 391గా ఉంది. ఎన్‌డిఎకు 425 మంది ఎంపిలు ఉండగా, ప్రతిపక్ష కూటమికి 324 మంది మద్దతు ఉంది. పాలక లేదా ప్రతిపక్ష కూటమిలో భాగం కాని రాజకీయ పార్టీలలో 11 మంది సభ్యులు ఉన్న వైఎస్ఆర్‌సిపి ఎన్‌డిఎ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించింది. తెలంగాణకు చెందిన బిఆర్ఎస్, ఒడిశాలోని బిజెడిలు ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాయి. రాధాకృష్ణన్ తమిళనాడుకు చెందిన భారతీయ జనతా పార్టీ (బిజెపి) సీనియర్ నాయకుడు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. తెలంగాణకు చెందిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి. నక్సలైట్లను ఎదుర్కోవడానికి ప్రత్యేక పోలీసు అధికారులుగా నియమించబడిన శిక్షణ పొందిన గిరిజన యువకుల సమూహమైన సల్వా జుడుమ్‌ను చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధమని వంటి తీర్పులు సహా పలు కీలక తీర్పులిచ్చారు. అయితే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సుదర్శన్‌రెడ్డి ఇచ్చిన సల్వా జుడుమ్ తీర్పు అంశం తీవ్రంగా ప్రచారం అయింది. 2011 తీర్పు ఛత్తీస్‌గఢ్‌లో మావోయిజంపై పోరాడటానికి చేసిన ప్రయత్నాలకు ఎదురుదెబ్బ అని హోం మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. కాగా, ఎన్‌డిఎకు సంఖ్యా బలం ఉన్నప్పటికీ ఉపరాష్ట్రపతి ఎన్నికను ప్రతిపక్షాలు సైద్ధాంతిక యుద్ధంగా అభివర్ణించాయి. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆదివారం ఒక వీడియో సందేశమిచ్చారు. పార్టీ విధేయతపట్ల కాకుండా దేశంపై ఉన్న ప్రేమతో తనకు ఓటు వేయాలని ఎంపిలను కోరారు. తనకు ఓటు వేయడం ద్వారా రాజ్యసభ ప్రజాస్వామ్యానికి నిజమైన దేవాలయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇది కేవలం ఉపరాష్ట్రపతిని ఎన్నుకునే ఓటు మాత్రమే కాదని, భారతదేశ స్ఫూర్తికే ఓటు అని అన్నారు. ఆగస్టు 20న నామినేషన్ పత్రాలు దాఖలు చేసినప్పటి నుండి, రాధాకృష్ణన్ అన్ని రాష్ట్రాల ఎంపిలను బృందాలుగా కలుసుకుని ఎన్నికల్లో వారి మద్దతు కోరగా, సుదర్శన్‌రెడ్డి వివిధ రాష్ట్రాల్లో పర్యటించి ప్రతిపక్ష పార్టీల నాయకులను కలిశారు.

**ఓటింగ్‌కు బిజెడి, బిఆర్ఎస్ దూరం**

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తమ పార్టీలకు చెందిన ఎంపిలు ఓటింగ్‌కు దూరంగా ఉంటారని బిఆర్ఎస్, బిజెడిలు సోమవారం ప్రకటించాయి. కాగా, జాతీయ స్థాయిలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ, కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి రెండింటి నుండి 'సమాన దూరం కొనసాగించే' విధానంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని పార్టీ తెలిపింది. 'ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పార్టీ ఎంపిలు ఓటు వేయకుండా ఉండాలని బిజెడి అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ నిర్ణయించారు. పార్టీ సీనియర్ నాయకులు, రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఎసి) సభ్యులు, శాసనసభ్యులను సంప్రదించిన తర్వాత ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు' అని బిజెడి ఎంపి సస్మిత్ పాత్రా భువనేశ్వర్‌లో విలేకరులకు తెలిపారు. తమ పార్టీ మొత్తం దృష్టి రాష్ట్ర అభివృద్ధి, 4.5 కోట్ల ప్రజలపైనే సారించిందని పాత్రా అన్నారు. ఈ పరిణామంపై కాంగ్రెస్, బిజెపి స్పందిస్తూ బిజెడి నిర్ణయం ఉపరాష్ట్రపతి పదవికి ఎన్‌డిఎ అభ్యర్థికి పరోక్షంగా సహాయపడుతుందని పేర్కొన్నాయి.

**యూరియ కష్టాలు బాధించినందువల్లే...**

తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతపై రైతుల 'వేదన'కు ప్రతీకగా ఉపరాష్ట్రపతి ఎన్నికలకు తమ పార్టీ దూరంగా ఉంటుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు చెప్పారు. కొరత సమస్యను పరిష్కరించడంలో కాంగ్రెస్, బిజెపి రెండూ విఫలమయ్యాయని ఆరోపించారు. కొరత ఎంతగా ఉందంటే, యూరియా కోసం క్యూలలో వేచి ఉన్న రైతుల మధ్య గొడవలు జరుగుతున్నాయని బిఆర్ఎస్ నాయకుడు అన్నారు. తాము ఉపరాష్ట్రపతి ఎన్నికకు దూరంగా ఉంటున్నామని, తమ ఎంపిలు ఓటింగ్‌లో పాల్గొనబోరని చెప్పారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో నోటా అందుబాటులో ఉంటే బిఆర్ఎస్ దానిని ఉపయోగించుకునే అవకాశం ఉందని ఆయన అన్నారు.

## పాల్గొనడం లేదు

(మొదటి పేజీ తరువాయి)

తీస్తున్నాయని, అందుకే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తాము పాల్గొనడం లేదని వెల్లడించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్‌ఎలు జి.జగదీష్‌రెడ్డి, సుధీర్ రెడ్డి, కె.పి. వివేకానంద, కాలేరు వెంకటేష్, ముఠాగోపాల్, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ ఎంపి మాలోతు కవితతో కలిసి కెటిఆర్ మాట్లాడారు. యూరియా కొరతపై 20 రోజుల క్రితమే తాము కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేశామని, అయినప్పటికీ స్పందించలేదని, అందుకే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తమ పార్టీ పాల్గొనవద్దని రైతుల పక్షాన తాము నిర్ణయం తీసుకున్నామన్నారు.

మహారాష్ట్ర పోలీసులు వచ్చి హైదరాబాద్‌లో రూ.12 వేల కోట్ల విలువ చేసే డ్రగ్స్‌ను పట్టుకుంటే తెలంగాణ పోలీసులు, ఇంటలిజెన్స్, ఈగిల్, హైడ్రాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. రూ.12 వేల కోట్ల డ్రగ్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌కు ముడుపులు ముట్టాయా? అందుకే తెలంగాణ పోలీసులు చూసీ చూడనట్టు వ్యవహరించారా అని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపు ఎంఎల్‌ఎల విషయంలో పిసిసి అధ్యక్షుడు, కడియం శ్రీహరి అప్రూవర్‌లుగా మారి నేరాన్ని అంగీకరించార ని, అందుకే స్పీకర్ వెంటనే ఫిరాయింపు ఎంఎల్‌ఎలపైన వేటు వేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. పార్టీలో అన్ని చర్చించిన తర్వాతనే పార్టీ నుంచి సస్పెన్షన్ చేయాలని ఒక నిర్ణయం తీసుకున్నదని ఇంకా ఏముందని కవితనుద్ధేశించి ఒక ప్రశ్నకు సమాధానం చెప్పారు.

**మల్లన్నసాగర్‌కు గోదావరి నీళ్లు ఎక్కడనుంచి వస్తున్నాయో చెప్పాలి**

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగమైన మల్లన్నసాగర్ నుంచి మూసీకి గోదావరి జలాలను తీసుకువచ్చే పథకానికి శంకుస్థాపన చేసిన సిఎం రేవంత్ రెడ్డి, ఆ మల్లన్నసాగర్‌కు గోదావరి నీళ్లు ఎక్కడి నుంచే వస్తాయో చెప్పగలరా? అని ప్రశ్నించారు. కాళేశ్వరంను విఫలప్రాజెక్టుగా ప్రచారం చేసినందుకు రేవంత్‌తో సహా కాంగ్రెస్ నేతలంతా ముక్కు నేలకు రాసి తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్‌కు గోదావరి జలాలను తీసుకొచ్చేందుకు తమ హయాంలో రూ.1100 కోట్లతో అంచనాలను రూపొందిస్తే, ప్రస్తుతం రూ.7390 కోట్లకు అంటే ఏడు రెట్లు పెంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాధనాన్ని లూటీ చేస్తోందని ఆరోపించారు.

రూ.16 వేల కోట్లతో పూర్తయ్యే మూసి సుందరీకరణ ప్రాజెక్టును కూడా రూ.1,50,000 కోట్లకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెంచితే, తాము హైదరాబాద్ ప్రజలతో కలిసి అడ్డుకున్నామని, అందుకే రూటు మార్చిన సిఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు విడతల వారీగా జనాల సొమ్మును దోచుకునేందుకే పథకాలను మొదలుపెట్టారని ఆరోపించారు. రూ.4 వేల కోట్లతో నిర్మించిన మేడిగడ్డ బరాజ్‌లో కేవలం రూ.250 కోట్లు మాత్రమే ఖర్చయ్యే ఏడవ బ్లాక్‌లోని మూడు పిల్లర్ల రిపేర్లను తమ సొంత డబ్బులతో చేస్తామని నిర్మాణ కంపెనీ ఎల్.అండ్. టి చెబుతుంటే, ఇక ప్రజాధనం ఎలా వృథా అవుతుందని కెటిఆర్ ప్రశ్నించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలోపెట్టుకుని కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను డిజైన్ చేశారన్నారు.

హైదరాబాద్‌కు పూర్తిస్థాయిలో న్యాయం చేసేలా గోదావరి రింగ్ మేయిన్ ప్రాజెక్టును, మూసి సుందరీకరణ పూర్తి చేసేది చివరకు కెసిఆర్ ప్రభుత్వమేనని, మళ్లీ తామే అధికారంలోనికి వస్తామని కెటిఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## మూసీకి గోదావరి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాల చొరవ వల్లే హైదరాబాద్ ప్రజల దాహం తీరుతుందన్నారు.

**మూసీ నది ప్రక్షాళన ఎందుకు జరగకూడదో చెప్పాలి..**

మూసీ నది ప్రక్షాళన ఎందుకు జరగకూడదో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్‌కు 20 టిఎంసిల గోదావరి జలాలను తరలించబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందులో 16 టిఎంసిలు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు, మిగిలిన 4 టిఎంసిలు మూసీ నది ప్రక్షాళనకు వినియోగించనున్నట్లు తెలిపారు. కాలుష్యమయమైన మూసీతో నల్లగొండ జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తన పాదయాత్ర సమయంలో ఆ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మూసీని ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారు. సమస్యలు ఎదురైనా సమన్వయంతో ముందుకు వెళుతున్నామని అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని ముఖ్యమంత్రి అన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఈ పథకాన్ని పూర్తిచేస్తామని సిఎం తెల్చి చెప్పారు.

**త్వరలో మహారాష్ట్ర సిఎంను కలిసి తుమ్మిడి హట్టి ప్రాజెక్టుపై చర్చిస్తా...**

త్వరలో మహారాష్ట్ర సిఎంను కలిసి తుమ్మిడి హట్టి దగ్గర ప్రాజెక్టు నిర్మాణంపై చర్చిస్తామని చెప్పారు. తుమ్మిడి హట్టి దగ్గర 150 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు కట్టి తీరుతామన్నారు. రంగారెడ్డి, వికారాబాద్, చేవేళ్లకు సాగునీరందిస్తామన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి నుంచే గోదావరి జలాలను హైదరాబాద్‌కు తరలిస్తున్నామని, కొంద రు మల్లన్నసాగర్ అని మాట్లాడటం సరికాదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. చేవెళ్లలో వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రారంభించిన ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును కాసుల కక్కుర్తితో ఆపేశారని విమర్శించారు. దీనివల్ల చేవెళ్ల, తాండూరు, పరిగి ప్రాంతాలకు సాగునీరు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం తమ్మిడిహెట్టి దగ్గర ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల రైతులకు సాగునీరు అందిస్తుందని హామీ ఇచ్చారు. పదేళ్లు అధికారంలో ఉన్న కెసిఆర్ హైదరాబాద్‌కు తాగునీళ్లు అందించాలని ఎందుకు ప్రయత్నించలేదని ప్రశ్నించారు.

**హైదరాబాద్‌కు తాగునీరు అందించిన ఘనత నిజాం సర్కార్, కాంగ్రెస్ ప్రభుత్వాల కృషి**

ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లను 1908లో నాటి నిజాం ప్రభుత్వం నిర్మించిందన్నారు. హైదరాబాద్ ప్రజలను వరదల నుంచి కాపాడిందని, వందేళ్లకు పైగా ఈ నగరానికి తాగునీరు అందుతుందంటే దానికి కారణం వారి దూరదృష్టే అని కొనియాడారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వాల కృషి ఎంతో ఉందని గుర్తుచేశారు. 1965లో మంజీరా నది నుంచి, 2002లో కృష్ణా నది నుంచి మూడు దశల్లో నగరానికి తాగునీరు అందించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వివరించారు. పిజెఆర్ పోరాటంతోనే హైదరాబాద్‌కు మంజీరా నీళ్లు వచ్చాయని తెలిపారు. గోదావరి జలాల తరలింపునకు సంబంధించిన ప్రాజెక్టును కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రారంభించిందని, అయితే కొందరు దాన్ని తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నించారని విమర్శించారు. వైఎస్ఆర్ హయాంలో 2002లో శ్రీపాద ఎల్లంపల్లి నుంచి కృష్ణా జలాలను హైదరాబాద్‌కు తీసుకొచ్చారన్నారు. నగరానికి మంచి నీళ్లు ఇవ్వాలన్న ఆలోచన చేసింది నిజాం తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వాలే అన్నారు.

**అభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావాలి..**

ప్రపంచ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబర్ 9న తెలంగాణ రైసింగ్2047 విజన్ డాక్యుమెంట్‌ను తెలంగాణ సమాజానికి అంకితం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ పై కోపం ఉంటే తనతో కొట్లాడాలి కానీ అభివృద్ధికి అడ్డు పడొద్దని సూచించారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా తమ ప్రభుత్వం వాటిని తిప్పికొడుతుందన్నారు. కలిసి రావాలని, కడుపుల విషయం పెట్టుకోవద్దన్నారు. ఇది ఇందిరమ్మ రాజ్యం, పేదలకు న్యాయం జరిగే రాజ్యం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి డాక్టర్ కె.ఇలంబర్తి, జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

శాఖ ప్రధాన కార్యాలయం జలసౌధలో సోమవారం ప్రాజెక్టుల పురోగతినినీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం చేవెళ్లప్రాణహితను కొనసాగిస్తామన్నారు. సమ్మక్క సారక్క ప్రాజెక్టుకు సంబంధించిన ఈ నెల 23న ఢిల్లీలో జరిగే కేంద్ర జలవనరుల సంఘం సమావేశానికి హాజరై నీటి కేటాయింపులతో పాటు టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టిఎసి) అనుమతులతోపాటు ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వ అనుమతులు కూడా తీసుకోవాలని ఆయన సూచించారు. సీతారాం సాగర్, మోడికుంట వాగు, చనాకా, కొరాట డిస్ట్రిబ్యూటరీ సిస్టంతో పాటు చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణాలకు కావాల్సిన నిధులను కేంద్రం విడుదలచేసేవిధంగా ప్రతిపాదనలు సిద్ధంచేసి పంపాలన్నారు. కృష్ణా జలాల వివిధ ట్రిబ్యునల్(కెడబ్ల్యూడిటి)కి సంబంధించి సుప్రీంకోర్టులో ఈ నెల 23,25 తేదీల్లో వాదనలు ఉన్నందున అంతకు ముందే సుప్రీంకోర్టు న్యాయవాది సి.ఎస్.వైద్యనాథ్ తో చర్చించనున్నమని తెలిపారు. మేడిగడ్డ,అన్నారం,సుందిళ్ళ బ్యారేజ్ లను పునరుద్ధరణ ఎన్‌డిఎస్‌ఎ సూచనాలకు అనుగుణంగా పనులు ముందుకు సాగుతాయని, అదే సమయంలో ఐఐటి వంటి సంస్థలతో నిర్మాణానికి సంబంధించిన అంశాలను పరీక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు.కొడంగల్‌నారాయణపేట ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.అదే విధంగా డిండి,ఎస్.ఎల్.బి.సి,పెండ్లి పాకల, నక్కలగండి ప్రాజెక్టుల భూసేకరణను వేగవంతం చేయాలన్నారు. జూరాల ప్రాజెక్టు బ్రిడ్జిపై రోజు రోజుకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న దృష్ట్యా ప్రత్యామ్నాయంగా బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి అక్కడి ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పారు. వచ్చే మంత్రివర్గ సమావేశానికి ముందే దేవాదుల ప్యాకేజ్3,6 పనుల పురోగతి పై నివేదిక సమర్పించాలని ఆయన చెప్పారు.

ఎస్‌ఎల్‌బిసి పను ల పునరుద్ధరణకు గాను టన్నెల్ సమీపం లో హెలిబోర్న్ ఏరియల్ మాగ్నెటిక్ సర్వే ఏర్పాట్లును మంత్రివీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. దేశంలో తెలంగాణా ప్రభుత్వం మొట్ట మొదటిసారిగా చేపట్టిన రిజర్వాయర్ లలో పూడిక తీత పనులపై పూర్తి స్థాయిలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.ఇప్పటికే మిడ్ మానేరు, కడెం రిజర్వావాయర్ లలో పనులు మొదలుపెట్టామని ప్రస్తుతం జూరాల, నాగార్జున సాగర్, ఎస్‌ఆర్‌ఎస్‌పి నిజాం సాగర్, హుస్సేన్ సాగర్ తదితర ప్రాజెక్టులలో పూడిక తీత పనులు ప్రారంభించ బోతున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పుడు చేపట్టిన పూడిక తీత పనుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ.500 కోట్ల రాబడి ఉంటుందని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించినట్లయితే ప్రభుత్వానికి రూ. 3వేల కోట్ల నుండి రూ.4వేల కోట్ల వరకు పెరుగుతుందన్నారు. నీటిపారుదల శాఖల్లో మూడు దశాబ్దాల సుదీర్గ విరామం అనంతరం పదోన్నతుల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని, పదోన్నతులు పొందిన వారికి ఈ నెల 14న జలసౌధ లో అభినందన సభ నిర్వహించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బిఆర్ఎస్ వైఖరి ఆత్మహత్యాసదృశ్యం

డాక్టర్ కె.నారాయణ

హైదరాబాద్ : ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న దేశ ఉపరాష్ట్రపతి పదవికి జరుగుతున్న ఎన్నికలలో బిఆర్ఎస్ తటస్థ వైఖరి తీసుకోవడం అత్యంత విచారకరమని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయం తెలంగాణ ప్రజలను మోసం చేయడమే అవుతుందని విమర్శించారు. తెలంగాణ బిడ్డ జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి సహకరించిన వ్యక్తి అని, అనేక చారిత్రాత్మక తీర్పులు ఇచ్చిన న్యాయకోవిదుడు అని అన్నారు. అలాంటి వ్యక్తి ఉపరాష్ట్రపతి పదవికి పోటీ చేస్తుంటే తటస్థంగా ఉండడమంటే బిఆర్ఎస్‌కు ఆత్మహత్యాసదృశ్యమే అవుతుందని నారాయణ విమర్శించారు. ఏ తెలంగాణ పేరు చెప్పి, ప్రజల సెంటిమెంట్‌ను ఉపయోగించుకొని కెసిఆర్ రెండుసార్లు సిఎం అయ్యారని, అలాంటిది తెలంగాణ బిడ్డకు ఓటు వేయకుండా గైర్హాజరవడమంటే తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని ధ్వంసం చేయడమే అవుతుందన్నారు.

### తెలంగాణ ప్రభుత్వము

**FORM - VII**

జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం

(చూడుము సబ్ రూల్ 1 రూల్-25, సెక్షన్ - 19(1) చట్టము-30/2013)

**రూఢీ ప్రకటన**

| | |
|---|---|
| రెవిన్యూ డివిజనల్ అధికారి, భద్రాచలం మరియు భూసేకరణ అధికారి సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్: ఆర్.సి.నెం.సి /146/2023 | తేది: /05/2025 |
| జిల్లా కలెక్టర్ భద్రాద్రి కొత్తగూడెం గారి ఉత్తర్వులు : G/1301/2023 | తేది: 23/05/2025 |
| భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజ పత్రము నెం : B3/14/2025 | తేది: 23/05/2025 |

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం జెట్టిగూడెం (జెడ్) గ్రామ పరిధిలో, ఈ దిగువ షెడ్యూలులో నిర్దిష్ట పరిచిన సుమారు **ఎ.9.13 గుంటలు** లేదా తక్కువగా విస్తీర్ణం గల భూమి ప్రజా ప్రయోజనములకై అనగా సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్ నిర్మించడం కొరకు జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారి భూ సేకరణ చట్టం, 30/2013 ప్రకారం సేకరించుటకు నిర్ణయించినారు.

పైన తెలిపిన సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్ నిర్మించడం కొరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం జెట్టిగూడెం (జెడ్) గ్రామంలో కొలతలు వేసిన సుమారు **ఎ.9.13 గుంటలు** లేదా ఎక్కువ / తక్కువ కలిగిన భూమిని తీసుకొనబడినవారి యొక్క వివరములు ఈ క్రిందనుదహరించబడినవి.

**షెడ్యూల్**

గ్రామం : జెట్టిగూడెం (జడ్)  మండలం: చర్ల  జిల్లా: భద్రాద్రి కొత్తగూడెం

| క్ర. సం. | | | | | | | ఆసక్తిగల వ్యక్తి మరియు చిరునామా: పట్టాదారుని పేరు | | అనుభవదారుని పేరు | | హద్దులు | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 1 | 1 | 1/1/A Full | 1/1/3 | పట్టా | మెట్ట | 0.06 1/2 | ఇందల కుంచి లక్ష్మణ కుమార బాబు తండ్రి రామారావు | బిసి | ఇందల కుంచి లక్ష్మణ కుమార బాబు తండ్రి రామారావు | బిసి | VB Ummadivara | 1/1/B | 16/A | 1/3B | |
| 2 | 2 | 1/1/A Full | 1/1/2 | పట్టా | మెట్ట | 0.06 1/2 | ఇందల వెంకటరమణ తండ్రి రామారావు | బిసి | ఇందల వెంకటరమణ తండ్రి రామారావు | బిసి | VB Ummadivara | 1/1/B | 16/A | 1/3B | |
| 3 | 3 | 1/1/A Full | 1/1/1 | పట్టా | మెట్ట | 0.06 1/2 | ఇందల ప్రభాకరరావు తండ్రి రామారావు | బిసి | ఇందల ప్రభాకరరావు తండ్రి రామారావు | బిసి | VB Ummadivara | 1/1/B | 16/A | 1/3B | |
| 4 | 4 | 1/1/A Full | 1/1/4 | పట్టా | మెట్ట | 0.06 1/2 | ఇందల గోపాల బుచ్చిబాబు తండ్రి రామారావు | బిసి | ఇందల గోపాల బుచ్చిబాబు తండ్రి రామారావు | బిసి | VB Ummadivara | 1/1/B | 16/A | 1/3B | |
| 5 | 5 | 1/3B | 1/3 | ప్రభుత్వ | - | 0.31 | ప్రభుత్వ భూమి | - | డొంక | - | 1/1/A | 1/1/B | 16/A | 16/B | |
| 6 | 6 | 2/4A Full | 2/4 | ప్రభుత్వ | - | 0.14 | ప్రభుత్వ భూమి | - | డొంక | - | 1/3B | 1/2 | 3B | 2/4B | |
| 7 | 7 | 3B | 3 | పట్టా | మెట్ట | 1.13 1/2 | దాట్ల శ్రీధర్ తండ్రి చిన్న వెంకటపతి రాజు | ఓసి | దాట్ల శ్రీధర్ తండ్రి చిన్న వెంకటపతి రాజు | ఓసి | 16/B | 2/4A | 3AB | 6/A/B | కొబ్బరి చెట్లు-5, తాటి చెట్టు-1 |
| 8 | 8 | 6A/B | 6/ఇ | పట్టా | మెట్ట | 0.23 | బుద్దరాజు వెంకట శ్రీదర వర్మ తండ్రి సుబ్బరాజు | ఓసి | బుద్దరాజు వెంకట శ్రీదర వర్మ తండ్రి సుబ్బరాజు | ఓసి | 3B | 6B | 16A/A | 7/1/A/B | మామిడి, టేకు-3 |
| | 12 | 8/2A/B | 8/2ఇ | పట్టా | మెట్ట | 0.09 1/2 | బుద్దరాజు వెంకట శ్రీదర వర్మ తండ్రి సుబ్బరాజు | ఓసి | బుద్దరాజు వెంకట శ్రీదర వర్మ తండ్రి సుబ్బరాజు | ఓసి | 7/1/A/1 | 8/2B | 8/2A/a | 8/3A | |
| 9 | 9 | 6A/B | 6/ఆ | పట్టా | మెట్ట | 0.22 1/2 | బుద్దరాజు వెంకట సీతారామరాజు తండ్రి సుబ్బరాజు | ఓసి | బుద్దరాజు వెంకట సీతారామరాజు తండ్రి సుబ్బరాజ | ఓసి | 3B | 6B | 6A/A | 7/1/A/B | |
| | 13 | 8/2A/B | 8/2ఆ | పట్టా | మెట్ట | 0.10 | బుద్దరాజు వెంకట సీతారామరాజు తండ్రి సుబ్బరాజు | ఓసి | బుద్దరాజు వెంకట సీతారామరాజు తండ్రి సుబ్బరాజు | ఓసి | 7/1/A/1 | 8/2B | 8/2A/a | 8/3A | |
| 10 | 9 | 6A/B | 6/అ | పట్టా | మెట్ట | 0.22 1/2 | బుద్దరాజు వెంకట రామ నరసింహ వర్మ తండ్రి సుబ్బరాజు | ఓసి | బుద్దరాజు వెంకట రామ నరసింహ వర్మ తండ్రి సుబ్బరాజు | ఓసి | 3B | 6B | 6A/A | 7/1/A/B | |
| | 14 | 8/2A/B | 8/2అ | పట్టా | మెట్ట | 0.09 1/2 | బుద్దరాజు వెంకట రామ నరసింహ వర్మ తండ్రి సుబ్బరాజు | ఓసి | బుద్దరాజు వెంకట నరసింహ వర్మ తండ్రి సుబ్బరాజు | ఓసి | 7/1/A/1 | 8/2B | 8/2A/a | 8/3A | |
| 11 | 11 | 7/1/A/B | 7/1 | పట్టా | మెట్ట | 0.31 1/2 | దాట్ల త్రినాద కృష్ణం రాజు తండ్రి ఆంజనేయ వర్మ | ఓసి | దాట్ల త్రినాద కృష్ణం రాజు తండ్రి ఆంజనేయ వర్మ | ఓసి | 6A/B | 7/1/B | 7/1A/A | 8/2A/B | తాటి చెట్టు-4 |
| 12 | 15 | 8/3A Full | 8/3 | పట్టా | మెట్ట | 0.21 | పెనుమత్స శ్రీనివాస్ తండ్రి శ్రీరామ్ మూర్తి | ఓసి | పెనుమత్స శ్రీనివాస్ తండ్రి శ్రీరామ్ మూర్తి | ఓసి | 8/2A/B | 8/3B | 9/1/A/A | 9/1A/B | |
| 13 | 16 | 9/1/A/B | 9/1 | పట్టా | మెట్ట | 1.09 | దాట్ల చిన్న రామచంద్ర రాజు తండ్రి వెంకటపతి రాజు | ఓసి | దాట్ల చిన్న రామచంద్ర రాజు తండ్రి వెంకటపతి | ఓసి | 8/3A | 8/3B | 9/1/A/A | 10/2A/B | |
| 14 | 17 | 10/2A/B | 10/2/1 | పట్టా | మెట్ట | 0.20 | యడారి లాలయ్య తండ్రి నరసయ్య | బిసి | యడారి లాలయ్య తండ్రి నరసయ్య | బిసి | 9/1/A/1 | 8/4 | 10/2A/A | 16B | తాటి చెట్టు-6 |
| 15 | 18 | 16B | 16 | పట్టా | మెట్ట | 0.30 | దాట్ల వెంకట రమణయ్య వర్మ తండ్రి వీర భద్రరాజు | ఓసి | దాట్ల వెంకట రమణయ్య వర్మ తండ్రి వీర భద్రరాజు | ఓసి | 8/3A | 8/4 | 10/2A/B | VB Kothagudem(Z) | |
| | | మొత్తం విస్తీర్ణం : 9.13 | | | | | | | | | | | | | |

**సంక్షిప్తం**

| క్రమ సంఖ్య | భూమి రకం | విస్తీర్ణం (య.) |
|---|---|---|
| 1 | పట్టా భూమి | 8.08 |
| 2 | ప్రభుత్వ భూమి | 1.05 |
| | మొత్తం | 9.13 |

**చెట్లు, కట్టడాలు**

| క్రమ సంఖ్య | చెట్లు, కట్టడముల వివరములు | కట్టడాలు | చెట్లు |
|---|---|---|---|
| 1 | కొబ్బరి చెట్లు | | 5 |
| 2 | తాటి చెట్లు | | 11 |
| 3 | మామిడి చెట్లు | | 4 |
| 4 | టేకు చెట్లు | | 3 |
| | మొత్తం చెట్లు | | 23 |

భూ సేకరణ చట్టము నెం.30/2013 లో సెక్షన్ - 15 అనుసరించి భూ సేకరణ పై ఆసక్తి గల వ్యక్తులు దాఖలు చేసిన అభ్యంతరములు / ఆక్షేపణలు విచారించిన మీదట ఈ ప్రకటన జారీ చేయడమైనది. రూల్-25 యొక్కఫారం-7 (సెకండ్ సబ్ రూల్ (1) మరియు చట్టం-30/2013 లోని సెక్షన్-19 (1) మరియు భూ సేకరణ పునరావాసం మరియు పునరావాస చట్టం, 2013లో బదిలీ (చట్టం నెం: 30/2013).

పై భూ సేకరణలో పునరావాస కుటుంబములు లేవు. బొగ్గు గనులు, ఇనుప ఖనిజ, సున్నపురాయి లేక ఇతర ఖనిజ సంపద కలిగిన భూమిని లేదా కొంత భాగముగల భూమి త్రవ్వబడిన లేదా తొలగించబడిన లేదా ప్రాజెక్ట్ నిర్మాణము కొరకు ఉపయోగించుచున్న భూమిని భూసేకరణ చేయరాదు. సబ్-కలెక్టర్, భద్రాచలం వారి కార్యాలయంలో భూ సేకరణకు సంబంధించిన భూముల ప్రణాళికను కార్యాలయము పనిచేయు దినములలో తనిఖీ చేసుకొనవచ్చును.

| సం/- | సం/- | సం/- |
|---|---|---|
| శ్రీ కె. దామోదర్ రావు, భూసేకరణ అధికారి, సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్ మరియు రెవిన్యూ డివిజనల్ అధికారి, భద్రాచలం | శ్రీ డి. వేణు గోపాల్, అదనపు కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా | శ్రీ జితేష్ వి. పాటిల్, జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా |

DIPR RO NO. 584/LA/PP/Advt/Pub/2025-26

## తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో
# సురవరం కృషి చిరస్మరణీయం




తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్

చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో సురవరం సంస్మరణ సభ

ఎన్ఆర్ఆర్ సెంటర్‌లో లైబ్రరీకి సురవరం పేరు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని సిపిఐ సొంతం చేసుకోవడం ద్వారా ప్రత్యేక రాష్ట్ర చరిత్ర పుట్టల్లో సిపిఐకి ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుందని, ఇందులో కమ్యూనిస్టు అగ్రనాయకులు సురవరం సుధాకర్‌రెడ్డి కృషి మరవలేనిదని తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ గౌరవ సలహాదారు సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ కొండాపూర్‌లోని నీలం రాజశేఖర రెడ్డి పరిశోధనా కేంద్రంలో గల ఇంద్రజిత్ గుప్తా హాల్‌లో జరిగింది. సిపిఐ జాతీయ కార్యదర్శి, సిఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ అధ్యక్షతన జరిగిన సభకు డాక్టర్ రియాజ్, సిఆర్ ఫౌండేషన్ అధక్షులు ముప్పాళ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, మాజీ ఎంఎల్‌సి పి.జె.చంద్రశేఖర రావు, కోశాధికారి వి.చెన్నకేశవరావు, సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి డాక్టర్ బి.వి.విజయలక్ష్మి ప్రసంగించారు. ఈ సందర్భంగా నీలం రాజశేఖరరెడ్డి రిసెర్చ్ సెంటర్‌లో గ్రంథాలయానికి సురవరం గ్రంథాలయంగా నామకరణం చేస్తూ ఏర్పాటు చేసిన లోగోను సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆవుల మంజులత ఆవిష్కరించగా, గ్రంథాలయాన్ని డాక్టర్ రియాజ్ ప్రారంభించారు. అనంతరం డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి లాంటి గొప్ప నాయకుడి పేరుతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని తాను ప్రారంభించే అవకాశం రావడంతో తన జీవితంలో గొప్ప మైలు రాయి అని, మరిచిపోలేని అనుభూతి అన్నారు. తన చిన్నతనంలో సిపిఐ నేత నల్లమల గిరిప్రసాద్ ఉపన్యాసం తనపై చెరగని ముద్ర వేసిందని, విద్యార్థి దశలోనే తాను ఆర్ఎస్‌యులో పనిచేశానని తెలిపారు. సిపిఐ ఆధ్వర్యంలో నాడు సోవియట్ భూమి పత్రిక వచ్చేదని దానిని చూసిన ప్రతిసారి భూతల స్వర్గమైన ఆ దేశం భూభాగంపై ఎనాటికైనా అడుగు పెట్టాలనే కోరిక బలంగా ఉండేదన్నారు. ఆలాంటి సోవియట్ యూనియన్ పతనం మానవ నాగరికతలోనే ఓపెద్ద విషాదమని, ఆ దేశం విచ్ఛిన్నం కాకపోయి ఉంటే ప్రపంచానికే ఆదర్శంగా ఉండడంతో పాటు భారతదేశానికి ఒక స్ఫూర్తిగా నిలిచేదని ఆయన పేర్కొన్నారు. ప్రగతిశీల శక్తులే సమాజాన్ని ముందుండి నడిపిస్తాయని, అయితే వాటిని అస్థిత్వఉద్యమాలు గుర్తించడంలో పూర్తిగా విఫలమైయ్యాయన్నారు. కగార్ అపరేషన్‌కు వ్యతిరేకంగా సిపిఐ మొట్ట మొదటిగా గళమెత్తడం, ఇది దేశ వ్యాప్తంగా కొంత ప్రభావం చూపిందని ఆయన పేర్కొన్నారు. డాక్టర్ నారాయణ మాట్లాడుతూ... సురవరం సుధాకర్ రెడ్డి ఆదర్శవంతమైన కమ్యూనిస్టు నేత అని, దేశ రాజకీయాలలోనే కాకుండా విద్యార్థి, యువజన నాయకుడుగా అంతర్జాతీయ రాజకీయాల్లో సైతం ప్రత్యక్షంగా పాల్గొనడమే కాకుండా క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. సుధాకర్‌రెడ్డి ఎంత సౌమ్యుడో, రాజకీయ, సైద్ధాంతిక అంశాల్లో అంత నిక్కచ్చిగా ఉండేవారన్నారు. ముప్పాళ నాగేశ్వరరావు మాట్లాడుతూ సుధాకరరెడ్డి అంటే ఓ విజ్ఞాన గని అని కొనియాడారు. ఆయనకు ప్రతి అంశం పట్ల అవగాహన ఉండేదని, ఎప్పుడు ఏమి మాట్లాడినా వాస్తవికంగా శాస్త్రీయంగా మాత్రమే ఉండేదన్నారు. దేశవ్యాప్తంగా సురవరం సుధాకర్‌రెడ్డి తన ప్రసంగాల ద్వారా లక్షలాది మందిని ఆకట్టుకోవడం ద్వారా వేలాది మందిని కమ్యూనిస్టులను తయారు చేశారని, అందులో తాను కూడా ఒక్కడినని పేర్కొన్నారు. పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ సువరం సుధాకర్‌రెడ్డి జీవితం మొత్తం తెరిచిన పుస్తకమన్నారు. ఆయన ఓ ఆదర్శవంతుడు, మేధావులలో మేధావి, సామాన్య కార్యకర్తలలో ఓ కార్యకర్తగా ప్రతి ఒక్కరితో కలిసిపోయే మానవతావాది అని కొనియాడారు. పార్లమెంట్ సభ్యులుగా ఆయన అనేక కుంభకోణాలను వెలుగులోకి తీసుకువచ్చారన్నారు. దేశవ్యాప్తంగా జాతీయ ఉపాధి హామీ పథకం రూపకల్పనలో సురవరం సుధాకర్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ ప్రజా సంఘాల నిర్మాణం, ఉద్యమాల్లో సురవరం సుధాకర్‌రెడ్డి కృషి ఎప్పటికీ మరవలేనిదన్నారు. ప్రజా సంఘాలే పార్టీకి పట్టు కొమ్మలని భావించే ఆయన అవి స్వతంత్రంగా బలోపేతం అయ్యేందుకు అందించే సహాయ సహకారాలు చాలా నిర్మాణాత్మకంగా ఉండేవని చెప్పారు. డాక్టర్ బి.వి.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని సురవరం సుధాకర్‌రెడ్డి బలంగా విశ్వసించే వారన్నారు. సుధాకర్ రెడ్డి నిత్యం అధ్యయశీలుడన్నారు. అలాంటి వ్యక్తి పేరుతో గ్రంథాలయం ఏర్పాటు చేయడం సముచితమని నిర్ణయమన్నారు. జోత్సభట్ల కల్పన, డాక్టర్ కె.ప్రతిభా, డాక్టర్ కె.రజని, ఎబికె.ప్రసాద్, నర్సారెడ్డి, పూర్ణచందర్‌రావు, చంద్రకాంత్, తమ్మారెడ్డి భరద్వాజ, రమేశ్‌బాబు ఆవుల మంజులత, పి.ప్రేమ్ పావని సురవరం సుధాకర్‌రెడ్డితో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

# ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసేది కమ్యూనిస్టులే

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

పేదల పట్ల కమ్యూనిస్టులకు ఎంతో అంకితభావం : వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు

హనుమకొండలో ఘనంగా సురవరం సంస్మరణ సభ




**ప్రజాపక్షం/హనుమకొండ :** ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసేది కమ్యూనిస్టులేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లా కార్యదర్శులు కర్రె బిక్షపతి, షేక్ బాష్ మియా అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ నిత్యం ప్రజా జీవితంలో ఉండే కమ్యూనిస్టులకు ఎలాంటి మచ్చ ఉండని నిస్వార్థ పరులని, సురవరం, సీతారాం ఏచూరి, గద్దర్ లాంటి వారు మరణించినప్పుడు ప్రజలు నీరాజనాలు పలికారని అన్నారు. త్యాగాలకు, పోరాటాలకు నిలయం కమ్యూనిస్టు పార్టీ అని, అందుకే వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నా నేటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉందన్నారు. ఎన్నికలు ధన ప్రవాహంగా మారిపోయినా, మతోన్మాద శక్తులు ప్రజలను విభజిస్తున్నా వాటికి ఎదురొడ్డి సిపిఐ నిలబడిందన్నారు. అలాంటి వారికి ఎర్రజెండా అంటే భయమని, దేశంలో కమ్యూనిజాన్ని లేకుండా చేయాలనుకుంటున్నారని అన్నారు. ఈ నెల 11 నుండి 17 వరకు నిర్వహిస్తున్న తెలంగాణా సాయుధ పోరాట వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ కమ్యూనిస్టులు బడుగు, బలహీన వర్గాల కోసమే పోరాడుతారని, పేద ప్రజల పట్ల కమ్యూనిస్టులకు ఎంతో అంకితభావం ఉంటుందని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం, హక్కుల సాధనలో కమ్యూనిస్టులు ముందుంటారని అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి లేని లోటు వామపక్షాలతో పాటు ప్రజలకు తీరని లోటు అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్పొరేట్ వర్గాల కోసమే పనిచేస్తున్నదని అన్నారు. దేశంలో భవిష్యత్తు కమ్యూనిస్టులదేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీనియర్ నాయకులు టి.వెంకట్రాములు, మేకల రవి, సిరబోయిన కరుణాకర్, పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, సయ్యద్ వలి ఉల్లా ఖాద్రి, టి.విశ్వేశ్వర్ రావు, పల్లె నర్సింహా, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, సిపిఎం నాయకులు ఆరూరి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారుల పాటలు ఉత్తేజ పరిచాయి.

### పార్టీ ఫిరాయింపులకు ఆజ్యం పోసింది బిఆర్ఎస్సే

'మీడియా'తో కూనంనేని సాంబశివరావు

రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపులకు ఆజ్యం పోసింది బిఆర్ఎస్సేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని అన్నారు. ఏ పార్టీ వారయినా పార్టీ మారగానే సభ్యత్వం రద్దు చేయాలని, ఇందుకు పార్టీ ఫిరాయింపుల చట్టంలోనే మార్పులు రావాలని సూచించారు. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సీబీఐపై నమ్మకం పోయిందని, కేంద్రం కనుసన్నల్లో కాకుండా సీబీఐ నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు.

# తలసరి ఆదాయంలో తెలంగాణ అగ్రస్థానం




డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తలసరి ఆదాయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే (ప్రతి వ్యక్తి ఆదాయంలో రూ.3.87 లక్షలతో) అగ్రస్థానంలో నిలిచిందని, కర్నాటక, హర్యానాను అధిగమించి, ఐదు సంవత్సరాల తర్వాత తొలిసారి అగ్రస్థానాన్ని సాధించిందని డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. వ్యవసాయం పరిశ్రమలు, సేవా రంగం స్థిరమైన వృద్ధితో మొత్తంగా తెలంగాణ రాష్ట్రం భారతదేశంలోనే అత్యంత చురుకైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలుస్తూ, ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. వార్షిక రుణ ప్రణాళికలో మొదటి త్రైమాసికలో 33.64 శాతం సాధించడం అభినందనీయ మన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు, స్వయం ఉపాధి పథకాలకు, వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు సూచించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ రైసింగ్‌లో బ్యాంకర్ల పాత్ర ఉందన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో బ్యాంకులు ప్రాధాన్య రంగ రుణాల విభాగంలో మంచి ఫలితాలు సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం నిరంతరం అధిక సిడి రేషియోను కొనసాగించడం గర్వకారణమని, ఈ త్రైమాసికంలో ఇది 126.50 శాతంగా ఉన్నదన్నారు. తెలంగాణ దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా ఉన్నదని, పరిశ్రమలు, వ్యవసాయం, సేవా రంగాల్లో బలమైన వృద్ధితో పాటు, అనేక అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందని భట్టి వివరించారు. వ్యవసాయ రంగాన్ని ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావించి, పలు పథకాలను అమలు చేస్తోందని, అర్హులైన రైతులకు రూ.2 లక్షల వరకు పంట రుణ మాఫీ, రైతు భరోసా, కొన్ని పంటలకు బోనస్, ప్రధానమధ్య తరహా సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ లాంటివి ఉన్నాయన్నారు. తద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా పెరుగుతోందన్నారు. రైతుల కోసం ఇచ్చిన హామీని నిలబెట్టి సిఎల్‌డబ్ల్యు 2024 పథకం కింద అర్హులైన వారికి రుణమాఫీని తక్కువ సమయంలోనే అమలు చేసి చరిత్ర సృష్టించామని ఆయన తెలిపారు. గణనీయ సంఖ్యలో కిసాన్ క్రెడిట్ కార్డు ఖాతాలను పునరుద్ధరించి, రైతులకు నిధులు విడుదల చేశామని, పంట ఉత్పత్తి, ముఖ్యంగా వరి ఉత్పత్తి పెరగడంతో, తెలంగాణ ఎఫ్‌సిఐకి వరి సరఫరా చేసే ప్రధాన రాష్ట్రాలలో ఒకటిగా తెలంగాణ ఎదుగుతోందని అన్నారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తోందన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల మహిళలను సాధికారత కల్పించేందుకు, ఆదాయ సృష్టి చేసే కార్యకలాపాలకు బ్యాంకులు మరింత రుణ సహాయం అందిచాలని సూచించారు. వ్యాపారానికి అనుకూలమైన, సృజనాత్మక విధానాలు, ప్రభుత్వ చొరవతో రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగి, పరిశ్రమల వృద్ధి, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. ఎంఎస్ఎంఇ రంగం రాష్ట్రంలో అత్యధిక ఉపాధి అవకాశాలు కల్పించే రంగాలలో ఒకటని, సిజిటిఎంఎస్ఇ (క్రెడిట్ గ్యారెంటీ ట్రస్ట్ ఫర్ మైక్రోస్మాల్ ఎంటర్‌ప్రైజెస్) కవరేజ్, వర్కింగ్ క్యాపిటల్ రుణాలను పెంచాలని సూచించారు.

**రైతుల రుణాల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించండి :**

వ్యవసాయ రుణాలు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు మానవియ కోణంలో ఆలోచన చేయాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సూచించారు. రుణం కావాలంటే ఆస్తులు తాకట్టు పెట్టాలని, బ్యాంకుల్లో డబ్బులు డిపాజిట్ చేయాలని బ్యాంకర్లు ఒత్తిడి చేయడం సరైనది కాదని సూచించారు. ప్రభుత్వ ఆలోచనలను దృష్టిలో పెట్టుకొని రైతులకు సకాలంలో, పెద్ద ఎత్తున బ్యాంకర్లు రుణాలు ఇవ్వాలన్నారు. రైతుల పక్షాన రైతు రుణమాఫీ, రైతు భరోసా పేరుతో రూ. 30 వేల కోట్లను బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడం బ్యాంకింగ్ రికవరీ చరిత్రలో ఇదొక రికార్డు అని అన్నారు. రాష్ట్రంలో మొదటి సంవత్సరంలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఐదు లక్షల రూపాయాలు ఖర్చు చేస్తోందని, ఇందిరమ్మ లబ్ధిదారులకు కూడా రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను కోరారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా లబ్ధి పొందాలని ఆశిస్తున్న యువకుల పట్ల బ్యాంకర్లు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలన్నారు.



# కాంగ్రెస్ బిసిలను మోసం చేస్తోంది

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కామారెడ్డి బిసి డిక్లరేషన్‌ను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలను మోసం చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బిసిలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా మోసం చేస్తోందన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు అనుసరించాల్సిన వ్యూహాలపై హైదరాబాద్, బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో పలు బిసి సంఘాల నాయకులతో కల్వకుంట్ల కవిత భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇంతవరకు తెలంగాణ బిసిల రిజర్వేషన్ల అంశాన్ని పార్లమెంట్‌లో ఎందుకు ప్రస్తావించలేదో ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కవిత డిమాండ్ చేశారు.


### గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, పటాన్‌చెరు & రామచంద్రాపురం సర్కిల్-22, శేరిలింగంపల్లి జోన్, జిహెచ్ఎంసి.

NIT No. 02/DC/PTC-RCP-C-22/SLPZ/GHMC/2025-26,  నోటిఫికేషన్  తేదీ: 08.09.2025

జిహెచ్ఎంసి, ఎస్ఎల్‌పి జోన్, సర్కిల్-22, భారతినగర్, వార్డు 111లోని కన్యకాపరమేశ్వరి ఆలయం పక్కన ఉన్న మోడల్ రైతు బజార్‌లో వ్యాపార ప్రయోజనాల కోసం స్టాళ్లను లీజుకు తీసుకోవడానికి టెండర్ షెడ్యూళ్ల జారీ కోసం దరఖాస్తులను ఆహ్వానించడమైనది. జనరల్ & రిజర్వ్‌డ్ కేటగిరీలో అర్హత కలిగిన వ్యక్తుల నుండి సీల్డ్ టెండర్ - కమ్ - ఓపెన్ వేలం ప్రక్రియ.

| | |
|---|---|
| టెండర్ షెడ్యూళ్ల జారీ/ స్వీకరణ స్థలం: | డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, పటాన్‌చెరు & రామచంద్రాపురం సర్కిల్-22, శేరిలింగంపల్లి జోన్, జిహెచ్ఎంసి. |
| అప్లికేషన్ ఫారముల స్వీకరణ | తేది: 15.09.2025 నుండి 20.09.2025న అన్ని పని దినాలలో కార్యాలయ వేళల్లో మధ్యాహ్నం 2.30 గంటల వరకు. |
| టెండర్ షెడ్యూళ్ల జారీ తేది | తేది: 22.09.2025 నుండి 23.09.2025న మ.2.30గం.ల వరకు అన్ని పని దినాలలో కార్యాలయ వేళల్లో మధ్యాహ్నం 2.30 గంటల వరకు. |
| టెండర్ షెడ్యూళ్ల దాఖలుకు ఆఖరి తేది | **తేది: 24.09.2025 నుండి 25.09.2025న మ.3.30గం.ల వరకు** |
| టెండర్ షెడ్యూల్స్ మరియు బహిరంగ వేలం ప్రారంభ తేదీ / సమయం / స్థలం మరియు పరిశీలన | డిప్యూటీ కమిషనర్ కార్యాలయం, పటాన్‌చెరు & రామచంద్రాపురం సర్కిల్-22, శేరిలింగంపల్లి జోన్, జిహెచ్ఎంసి వద్ద **26.09.2025న ఉ.10.30గం.లకు.** |

| | | |
|---|---|---|
| **దరఖాస్తు ఖర్చు:** (తిరిగి చెల్లించబడదు) | కమిషనర్, జిహెచ్ఎంసి, హైదరాబాద్ పేరు మీద డిడి. | రూ.500/- |
| | కమర్షియల్ టాక్స్ ఆఫీసర్, హైదరాబాద్ పేరు మీద డిడి. | రూ.90/- |
| దరఖాస్తుతో పాటు ఇఎండి: | | అనుబంధం-1లో జతచేయబడింది |

సం/- డిప్యూటీ కమిషనర్, పటాన్‌చెరు & రామచంద్రాపురం సర్కిల్-22, ఎస్ఎల్‌పి జోన్, జిహెచ్ఎంసి

DIPR R.O. No. : 7735-PP/CL/ADVT/1/2025-26, Date: 08-09-2025

### చీఫ్ ఇంజనీర్ కార్యాలయం, హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ
hmda
ఈస్ట్ వింగ్, 7వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500038

NIT No. HMDA/DEV/CE/24/2025-26  ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెంటర్ నోటీసు  తేదీ: 04.09.2025

ఈ క్రింది పనుల కోసం చెల్లుబాటు అయ్యే రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు ఆహ్వానించడమైనవి:

| క్ర. సం. | పని పేరు | టెండర్ ఆహ్వాన అధికారం | దాఖలుకు ఆఖరి తేది |
|---|---|---|---|
| 24/1 | బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అంబేద్కర్ ఎక్స్ రోడ్ నుండి బొమ్మక్ శాంతమ్మ గార్డెన్ వరకు వీధి దీపాల ఏర్పాట్లు అందించడం. (GO.Ms.No. 59 & CAD (సంస్కరణలు) ప్రకారం షెడ్యూల్ తెగ కాంట్రాక్టర్లకు రిజర్వ్ చేయబడింది) | చీఫ్ ఇంజనీర్, హెచ్ఎండిఎ | 29.09.2025న మ.03.00గం.లు |
| 24/2 | బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని చింతల్ చెరువు సాయి రెసిడెన్సీ జంక్షన్ నుండి బంగారు మైసమ్మ దేవాలయం వరకు వీధి దీపాల ఏర్పాట్లు. (GO.Ms.No. 59 & CAD (సంస్కరణలు) ప్రకారం షెడ్యూల్ కులాల కాంట్రాక్టర్లకు రిజర్వ్ చేయబడింది) | చీఫ్ ఇంజనీర్, హెచ్ఎండిఎ | 29.09.2025న మ.03.00గం.లు |
| 24/3 | లైటింగ్ ఏర్పాట్లను అందించడం - (i) రంగారెడ్డి జిల్లా, పెద్దఅంబర్‌పేట్ (వి), అబ్దుల్లాపూర్‌మెట్ (ఎం) వద్ద ఉన్న సదాశివ, హెవెన్స్‌లోని సెంట్రల్ పార్క్ పునరుద్ధరణ. (ii) రంగారెడ్డి జిల్లా, పెద్దఅంబర్‌పేట్(వి), అబ్దుల్లాపూర్‌మెట్ (ఎం) వద్ద ఉన్న సదాశివ హెవెన్స్‌లోని స్పోర్ట్స్ పార్కుల అభివృద్ధి. (iii) రంగారెడ్డి జిల్లా, పెద్దఅంబర్‌పేట్(వి), అబ్దుల్లాపూర్‌మెట్ (ఎం) వద్ద ఉన్న సదాశివ హెవెన్స్‌లోని లేక్‌వ్యూ పార్క్ అభివృద్ధి. (iv) రంగారెడ్డి జిల్లా, పెద్దఅంబర్‌పేట్(వి), అబ్దుల్లాపూర్‌మెట్(ఎం) వద్ద ఉన్న సదాశివ హెవెన్స్‌లోని కమ్యూనిటీ పార్క్ అభివృద్ధి. | చీఫ్ ఇంజనీర్, హెచ్ఎండిఎ | 29.09.2025న మ.03.00గం.లు |
| 24/4 | తూంకుంట మెయిన్ జంక్షన్ నుండి మందయిపల్లి (వి), శామీర్ పేట్ (ఎం), మేడ్చల్ మల్కాజిగిరి (జిల్లా) వరకు వీధి దీపాల ఏర్పాటు | చీఫ్ ఇంజనీర్, హెచ్ఎండిఎ | 29.09.2025న మ.03.00గం.లు |
| 24/5 | బహదూర్‌పల్లి (వి), దుండిగల్ గండిమైసమ్మ, మేడ్చల్-మల్కాజ్‌గిరి (డి) లోని సర్వేనెం. 239, 240, 247 & 249 లోని ఆమోదించబడిన HMDA లేఅవుట్‌కు అండర్ గ్రౌండ్ కేబుల్ సిస్టమ్‌తో బాహ్య విద్యుదీకరణను అందించడం. | సూపరింటెండింగ్ ఇంజనీర్-II | 29.09.2025న మ.03.00గం.లు |

మరిన్ని వివరాలకు https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- చీఫ్ ఇంజనీర్, హెచ్ఎండిఎ

DIPR R.O. No. : 7728-PP/CL/ADVT/1/2025-26, Date: 08-09-2025

# జనరల్
STATE & REGIONAL NEWS



## చికితను అభినందించిన సిఎం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇటీవల కెనడాలో జరిగిన 2025యూత్ వరల్డ్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున బంగారు పతకం గెలుచుకు న్న తొలి మహిళగా రికార్డు సృష్టించిన చికిత తనిపర్తిను తెలంగాణ ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సోమవారం తన నివాసంలో అభినందించారు. ము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చికిత మర్యాదపూర్వకంగా కలిశారు. ఒలంపిక్స్ లో పతకం సాధించేలా ప్రభుత్వం తరపున పూర్తి శిక్షణ అందించేందుకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్న సిఎం చికితకు హామి ఇచ్చారు. చైనాలోని షాంగైలో జరిగిన సీనియర్ వరల్డ్ కప్ జట్టు పోటీల్లో చికిత రజత పతకం కూడా సాధించిన విషయం తెలిసిందే. సిఎంను కలిసిన వారిలో చికితతో పాటు ఎంఎల్ఎ విజయరమణారావు, శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, రాజేందర్ రావులు ఉన్నారు.

## నియోపోలిస్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్ ప్రారంభించిన సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కోకాపేట వద్ద నియో పోలిస్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్‌ను సోమవారం సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. హెచ్ఎండిఏ నిర్మించిన నియోపోలిస్, కోకాపేట్ ప్రాంతాన్ని ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానం చేస్తూ ట్రంపెట్‌ను నిర్మించారు. నియో పోలిస్ ప్రాంతంలో భారీగా రెసిడెన్షియల్, కమర్షియల్ ప్రాజెక్టులు నిర్మాణం అవుతున్నాయి. దీంతో నియోపోలిస్, కోకాపేట ప్రాంతంలో భారీగా ఐటి కంపెనీలు తరలి రానున్నాయి. భవిష్యత్ ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ ట్రంపెట్ నిర్మాణాన్ని చేపట్టారు. ఈ ట్రంపెట్ జంక్షన్‌తో మోకిల, శంకర్‌పల్లి ప్రాంతాలకు ట్రాఫిక్ కష్టాలు తప్పనున్నాయి. నియో పోలీస్ నుంచి ట్రంపెట్ ద్వారా 20 నిమిషాల్లో ఎయిర్ పోర్ట్ చేరుకోవచ్చునని అధికారులు చెబుతున్నారు. నియోపోలిస్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలికి సులువైన అనుసంధానం ఉంటుందన్నారు. ఓఆర్ఆర్‌కు అనుసంధానం చేసేందుకు నియోపోలిస్ వద్ద ట్రంపెట్‌కి రెండు చోట్ల టోల్ గేట్స్ ఏర్పాటు చేశారు. ఈ నియోపోలిస్ ట్రంపెట్ ఇంటర్ చేంజ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల విలీనంతో కార్పొరేషన్‌పై పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గిరిజన గ్రామాలతో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు సోమవారం విచారించింది. కౌంటర్ దాఖలు దాఖలు చేస్తామని ప్రభుత్వం చెప్పింది. దీంతో విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. తెలంగాణ మునిసిపల్ యాక్ట్–2025 సవరణ తర్వాత కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటున కు వెలువడిన జీవోను జె.శివరామ్‌ప్రసాద్ సవాలు చేస్తూ పిల్ దాఖలు చేశారు. ఇదే తరహా మరో పిల్‌ను కూడా కలపిఇ చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ విచారించింది. కొత్తగూడెం, పాల్వంచ మునిసిపాలిటీలు, పాల్వంచ సంస్థాన్ గ్రామాలు, సుజాతనగర్ మండలంలోని ఏ డు గ్రామ పంచాయతీలను విలీనం చేసి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చెల్లదని పిటిషనర్ న్యాయవాది అన్నారు. మే 29న జీవో 103ను కొట్టేయాలని కోరారు. విలీన ప్రాంతాలు చాలా దూరంగా ఉంటాయన్నారు. రిజర్వ్ ఫారెస్ట్, లక్ష్మీదేవిపల్లి ఏజెన్సీ వంటి ప్రాంతాలున్నాయన్నారు.

## గ్రూప్ – 1పై నేడు తీర్పు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలపై వేర్వేరు వాదనలతో దాఖలైన పిటిషన్లపై హైకోర్టు మంగళవారం తీర్పు చెప్పనుంది. సుమారు రెండు నెలలుగా లక్షలాది మంది అభ్యర్థులు తీర్పు కోసం నిరీక్షిస్తున్నారు. 2024, అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని కొందరు, పరీక్షలు అయ్యాక నియామక ప్రక్రియ మొదలయ్యే దశలో జోక్యం చేసుకోరాదంటూ ఇతరులు వేసిన పిటిషన్లపై సుదీర్ఘ వాదనలు జరిగాయి. జూలై 7 తీర్పు రిజర్వు చేసిన జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు మంగళవారం తీర్పు చెప్పనున్నారు.

## ఫలించిన 8 ఏళ్ల పోరాటం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్థానికత అంశంపై ఒక దళిత మహిళ ఎనిమిదేళ్లు చేసిన న్యాయపోరాటం సోమవారం ఫలించింది. హైదరాబాద్‌కు చెందిన సంగీత అభ్యర్థిత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలని గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ ఆమోదించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఆదేశాలను జారీ చేసింది. 8 నుంచి 10వ తరగతి వరకు హైదరాబాద్‌లోనే సంగీత చదివారని, 4 నుంచి 7వ తరగతి వరకు బోనఫైడ్ సమర్పించ్‌లేదని చెప్పి నాన్ లోకల్‌గా పరిగణించడానికి వీల్లేదని తేల్చింది.తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు దాఖలు చేసిన అప్పీల్‌ను డిస్మిస్ చేసింది.2015లో ఏఆర్ కానిస్టేబుల్ నియామకాలకు బోర్డు నోటిఫికేషన్ ఇచ్చింది. స్థానిక కేటరిగీ కింద తనను పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన సంగీత హైకోర్టులో 2017లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సింగిల్ జడ్జి గత మార్చిలో నాలుగు వారాల్లో ప్రక్రియ పూర్తి చేయాలని తీర్పు చెప్పారు.దీనిని రద్దు చేయాలంటూ బోర్డు వేసిన అప్పీల్‌ను చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం సోమవారం కొట్టివేస్తూ తీర్పు చెప్పింది.

## 3 వేలు చెట్ల కొట్టివేతపై పిల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్థానిక కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణం కోసం ఏకంగా 3 వేల చెట్లను కొట్టివేయడం, నిర్మాణాల వల్ల కేబీఆర్ పార్కులోని పక్షులు, జంతువులకు నష్టం వస్తుంటూ దాఖలైన పిల్‌ను హైకోర్టు విచారించి కేంద్రానికి నోటీసులు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. 6 వారాలు గడువిచ్చింది. పార్కు చుట్టూ ఎకో సెన్సిటివ్ జోన్ (ఈఎస్‌జెడ్) దెబ్బ తింటుందంటూ పర్యావరణవేత్త కె.పురుషోత్తంరెడ్డి పిల్ దాఖలు చేశారు దాదాపు 3 వేల చెట్లు నరికివేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. దీనిని చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారించింది. రాష్ట్రం కౌంటర్ వేసింది. కేంద్రం వేయకపోవడంతో కేంద్రానికి నోటీసులు ఇచ్చింది. విచారణ ఆరు వారాలకు వాయిదా వేసింది.

## ఏసిబికి చిక్కిన అర్ఐ అమర్నాథ్

**ప్రజాపక్షం / మద్దూర్ :** మండల పరిధిలోని అచ్చంపల్లి గ్రామానికి చెందిన రైతు తన పాసుబుక్‌లో ఎక్కించుటకు 5 గుంటల భూమి మిస్సింగ్ రిపోర్టు కోసం అర్ ఐ అమర్నాథ్ 5000 రుపాయలు లంచం డిమాండ్ చేయడంతో బాదితుడి ఫిర్యాదు మేరకు మహబుబ్‌నగర్ డిఎస్పి ఎసిబి రేంజ్ బాలకృష్ణతో పాటు ఇన్‌స్పేక్టర్స్ లింగయ్య , సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలాని మరియు వారి సిబ్బందితో దాడులు నిర్వహించి రెడ్ హ్యాండెడ్ పట్టుకున్నారు.ఆ రైతు ఎంత వెడుకున్నా వినకుండా డబ్బులు ఇస్తేగాని పని జరగదు అని తేల్చిచేప్పడంతో తప్పని పరిస్థితుల్లో రైతు ఏసిబి అధికారులను ఆశ్రాయించాడు. స్థానిక మిడియాతో డిఎస్పి ఎసిబి రేంజ్ బాలకృష్ణ మాట్లాడుతూ ఎవరైనా అధికారులు లంచం అడిగినా 1064 టోల్‌ఫ్రి నంబర్‌కు కాల్ చేయాలన్నారు.అలాగే వాట్సప్ నంబర్ 9440446106 చేసి పేరు డిటేయిల్స్ చేప్పి కంప్లైట్ ఇవ్వాలన్నారు.

## ఘనంగా బిఒఐ ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** బ్యాంక్ ఆఫ్ ఇండియా(బిఒఐ) 120వ సంవత్సర ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతి వేదికగా జరిగిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథులుగా దక్షిణ భారతదేశంలోని ఐదు జోన్ల జనరల్ మేనేజర్ మనోజ్ కుమార్ శ్రీవాత్సవ, ఆలిండియా బిఒఐ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.నాగేశ్వర్ హాజరయ్యారు. 12 దశాబ్దాలుగా బిఒఐ తన విస్తృత నెట్‌వర్క్ ద్వారా వినియోగదారుల విశ్వాసం, సేవలను చూరగొంటూ ముందుకెళ్తున్నదని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగుల, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకొన్నాయి. కార్యక్రమంలో తెలంగాణ, ఎపి, కర్ణాటక రాష్ట్రాల్లోని ఐదు జోన్లకు చెందిన మేనేజర్‌లు, వేలాది మంది ఉద్యోగులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ‘ఎఐ’ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్

### ఆస్ట్రేలియా ‘డికన్ యూనివర్సిటీ’ భాగస్వామ్యంతో ఏర్పాటు
### మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో ‘లెటర్ ఆఫ్ ఇంటెంట్’ పై సంతకాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ‘ఏఐ’ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను ఏర్పాటు చేసేందుకు ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ విద్యాసంస్థ ‘డికన్ విశ్వవిద్యాలయం’ ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ ఒఐ)పై సోమవారం సచివాలయంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ‘డికన్ యూనివర్సిటీ’ విసి ప్రొఫెసర్ ఇయాన్ మార్టిన్, ఐటి శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేష్ మిశ్రా సంతకాలు చేశారు. అనంతరం ఈ ఒప్పంద పత్రాలను పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ‘అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా ఏఐ రంగంలో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం. ఏఐలో నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటుకు డికన్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నాం. ఇది కేవలం లాంఛనప్రాయ ఒప్పందం కాదు. రాబోయే రోజుల్లో కీలక రంగాల్లో తెలంగాణ, ఆస్ట్రేలియా మధ్య ద్వైపాక్షి సంబంధాల మెరుగుదలకు దిక్సూచీగా మారుతుంది. సమాజానికి ఉపయోగపడే అత్యాధునిక ఏఐ పరిష్కారాలను అభివృద్ధి చేయడంతో పాటు పరిశోధనలు, వ్యవస్థాపకతకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది’ అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.

### ఎఐ కోర్సుల రూపకల్పన, శిక్షణ, స్టార్టప్ లకు చేయూత ..

‘ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ రంగాల్లో ప్రపంచానికి అత్యంత నైపుణ్యమున్న మానవ వనరులను తెలంగాణ నుంచే అందించాలని లక్ష్యంగా పెట్టుకుని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్, యంగ్ ఇండియన్ స్కిల్ యూనివర్సిటీ సంయుక్తంగా నేటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఏఐ కోర్సులకు రూపకల్పన చేసి, ఇక్కడి యువతకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణనిస్తాయి. మన ఏఐ స్టార్టప్ సంస్థలు అంతర్జాతీయ మార్కెట్ లో తెలంగాణ బ్రాండ్‌ను మరింత విశ్వ వ్యాప్తం చేసేలా ఆస్ట్రేలియా నిపుణులు మార్గదర్శకత్వం చేస్తారు ’ అని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

### ఎఐ ఆధారిత పౌర సేవలను అందించేలా

‘ఏఐ కేవలం ఒక సాంకేతికత మాత్రమే కాకుండా, సమ్మిళిత వృద్ధికి, మానవాభివృద్ధికి ఒక శక్తివంతమైన సాధనంగా మార్చేలా మా ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తోంది. ఈ లక్ష్య సాధనలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ మార్గదర్శిగా మారుతుంది. ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, గవర్నెన్స్ తదితర రంగాల్లో ఏఐ వినియోగాన్ని పెంచి పౌర సేవలను మరింత సమర్థవంతంగా అందించేలా సంయుక్త పరిశోధనలు నిర్వహిస్తాం. ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఏఐ ఆధారిత పరిష్కారాలను కనుగొనేందుకు కృషి చేస్తాం’ అని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కాన్సుల్ జనరల్ (ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ బెంగళూరు) స్టీవెన్, కాన్సుల్ ఆండ్రూ కాలిస్టర్, ట్రేడ్ అండ ఇన్వెస్ట్ మెంట్ కమిషనర్ వికా సింగ్, పొలిటికల్ అండ ఎకానమిక్ రీసెర్చ్ ఆఫీసర్ రంజని మాధవన్, డికన్ యూనివర్సిటీ ప్రతినిధులు రౌనీత్ పాహ్వా, ప్రియాంక సింగ్, గాయత్రి వేద్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ సిమెంటు ప్లాంటును పునరుద్ధరించాలి : మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్: ఖాయిలా పడిన సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఆదిలాబాద్ ప్లాంటును పునరుద్ధరించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ పరిశ్రమను తిరిగి నడిపించాలని సిఎం రేవంత్ రెడ్డి, తానూ పలు సందర్భాల్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రి కుమారస్వామిని కలిసి కోరిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు.సచివాలయంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిసిఐ సిఎండి సంజయ్ బంగా, ఆదిలాబాద్ ఎంఎల్ఏ పాయల్ శంకర్ తదితరులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో పునరుద్ధరణ ప్రతిపాదనలపై శ్రీధర్ బాబు చర్చించారు. ప్లాంటును ఆధునిక యంత్రాలతో పునరుద్ధరించడానికి రూ. 2 వేల కోట్లు అవసరమవుతాయని సిఎండి చెబ్తున్నారని, అది జరిగితే మూడు వేల మందికి ఉపాధి దొరుకుతుందని శ్రీదర్ బాబు తెలిపారు. కేంద్రం ప్రతిపాదిస్తున్నట్టుగా ప్లాంటు ప్రైవేటీకరణను (డిస్ ఇన్వెస్ట్‌మెంటును) తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. పునరుద్ధరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను సిసిఐ కోరుతోందని, త్వరలోనే దీనిపైన తమ అభిప్రాయాలను అందచేస్తామని వెల్లడించారు. రెండు వేల ఎకరాల్లో నాణ్యతతో కూడిన సున్నపురాయి గనులు ఉన్నందున ప్లాంటు నిర్వహణ అసాధ్యమేమీ కాదని శ్రీధర్ బాబు చెప్పారు. సమావేశంలో మైన్స్ అండ్ జియాలజీ ముఖ్యకార్యదర్శి ఎన్. శ్రీధర్, గనుల శాఖ డైరెక్టర్ వల్లూ రు క్రాంతి, టిజిఐఐసి ఎండీ శశాంక తాండూరు సిసిఐ ప్లాంట్ జిఎం శరద్ కుమార్, సిసిఐ రీజినల్ మేనేజర్ ఉమేశ్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారిలు కూడా సమావేశానికి హాజరై తమ సూచనలను వెల్లడించారు.



## ఎక్సైజ్ శాఖ ఏం చేస్తోంది?

### మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై గట్టి నిఘా పెట్టాలి : మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చర్లపల్లి డ్రగ్స్ తయా రీ ఫ్యాక్టరీని క్షేత్రస్థాయిలో పరిశీలించి 24 గంటల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఎక్సైజ్ శాఖ మంత్రి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ఎక్సై జ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న నెట్వర్క్ మూ లాలు హైదరాబాద్‌లో బయటపడ్డ నేపథ్యంలో కే సు పూర్వాపరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. చర్లపల్లి పారిశ్రామిక వాడలో ఓ ఫ్యాక్టరీలో డ్రగ్స్ తయారీ ముడి పదార్థాలను మహారాష్ట్ర పోలీసులు స్వాదీనం చేసుకున్నారని, ఇంత జరుగుతున్న మన ఎక్సైజ్ శాఖ ఏం చేస్తుందని అసంతృప్తిని వ్యక్తం చేశారు. భవిష్యత్ లో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, మాదకద్రవ్యాల నియంత్రణకు కార్యచరణను రూపొందించాలని దిశానిర్ధేశం చేశారు. మాదకద్రవ్యాల, నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, వినియోగం, రవాణాపై మరింత గట్టి నిఘా పెట్టాలని మంత్రి జూపల్లి అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్ర వ్యాల సాగు, తయరీ, రవాణా, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారుల నుంచి విక్రయదారుల వరకు సరఫ రా లింకులపై డేగ కన్ను వేసి ఉంచాలన్నారు. ఉపాధి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికు లు, విద్యార్థులు, యువకులను కొందరు గంజా యి స్మగ్లర్లు ఆసరాగా చేసుకున్నారని అన్నారు. అందుకని ఆయా అడ్డాలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మంత్రి ఆదేశా ల మేరకు ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ ఖురేషీ, రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ దశరథం, ఇతర అధికారులు వాగ్దేవి ల్యాబోరేటరీస్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. రేపటిలోగా అధికారులు దీనిపై నివేదికను అందజేయనున్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో త్వరలో అల్పహారం పథకం

### మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్నారుల కోసం త్వరలో అల్పహారం పథకాన్ని (బ్రేక్‌ఫాస్ట్) ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసని అనసూయ సీతక్క సూచించారు. అంగన్‌వాడిలకు మెను ప్రకారం అన్ని ఆహారపదార్థాలను సరఫరా చేయాలని, ఏ ఒక్కటి ఆపకూడదని హెచ్చరించారు. ఈ నెల 19,20 తేదిల్లో ‘మహిళా భద్రత’ పై చర్చించేందుకు రౌండ్ టెబుల్, మహిళా సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాఖలో జరుగుతున్న పనుల పురోగతిపై, అమలవుతున్న పథకాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. అంగన్‌వాడి కేంద్రాలకు సరుకులు సకాలంలో అందుతున్నాయా? లేదా? అని మంత్రి ఆరా తీశారు. గుడ్లు, పాలు, పప్పు, మంచినూనె, స్నాక్స్, బాలమృతం సరఫరాపై సమీక్షించారు. అధికారుల నివేదిక ప్రకారం పాలు మినహా మిగిలిన వస్తువులన్నీ 98 శాతం పైగా సరఫరా అవుతుండగా, పాలు మాత్రం గత నెలలో 58 శాతం మాత్రమే సరఫరా అయిందని వివరించగా, పాల సరఫరా లోపంపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలతో సహా ఎక్కడా ఫుడ్ గ్యాప్ లేకుండా చూడాలని ఆదేశించారు. 1261 అంగన్‌వాడి భవనాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంటే, 1181 కేంద్రాలకు స్థలాలు గుర్తించామని అధికారులు వివరించారు. ఐదు జిల్లాలు మినహా మిగిలిన 28 జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు టెండర్లను ఖరారు చేసినట్లు అధికారులు వివరించారు. గుడ్ల సరఫరాలో కలర్ కోడింగ్ తప్పనిసరి అని మంత్రి స్పష్టం చేస్తూ, ప్రతి పది రోజులకు ఒకసారి ఏజెన్సీలు గుడ్లు సరఫరా చేయాలని ఆదేశించారు. లేదంటే కాంట్రాక్టులను రద్దు చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడి భవనాల నిర్మాణానికి త్వరలో పనులను ప్రారంభించి, నవంబర్ 19న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి లోపు భవనాల నిర్మాణ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. స్థానిక కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే నిర్మాణ బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగించాలని సూచించారు. అలాగే అంగన్‌వాడి కేంద్రాల్లో బల్లలు, సిబ్బంది యూనిఫాంలు, చిన్నారుల యూనిఫాంలు తక్షణమే సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగినులు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో మహిళా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, మహిళల భద్రత కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు.

## వద్దెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మాంజాల



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా మాంజాల రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం జాతీయ అధ్యక్షులు వేముల లక్ష్మ ణ్, జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ ప్రకటించారు. హైదరాబాద్ బషీర్ బాగ్ లోని సంఘం రాష్ట్ర కార్యాలయం లో సోమవారం జరిగిన సంఘం రాష్ట్ర సర్వసభ్యసమావేశంలో మాంజాల రమేష్‌కు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని వారు అందజేశారు. సమావేశంలో వేముల లక్ష్మ ణ్ మాట్లాడుతూ ఓబిసిలలో అత్యంత వెనుకబడిన వడ్డెర సామాజికవర్గం ఎదుర్కొంటున్న అనేక సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. గుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ వడ్డెర సామాజిక వర్గాన్ని ఎస్‌టి జాబితాలో చేర్చడం, రాష్ట్రంలో వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు తన వంతు సహకారాలు అందిస్తానన్నారు. మాంజాల రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాలు పర్యటించి వడ్డెరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరానికి కృషి చేస్తానన్నారు.

## కాళోజీ పుస్తకాన్ని ఆవిష్కరించిన జూపల్లి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ సాహిత్య ఆకాడమీ ఆధ్వర్యంలో ప్రచురించిన పద్మభూషణ్ కాళోజి నారాయణరావు రచించిన కథల పుస్తకాన్ని సోమవారం రాష్ట్ర సచివాలయంలో సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో కాళోజి సాహిత్యానికి చేసిన కృషిని ఆయన కొనియాడారు. నాగొడవ అనే పుస్తకంలో ఆయన రాసిన కవిత్వమే కాకుండా సాహిత్యంలోని అనేక అంశాలను ఆయన స్పృశించారని, తెలంగాణ భాషకు ఆయన చేసిన కృషి కూడా గొప్పదన్నారు. ఇంతటి గొప్ప సాహిత్యవేత 111వ జన్మదిన సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో కాళోజీ కథల పుస్తకాన్ని తీసుకురావడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగా ణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, కవి యాకుబ్ , ఈమని శివనాగిరెడ్డి పలువురు పాల్గొన్నారు.



### ఎఐఎస్ఎఫ్ నేత పుట్ట లక్ష్మణ్‌కు మాతృ వియోగం
## గుండెపోటుతో పుట్ట రోహిణమ్మ మృతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ తల్లి రోహిణమ్మ సోమవారం హైదరాబాద్‌లో మరణించారు. ఆమెకు ఉదయం గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పుట్ట రోహిణమ్మ అంత్యక్రియలు వారి స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో నిర్వహించనున్నారు.

**కూనంనేని సంతాపం :** కాగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ మాతృమూర్తి అకాల మరణం పట్ల సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. విద్యార్థి ఉద్యమంలో పనిచేస్తున్న లక్ష్మ ణ్‌కు తల్లి మరణం తీరని లోటని ఆయన అన్నారు.

## రైల్వే యార్డులలో భద్రతా ప్రమాణాలు పాటించాలి

### దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రైల్వే యార్డులలో భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, ప్రధాన విభాగాధిపతులతో కలిసి జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రతపై ఆయన స మీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విజయవాడ, గుంతకల్లు , గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్ మరియు నాందేడ్ డివిజన్ల మొత్తం ఆరు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డి.ఆర్.ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సందర్భంగా సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. యార్డుల వద్ద రైళ్లను షంటింగ్ చేసే సమయంలో పాటించాల్సిన భద్రతా సూచనలపై ఆయన చర్చించారు.జోన్ వ్యాప్తంగా ఇంజనీరింగ్, సిగ్నల్ , టెలికమ్యూనికేషన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్ మొదలైన వివిధ విభాగాలకు సంబంధించి నిర్వహిస్తున్న వివిధ భద్రతా ఆడిట్‌లు మరియు ప్రత్యేక డ్రైవ్‌లను కూ డా జనరల్ మేనేజర్ సమీక్షించారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జ రగకుండా ఉండటానికి షార్ట్‌కట్ పద్ధతులను పూర్తిగా నివారించాలని ఆయన పునరుద్ఘాటించారు. అన్ని భద్రతా మార్గదర్శకాలను పాటించేలా తరచుగా క్షే త్రస్థాయి తనిఖీలు నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు.జోన్‌లోని ఆరు డివిజన్లలోని అన్ని రైల్వే స్టేషన్లలో దివ్యాంగుల సౌకర్యాల ఏర్పాటును సమీక్షించారు. ప్రస్తుత సౌకర్యాలను కూడా ఆయన సమీక్షించారు, అవసరమైతే ఏవైనా మెరుగుదలలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.

## అక్రమాలపై హైడ్రాకు ఫిర్యాదు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పార్కులు, రహదారులు, చెరువులు వంటి ప్రజల ఆస్తులను ఆక్రమించడంపై సామాన్య ప్రజలు కూడా వెనుకాడకుండా ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ విషయమై ధనబలం, రాజకీయ పలుకుబడి ఉన్నవారితో తమకెందుకులే అనుకోవడం లేదు. హైడ్రా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 36 ఫిర్యాదులు అందాయి. అందిన ఫిర్యాదులను కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఫిర్యాదుదారుల సమక్షంలోనే గూగుల్, శాటిలైట్ మ్యాప్‌ల ద్వారా గతంలో, ప్రస్తుతం ఉన్న పరిస్థితులను వివరించారు. ఈ సమస్యల పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు. ఈ చర్యలు ప్రజల్లో మరింత విశ్వాసాన్ని పెంచుతున్నాయి.

## వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికి బిజెపిపై నిందలా?

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు


ప్రజాపక్షం/హైదరాబాద్ : బిసి రిజర్వేషన్‌ల విషయంలో కాంగ్రెస్ పార్టీ తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి బిజెపిపై, కేంద్ర ప్రభుత్వంపై నిందలు మోపుతోందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆరోపించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు నిజంగా రిజర్వేషన్లు ఇవ్వాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటే 2018 పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 285ను సవరించాల్సి ఉంటుందని గతంలోనే తాము సూచించామని తెలిపారు. 42 శాతం బిసి రిజర్వేషన్ల కోసం చట్ట సవరణ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం 22 నెలలు ఆలస్యం చేసిందని రాంచందర్ రావు విమర్శించారు. చివరకు బిజెపి సలహాలను పరిగణనలోకి తీసుకొని ఇటీవల అసెంబ్లీలో సెక్షన్ 285 సవరణ చేసిందన్నారు. స్థానిక ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల తెలంగాణకు కేంద్రం నుంచి రావాల్సిన రూ. 1,600 కోట్ల నిధులు ఆగిపోయాయని, మొత్తంగా సుమారు రూ. 3,000 కోట్ల కేంద్ర నిధులు నిలిచిపోయాయని ఆయన వివరించారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజల్లో చైతన్యం తీసుకురావడ మే తమ లక్ష్యమని రాంచందర్ రావు అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవానికి సంబంధించిన పోస్టర్లు, స్టిక్కర్లను ఆయన ఆవిష్కరించారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఈ ఏడాది కూడా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఈ వేడుకలకు కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేస్తార ని చెప్పారు. బిజెపి తెలంగాణ విమోచన దినోత్సవాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.



## బిజెపి రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించిన అధిష్ఠానం

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా గౌతంరావు, వీరేందర్ గౌడ్, వేముల అశోక్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిజెపి అధిష్ఠానం తెలంగాణ రాష్ట్ర నూతన కమిటీని ప్రకటించింది. ఈ కమిటీలో ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, ఎనిమిది మంది రాష్ట్ర ఉపాధ్యక్షులను నియామకం చేసింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా గౌతంరావు, తూళ్ల వీరేందర్ గౌడ్, వేముల అశోక్‌లను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బూర నర్సయ్య గౌడ్, కాసం వెంకటేశ్వర్లు, బండారి శాంతి కుమార్, కొల్లి మాధవి, జయశ్రీ, బండా కార్తీక్ రెడ్డి, రఘునాథ్ రావు, కల్యాణ్ నాయక్‌లను నియమించినట్లు ఆయన చెప్పారు. వివిధ మోర్చాలకు రాష్ట్ర అధ్యక్షులను కూడా నియమించారు. మహిళా మోర్చా అధ్యక్షురాలిగా డాక్టర్ మేకల శిల్పా రెడ్డి, యువ మోర్చా అధ్యక్షుడిగా కె.గణేశ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా బస్వాపూరం లక్ష్మి నర్సయ్య, ఎస్‌సి మోర్చా అధ్యక్షుడిగా కాంతి కిరణ్, ఎస్‌టి మోర్చా అధ్యక్షుడిగా నవనీత్ రవి నాయక్, ఓబిసి మోర్చా అధ్యక్షుడిగా గంధమల్ల ఆనంద్ గౌడ్, మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా సార్ధార్ జగన్మోహన్ సింగ్‌లను నియామకం జరిపారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## కుల్గామ్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు ఉగ్రవాదులు హతం..

**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్ కుల్గామ్ జిల్లాలో సోమవారం భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఎన్‌కౌంటర్‌లో ఇప్పటి వరకు ఇద్దరు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. ఈ ఘటనలో ముగ్గురు సైనికులకు గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. కుల్గాంలోని గుదార్ అటవీ ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారనే సమాచారం మేరకు భద్రతా దళాలు వారి కోసం సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయని ఆ అధికారి పేర్కొన్నారు. భద్రతా దళాలను గమనించిన ఉగ్రవాదులు వారిపై కాల్పులు జరిపారు. దాంతో భద్రతా బలగాలు సైతం ఆత్మరక్షణగా కాల్పులు జరపడంతో సెర్చ్ ఆపరేషన్ ఎన్‌కౌంటర్‌గా మారిందని శ్రీనగర్‌కు చెందిన చినార్ కార్ప్స్ ఆఫ్‌ఆర్మీ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొంది. అప్రమత్తంగా ఉన్న దళాలు అనుమానాస్పద కదలికలను గుర్తించాయని.. ఉగ్రవాదులు కాల్పులు జరుపడంతో జూనియర్ కమిషన్డ్ అధికారితో సహా ముగ్గురికి గాయాలయ్యాయని తెలిపింది. ఎన్‌కౌంటర్‌లో ఇప్పటి వరకు ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారని, ఆపరేషన్‌లో గాయపడ్డ సైనికులను వైద్యం కహాసం తరలిస్తున్నట్లు చెప్పింది.

గ్రేట్ నికోబార్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టు

## పక్కా దుస్సాహసమే?

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ



**న్యూఢిల్లీ :** గ్రేట్ నికోబార్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టు 'ఒక పక్కా ప్రణాళికతో కూడిన దుస్సాహసం' అని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ అన్నారు. ఇది నికోబార్ ద్వీపంలోని ఆదివాసీ గిరిజన సమాజాలకు ఉనికికి ప్రమాదాన్ని కలిగిస్తుంది అని, 'అన్ని చట్టపరమైన, చర్చల ప్రక్రియలను అపహాస్యం చేస్తూ సున్నితత్వం లేకుండా ముందుకు తీసుకుపోబడుతోందని పేర్కొన్నారు. ఈ అంశంపై 'ది హిందూ' సోనియా గాంధీ వ్యాసం సోమవారం ప్రచురితమైంది. 'షోంపెన్, నికోబారీస్ గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకంగా మారినప్పుడు సామూహిక వివేకం మౌనంగా ఉండకూడదు, ఉండబోదు.' అన్నారు. 'భవిష్యత్ తరాలకు మన నిబద్ధత, అత్యంత విశిష్టమైన పర్యావరణ వ్యవస్థను ఈ స్థాయిలో ధ్వంసం చేయడానికి అనుమతించదు. ఈ అన్యాయం, మన జాతీయ విలువలకు ఈ ద్రోహానికి వ్యతిరేకంగా మనం గళం విప్పాలి,' అని ఆమె 'ది మేకింగ్ ఆఫ్ యాన్ ఎకోలాజికల్ డిజాస్టర్ ఇన్ ది నికోబార్' అనే శీర్షికతో రాసిన తన వ్యాసంలో పేర్కొన్నారు. గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయడంలో అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్‌ఎ) ఉల్లంఘనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, చట్టం ప్రకారం నిర్దేశించిన ప్రక్రియను కచ్చితంగా పాటించాలని ప్రభుత్వాన్ని కోరుతూ గిరిజనవ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరామ్‌కు లోక్‌సభభలో ప్రతిపక్షనాయకుడు రాహుల్ గాంధీ లేఖ రాసిన కొద్ది రోజుల తర్వాత ఆమె ఈవ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ నాయకుడు, మాజీ పర్యావరణ మంత్రి జైరామ్ రమేష్ కూడా గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుపై ఆందోళనలను హైలైట్ చేస్తూ, ఇది పర్యావరణానికి, ఆ ప్రాంతంలోని అటవీ నివాసుల, గిరిజనుల హక్కులకు ప్రతికూలమైనదన్నారు. 'ఈ పక్కా ప్రణాళికతో కూడిన దుస్సాహసాల శ్రేణిలో తాజాది గ్రేట్ నికోబార్ మెగాఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్. పూర్తిగా తప్పుదోవ పట్టించే పద్ధతుల్లో చేస్తున్న వ్యయం రూ.72,000''' అన్నారు. చర్చా ప్రక్రియలను అపహాస్యం చేస్తూ, దీనిని సున్నితత్వం లేకుండా తీసుకుపోతున్నారని సోనియాగాంధీ విమర్శించారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికవేళ జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా

## ప్రతిపక్ష నాయకులు, ఎంపీల ఐక్యతా సమావేశం

బిఆర్‌ఎస్, బిజెడి ఓటింగ్‌కు దూరం



**న్యూఢిల్లీ :** ఉపరాష్ట్రపతి పదవికి మంగళవారం జరిగే ఎన్నికకు అన్ని ఏర్పాట్లు సిద్ధమైన తరుణంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా ప్రతిపక్షాలకు చెందిన ఎంపీలు అందరూ సోమవారం పార్లమెంటు కాంప్లెక్స్‌లో ఐక్యతా సమావేశం నిర్వహించారు. పార్టీలకు కట్టుబడి ఎంపీలు ఓటు వేయొద్దనీ, దేశ ప్రజాస్వామ్య పార్లమెంటరీ వ్యవస్థను పటిష్టంగా తీర్చిదిద్దుకోవడంకోసం దేశం మీద ప్రేమతో అత్యున్నత చట్టసభల అభ్యర్థులు తమ ఓటుహక్కు ఉపయోగించుకోవాలని ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థి పిలుపు ఇవ్వడంతో ఈ ఎన్నికకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది. కాంగ్రెస్, సమాజ్‌వాదీపార్టీ, డిఎంకె, తృణమూల్ కాంగ్రెస్, ఆర్‌జెడి, జెఎంఎం, శివసేన(యుబిటి), ఎన్‌సిపి(ఎస్‌పి), సిపిఐ, సిపిఐ(ఎం)లకు చెందిన అగ్రనాయకులు హాజరయ్యారు. ఉభయ సభల ఎంపీలు పాత పార్లమెంటు భవంతి సంవిధాన్ సదన్ సెంట్రల్ హాలులో సమావేశమయ్యారు. కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీపార్టీ నాయకురాలు సోనియాగాంధీ, ఎన్‌సిపి(ఎస్‌పి) నాయకుడు శరద్‌పవార్, డిఎంకె నాయకుడు టి.ఆర్.బాలు తదితరులు సమావేశంలో పాల్గొన్నవారిలో ఉన్నారు.

లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఓటింగ్‌కు అర్హులే. ఈ ఎన్నికల ప్రక్రియ గురించి ఎంపీలకు వివరాలు తెలియజేశారు. సమాజ్‌వాదీపార్టీ నాయకుడు రామ్ గోపాల్‌యాదవ్ సమావేశంలో అందరికీ స్వాగతం పలికారు. కాంగ్రెస్ నాయకుడు, రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్‌విప్ జైరామ్ రమేశ్ మాట్లాడుతూ, ఎంపీలందరికీ ఉపరాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ గురించి వివరించారు. ఓటింగ్‌కు సంబంధించిన మెజార్టీసంఖ్యాబలం అధికార ఎన్‌డిఎ కూటమికి అనుకూలంగా ఉన్నప్పటికీ, ప్రతిపక్షాలు మాత్రం ఉపరాష్ట్రపతి పదవికి జరిగే ఎన్నికను సైద్ధాంతిక పోరాటంగా పేర్కొన్నాయి. తమ ఓటు వృథాకాకుండా జాగ్రత్తగా వేయాలని ప్రతిపక్ష ఎంపీలందరికీ ఈ సందర్భంగా తెలియజేశారు. గతంలో ఈ ఎన్నిక సందర్భంగా కొన్నిఓట్లు పలుకారణాలవల్ల చెల్లకుండాపోయాయి. ఓటింగ్ ప్రక్రియపై ఒక అవగాహన పొందడంకోసం ఎంపీలందరూ సామూహికంగా నమూనా బ్యాలెట్‌లో పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి పదవికి జరిగే ఎన్నికల్లో ఎంపీలు ఎవ్వరూ పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి ప్రవర్తించాల్సిన అవసరం లేదు. రహస్య బ్యాలెట్ విధానం ద్వారా ఎంపీలు ఓటు హక్కు ఉపయోగించుకుంటారు. ఈ ఎన్నికలో పాల్గొనే ఇద్దరి అభ్యర్థుల పేర్లతో కూడిన బ్యాలెట్ పత్రాలను ఎంపీలకు ఇస్తారు. ఇందులో ఎంపీలు వారి ప్రాధాన్యతలను తెలియజేయాలి. ఎవరికి మద్దతు ఇస్తున్నారో వారి పేరు ఎదురుగా నెంబర్ ఒన్ అంకె వేయాలి.

ఇదిలా ఉండగా, సంఖ్యాబలం ఉన్నప్పటికీ కూడా ఉపరాష్ట్రపతి ఎన్నిక విషయంలో ఎన్‌డిఎ కూటమి జాగ్రత్తలు పాటిస్తోంది. ఎన్‌డిఎ కూటమి కూడా తమ ఎంపీలతో ఒక సమావేశం నిర్వహించి ఎన్నిక ప్రక్రియ గురించి వారికి కూలంకషంగా తెలియజేసింది. ఎన్‌డిఎ ఎంపీలంతా కూడా నమూనా బ్యాలెట్‌ను నింపి మంగళవారం ఎన్నికల్లో ఎలా ఓటు వేయాలో నేర్చుకున్నారు.

రాజకీయ అంశాల్లో

## జోక్యం చేసుకోబోం

సిఎం రేవంత్‌రెడ్డికి 'సుప్రీం'లో ఊరట



**న్యూఢిల్లీ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా దాఖలు అయిన పరువు నష్టం దావాకేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. తెలంగాణ రాష్ట్ర బిజెపి దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. గత సంవత్సరం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్నికల్లో గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారంటూ రేవంత్‌రెడ్డి ప్రచారం చేయడంపై బిజెపి నేత కాసం వెంకటేశ్వర్లు పిటిషన్ దాఖలు చేశారు. గత నెలలో ఇదే విషయమై ఆ పార్టీ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టి వేసింది. ఈ ఉత్తర్వులను కాసం వెంకటేశ్వర్లు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. తాజాగా వాదనలు విన్న సిజెఐ జస్టిస్ బిఆర్ గవాయ్ ధర్మాసనం పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. రాజకీయపరమైన అంశాల్లో జోక్యం చేసుకోబోమని తేల్చి చెప్పింది. రాజకీయ నాయకులకు సున్నితమైన మనసు ఉండకూడదని, కోర్టులను రాజకీయ యుద్ధ క్షేత్రాలుగా మార్చవద్దని వెల్లడించింది. గత సంవత్సరం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి బిజెపిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రసంగంపై బిజెపి నేత కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా వేశారు. బిజెపికి పరువు నష్టం కలిగేలా రేవంత్‌రెడ్డి మాట్లాడారంటూ ఫిర్యాదు చేశారు. కాసం పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ప్రజాప్రతినిధుల కోర్టు విచారణలో భాగంగా సాక్షుల వాంగ్మూలం నమోదు చేసింది. బిజెపి మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల టైంలో చెప్పారని కాసం కాసం వెంకటేశ్వర్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. ఈనేపథ్యంలో రేవంత్‌రెడ్డి ప్రసంగం వీడియో, ఆడియో క్లిప్పింగ్‌లను సైతం కాసం కోర్టుకు సమర్పించారు.

**కేసును కొట్టేయాలని హైకోర్టును ఆశ్రయించిన రేవంత్‌రెడ్డి :** ఈ తరుణంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసు కొట్టివేయాలని పిటిషన్‌లో కోరారు. దీంతో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టేయాలని సిఎం హైకోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ చేపట్టవద్దని, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాగే, కోర్టు హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని సిఎం కోరారు.

**రాజకీయపరమైన అంశాల్లో జోక్యం చేసుకోం :** రేవంత్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ జరిగిన హైకోర్టు బిజెపి నేత కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం దావాను కొట్టివేసింది. హైకోర్టు ఉత్తర్వులను బిజెపి సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ ధర్మాసనం పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. రాజకీయ పరమైన అంశాల్లో జోక్యం చేసుకోబోమని తెలిపింది. రాజకీయనాయకులకు సున్నితమైన మనసు ఉండకూడదని, కోర్టులను రాజకీయ యుద్ధక్షేత్రాలుగా మార్చవద్దని వెల్లడించింది.

# వరదతో సర్వం కోల్పోయిన పంజాబ్ రైతులు

రాష్ట్రానికి తక్షణం ప్రత్యేక ఆర్థిక సహాయం ఇవ్వండి... కేంద్రహోంమంత్రికి సిపిఐ ఎంపి సందోష్ కుమార్ లేఖ



**న్యూఢిల్లీ:** వరద బారినపడి అతలాకుతలమైన పంజాబ్ రాష్ట్రానికి ప్రత్యేక ఆర్థిక సహాయం ప్రకటించాలని రాజ్యసభలో భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ఎంపి సందోష్ కుమార్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఒక లేఖ రాశారు. ఒక సమగ్ర సహాయ పథకంతోపాటుగా తక్షణం నిధులు విడుదల చేయాలని కోరారు.గడచిన దశాబ్దాలలో ఎన్నడూలేనివిధంగా ఈసారి వరద పంజాబ్ రాష్ట్రంలో తీవ్ర విధ్వంసం సృష్టించింది. వరదలవల్ల 48 మంది ప్రాణాలు కోల్పోయారు. 1.76 లక్షల హెక్టార్లలో పంటలు తుడిచిపెట్టుకుపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.
వరదలవల్ల తీవ్రంగా దెబ్బతిన్న గ్రామాలలో సందోష్‌కుమార్ పర్యటించారు. ముఖ్యంగా ఫజిల్కాజిల్లాలోని పలు గ్రామాలలో పర్యటించారు. ఈ గ్రామాలన్నీ నీటమునిగి తీవ్రంగా నష్టపోయాయని హోంమంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. వారి కుటుంబాలు కోలుకుని వచ్చే పంట సీజనుకు సిద్ధమయ్యేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పంజాబ్‌లో జరిగిన తీవ్ర వరద నష్టానికి సాధారణ ఆర్థిక కేటాయింపులు ఏ మాత్రం సరిపోవని, రైతులు, నిరాశ్రయులైనవారందరికీ పూర్తి పంటనష్టాన్ని, పశువుల నష్టాన్ని, ఇళ్ళు కోల్పోవడంవల్ల జరిగిన నష్టాన్ని భర్తీచేసేందుకు ఒక సమగ్ర ప్యాకేజీ ప్రకటించాలని కోరారు.

''మొత్తం పంట పొలాలన్నీ నీట మునిగిపోయాయి, రైతులు పూర్తిగా పంటలను నష్టపోయారు,అనేక పశువులు మరణించాయి, నీట కొట్టుకుపోయాయి, ఇళ్ళన్నీ శిథిలాలయ్యాయి, కుటుంబాలన్నీ నీటమునిగిన ప్రాంతాలలో నిలబడిపోయారు, వారికి రోజువారీ జీవనం లేకుండాపోయింది, గ్రామాలలో చుట్టూ నీరు కదలకుండా నిలిచిపోయింది, దీనివల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది'' అని లేఖ ద్వారా తెలియజేశారు. ''అక్కడి వరద బీభత్స పరిస్థితులను రైతుల కళ్ళతో వీక్షిస్తే, వారు సర్వస్వం కోల్పోయారనీ, నిస్సహాయంగా మిగిలిపోయారనీ, కుటుంబాలు తలదాచుకుని, బతకడానికి ఒక చూరుకోసం వెతుక్కుంటూ నిస్సహాలుగా ఉన్నారనీ మనకు తెలుస్తుంది'' అని సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. ''పైన పేర్కొన్నవిధంగా ఒక సమగ్ర ప్యాకేజీతోపాటు పంజాబ్ రాష్ట్రానికి తక్షణం తగినన్ని నిధులు విడుదల చేయాలి,సాధారణ ఆర్థిక కేటాయింపులకు భిన్నంగా అంతకుమించినస్థాయిలో నిధులు విడుదల చేయాలి'' అని అమిత్ షాను ఆ లేఖలో సందోష్ కుమార్ కోరారు. ప్రకృతి వైపరీత్యాల రాష్ట్ర ప్రతిస్పందన నిధి (ఎస్‌డిఆర్‌ఎఫ్),ప్రకృతి వైపరీత్యాల జాతీయ ప్రతిస్పందన దళం (ఎన్‌డిఆర్‌ఎఫ్),భారత సైన్యం,స్వచ్ఛంధ సేవకులుసహా భారత కమ్యూనిస్టుపార్టీకి చెందినవారంతా కలిసి నష్టపోయిన కుటుంబాలకు ఆహారం,ఔషధాలు, ఆవాసం కల్పించేందుకు ఎంతో గొప్పకృషి చేశారని ఈ సందర్భంగా ప్రశంసించారు.

ఎల్గార్ పరిషద్-భీమా కోరేగాం కేసు నిందితుడి పిటిషన్

## 15న విచారించాలని 'సుప్రీం' నిర్ణయం

**న్యూఢిల్లీ :** ఎల్గార్ పరిషద్‌భీమా కోరేగాం కేసు నిందితుడు మహేష్ రౌత్ వైద్య కారణాల మూలంగా బెయిల్ పిటిషన్‌ను సెప్టెంబరు 15న విచారించాలని సుప్రీంకోర్టు సోమవారం నిర్ణయించింది. న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ సతీష్ చంద్ర శర్మ ద్విసభ్య ధర్మాసనం రౌత్ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు స్వీకరించింది. బాంబే హైకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ తనను జైలులో ఉంచడాన్ని సవాల్ చేస్తూ ఆయన అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశాడు. రౌత్ బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది కానీ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)అభ్యర్థన మేరకు దాని విచారణను ఒక వారం పాటు నిలిపివేసింది. తర్వాత అత్యున్నత న్యాయస్థానం అతని కేసులో అతడి విడుదలకు సంబంధించిన స్టేను పొడిగించింది. సోమవారం రౌత్ న్యాయవాది మాట్లాడుతూ తన క్లయింట్ రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతున్నాడని, జైలులో లేదా జె.జె హాస్పిటల్‌లోని అందుబాటులో లేని వైద్య సంరక్షణ అవసరమని అక్కడ అతడిని పరీక్షించామని చెప్పారు. 'జైలు హాస్పిటల్ ఒక స్టేటస్ రిపోర్టు దాఖలు చేయగలిగితే, మేం అతడిని వైద్య పరీక్ష కోసం తీసుకువెళతాం. జె.జె.హాస్పిటల్‌లో దీనికి అవసరమైన సదుపాయాలు అక్కడ లేవు' అని రౌత్ తరపు న్యాయవాది ధర్మాసనానికి విన్నవించారు. 'అధికారులు అఫిడవిట్‌ను ఫైల్ చేయాలని భావిస్తే వారు అలా చేయవచ్చు' అని ధర్మాసనం చెప్పింది.'వ్యాధి చాలా తీవ్రంగా ఉండి నిరంతర చికిత్స అవసరం అయినట్లయితే , ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఎందుకంటే ప్రభుత్వ వైద్యులు దానిని సురక్షితంగా తీసుకుంటారని మనందరకు తెలుసు. తీవ్రమైన చికిత్స అవసరమైతే దానిని తాకవద్దు.ఎందుకంటే ఏదైనా జరిగితే వారు బాధ్యత వహిస్తారు. మనం తెలుసుకుందాం. ఆ విషయంలో ఎలాంటి సమస్య లేదు' అని ధర్మాసనం చెప్పింది. రౌత్ దాదాపు 7సంవత్సరాలు కస్టడీలో ఉన్నాడనే విషయాన్ని న్యాయవాది ప్రస్తావించినప్పుడు జస్టిస్ సుందరేష్ మాట్లాడుతూ 'దీనిపై ఎలాంటి సమస్యలేదు. మేం దానిని పరిగణనలోనికి తీసుకుంటాం. మంగళవారం వరకు వేచిచూడండి' అని చెప్పారు.

## 17లోపు జిఆర్ అమలు చేయాలి

మహారాష్ట్ర ప్రభుత్వానికి మనోజ్ జరంగే 'అల్టిమేటం'

**ఛత్రపతి శంభాజీనగర్ :** మరాఠా రిజర్వేషన్ ఉద్యమ కార్యకర్త మనోజ్ జరంగే మహారాష్ట్ర ప్రభుత్వానికి అల్టిమేటం విధించారు. మరాఠాలకు కున్బి కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయడానికి గత వారం జారీ చేసిన జిఆర్‌ను ఈనెల 17లోపు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తాను మళ్ళీ 'కఠినమైన నిర్ణయం' తీసుకుంటానని హెచ్చరించారు. తమ డిమాండ్లలో 96 శాతం నెరవేరాయని జరంగే పేర్కొన్నారు. మరాఠా సామాజికవర్గానికి పూర్తి న్యాయం కోసం తన పోరాటం కొనసాగుతుందని ఉద్ఘాటించారు. మరాఠ్వాడ, పశ్చిమ మహారాష్ట్రకు చెందిన మరాఠా సామాజికవర్గాలకు రిజర్వేషన్లు లభిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇతర వెనుకబడిన తరగతి (ఒబిసి)గా వర్గీకరించబడిన సామాజికవర్గమైన కున్బి కుల ధృవీకరణ పత్రాలను మరాఠాలకు జారీ చేయడానికి ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించగా, జరంగే తన ఐదు రోజుల నిరాహార దీక్షను విరమించారు. కాగా, రాష్ట్రంలోని తాలూకా స్థాయి కార్యాలయాలు జిఆర్‌పై చర్య తీసుకోవాలని ప్రభుత్వం కోరుతుందని తాము ఆశిస్తున్నామని, సెప్టెంబర్ 17లోపు పని ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నామని జరంగే పేర్కొన్నారు. లేనిపక్షంలో కఠినమైన నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుందని హెచ్చరించారు.

## శాంతిస్తున్న 'యమున'



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని ఓల్డ్ రైల్వే బ్రిడ్జి వద్ద యమునా నది నీటి మట్టం సోమవారం ఉదయం 205.22 మీటర్లకు తగ్గిందని అధికారులు తెలిపారు. అంతకుముందు రోజు 205.33 మీటర్లు ఉండగా, నీటిమట్టం ఈసీజన్‌లో గత గురువారం అత్యధికంగా 207.48 మీటర్లకు చేరగా, అది క్రమంగా తగ్గుతోంది. వరద నియంత్రణ బులెటిన్ ప్రకారం ఓల్డ్ రైల్వే బ్రిడ్జి నీటి మట్టం రాత్రి 205.02 మీటర్లు తగ్గనుంది. ఈనేపథ్యంలో ప్రజలు త్వరలో తమ ఇళ్లకు తిరిగి రావనున్నారు. అయితే వారికి తమ తమ ఇళ్లను శుభ్రం చేసుకోవడం సవాల్‌గా మారనుంది. నగరానికి యమున హెచ్చరిక గుర్తు 204.50 మీటర్లు కాగా, ప్రమాద గుర్తు 205.33 మీటర్లు. అయితే ప్రజలను తరలించడం 206 మీటర్ల నుండి ప్రారంభమవుతుంది. గత మంగళవారం నది ప్రమాద స్థాయిని దాటి ప్రవహించడంతో, పాత రైల్వే వంతెనపై రాకపోకలు నిలిచిపోయాయి. ఈ పరిస్థితి దాదాపు 10,000 మందిని నిరాశ్రయులను చేసింది. నది ప్రవాహాని, సంభావ్య వరద ప్రమాదాలను ట్రాక్ చేయడానికి పాత రైల్వే వంతెన కీలకమైన పరిశీలన కేంద్రం గా పనిచేస్తుంది. వరద నియంత్రణ విభాగం ప్రకారం, హత్నికుండ్ బ్యారేజీ 44,210 క్యూసెక్కుల నీటిని విడుదల చేసింది. వజీరాబాద్ బ్యారేజీ నుంచి 62,620 క్యూసెక్కుల నీరు విడుదలైంది. బ్యారేజీల నుండి విడుదలయ్యే నీరు సాధారణంగా ఢిల్లీకి చేరుకోవడానికి 48 నుండి 50 గంటలు పడుతుంది. గత కొన్ని రోజులుగా నది దాని ఒడ్డున ఉన్న అనేక ప్రాంతాలను వరద ముంచెత్తింది. నదికి సమీపంలోని లోతట్టు ప్రాం తాల నుండి తరలించబడిన ప్రజలను తాత్కాలికంగా ఉంచడానికి ఢిల్లీ–మీరట్ ఎక్స్‌ప్రెస్‌వేపై, మోరి గేట్ సమీపంలోష మయూర్ విహార్‌లో టెంట్లు ఏర్పాటు చేశారు. మొనాస్టరీ మార్కెట్, మదన్ పూర్‌ఖాదర్, యమునా బజార్ వంటి ప్రాంతాలు వరదల్లో మునిగిపోయాయి. దీని వలన ప్రజలను సహాయ శిబిరాలకు తరలించారు. 2023లో ఢిల్లీ అత్యంత దారుణమైన వరద పరిస్థితిని ఎదుర్కొంది. ఆ సమయంలో అనేక ప్రాంతాలు మునిగిపోయాయి. దీని ఫలితంగా 25,000 మందికి పైగా ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. జూలై 13, 2023న యమునా నది ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయి 208.66 మీటర్లను తాకింది. కీలక ప్రదేశాలతో సహా ఢిల్లీలోని అనేక ప్రాంతాలలో వరదలు సంభవించాయి.

## ప్రపంచ వాణిజ్య సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవాలి

ఇఇపిసి 'ప్లాటినం జూబ్లీ'ని ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం




**న్యూఢిల్లీ :** ప్రపంచ వాణిజ్యాన్ని కొత్త అవకాశాలుగా మార్చడానికి భారతదేశం తన అసాధారణ సామర్థ్యాలను ఉపయోగించుకోవాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. సోమవారం ఇక్కడ జరిగిన ఇంజనీరింగ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఇఇపిసి) ప్లాటినం జూబ్లీని ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. గత ఏడు దశాబ్దాలుగా భారతదేశ ఇంజనీరింగ్ ఎగుమతుల గమ్యస్థానాలు గణనీయంగా మారాయని ఆమె నొక్కిచెప్పారు. ఇఇపిసి ఈ పరివర్తన ప్రక్రియను నిరవధికంగా కొనసాగించి 'నేషన్ ఫస్ట్' అనే స్ఫూర్తితో భారతదేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేసే దిశగా పనిచేయాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. 'దేశంలో అందుబాటులో ఉన్నటువంటి అసాధారణ సామర్థ్యాలను ఉపయోగించుకోవడం ద్వారా ప్రపంచ వాణిజ్యం యొక్క సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనాఉంది' అని ముర్ము చెప్పారు, తక్కువ వ్యయ ంతో అధిక నాణ్యత కలిగిన ఇంజనీరింగ్ ఉత్పత్తులు భారతదేశానికి గొప్ప బలం అన్నారు. గత 10 సంవత్సరాలలో భారత దేశ ఇంజనీరింగ్ ఎగుమతులు 70బిలియన్ అమెరికన్ డాలర్ల నుండి 115 బిలియన్ అమెరికన్ డాలర్లకు పెరిగాయన్నారు. గత దశాబ్దంలో అంతర్జాతీయ వాణిజ్యంలో అనేక సవాళ్లు ఉన్నాయని మేం పరిగణనలోనికి తీసుకున్నప్పటికీ ఎగుమతుల్లో ఈ పెరుగుదల చాలా తక్కువగా కనిపిస్తుందని ముర్ము తెలిపారు.అంతర్జాతీయ మార్కెట్, భారతీయ ఉత్పత్తుల మధ్య ఇఇపిసి ఒక వారధిగా పనిచేస్తున్నదని పేర్కొన్నారు. ప్రపంచం విలువ గొలుసులో భారతదేశం పాత్రను విస్తరించాలని రాష్ట్రపతి ఇఇపిసిని కోరారు. వాణిజ్య క్రమం, అంతర్జాతీయ క్రమంలో జరుగుతున్న మార్పుల కారణంగా ఇఇపిసి పాత్ర ముఖ్యమైనదన్నారు. ఆర్థికరంగంలో ముఖ్యమైన భాగస్వామిగా ఉన్నందువల్ల మరింత దృఢ సంకల్పంతో వ్యవహరించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నొక్కిచెప్పారు. భారతదేశంలో ప్రపంచంలోనే అతిపెద్ద గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, ఇఇపిసి వంటి వాటాదార్లు భారతదేశాన్ని గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్‌గా మార్చడానికి ముందుకు సాగాలని, దీనికి అనుకూలమైన ప్రోత్సాహకాల ఏర్పాటు, పర్యావరణ వ్యవస్థను అందించాలని రా ష్ట్రపతి కోరారు.

ట్రంప్ టారిఫ్‌లతో నష్టపోయిన ఎగుమతిదారులకు

# సమగ్ర ప్యాకేజీకి కసరత్తు

నిర్మలా సీతారామన్



**న్యూఢిల్లీ:** అతిభారీస్థాయిలో అమెరికా విధించిన 50 శాతం సుంకాలవల్ల తీవ్ర ప్రభావానికి గురయ్యే భారత ఎగుమతిదారులకు మద్దతుగా ఒక సమగ్ర ఆర్థిక సహాయ పథకం తయారు చేసేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ చెప్పారు. భారతదేశం నుండి అమెరికాకు ఎగుమతయ్యే వివిధ రంగాలకు చెందిన సరుకులపై టారిఫ్‌లను మదింపు వేసే ప్రక్రియ కొనసాగుతోందని, అనేక ప్రభుత్వవిభాగాలు ఈ పనిలోనే నిమగ్నమై ఉన్నాయని చెప్పారు. రెండో విడతగా ఆగస్టు 27వ తేదీ నుండి ట్రంప్ యంత్రాంగం అమలులోకి తీసుకువచ్చిన 25 శాతం పెనాల్టీ టారిఫ్‌ల బారిన పడిన పలు పరిశ్రమలు ఆ ప్రభావం గురించి సంబంధిత శాఖలకు లేదా మంత్రులకు తమ గోడు వెళ్ళబోసుకుంటున్నాయని, ఆ సమాచారాన్ని క్రోడీకరించి ఒకచోట చేరుస్తున్నామని పిటిఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి సీతారామన్ చెప్పారు. ''మన ఎగుమతిదారులు, పరిశ్రమలు ఏ మేరకు ఈసుంకాల ప్రభావంవల్ల నష్టపోతున్నాయో ఆసమాచారాన్ని అంతటినీ వివిధ ప్రభుత్వ విభాగాలకు, శాఖలకు తెలియజేస్తున్నాయి, ఆ సమాచారం ఆధారంగా ఒక సమగ్ర ప్యాకేజీ రూపొందించి ఎగుమతిదారులకు మద్దతు ఇచ్చేందుకు వీలు కలుగుతుంది, రెండు విడతలుగా అమెరికా విధించిన 50 శాతం సుంకాలవల్ల ఎగుమతిదారులు తీవ్ర ప్రభావానికి గురవుతున్నారు'' అని మంత్రి చెప్పారు. ''ఇప్పటివరకూ ఎంత నష్టం జరిగిందనే విషయాన్ని మేం ఎలా అంచనావేయగలం? అందువల్ల ప్రతిమంత్రిత్వశాఖతోనూ సంబంధిత ఎగుమతిదారులు, పరిశ్రమలు మాట్లాడాలి, ఆ సమాచారాన్ని మంత్రులకు, సంబంధిత వివిధ విభాగాలకు తెలియజేయాలి, అప్పుడే మేం వాటిని ఒకచోట క్రోడీకరించి పరిశీలన చేయగలం'' అన్నారు. ప్రపంచంలో ఏ దేశంపైనా విధించనంత భారీ సుంకాన్ని ట్రంప్ భారత్‌పై విధించారు. బ్రెజిల్,భారత్ రెండు దేశాలపైనా 50 శాతం మేరకు సుంకాలు విధించారు. భారత్‌పై ఆగస్టు ఏడో తేదీ నుండి 25శాతం అదనపు సుంకాలు అమలులోకి తెచ్చారు. రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తూ, ఆ దేశంతో వ్యాపారం చేస్తున్నందుకుగాను మరో 25 శాతం పెనాల్టీ విధించి ఆగస్టు 27వ తేదీ నుండి అమలులోకి తెచ్చారు. రష్యా నుండి ముడి చమురు దిగుమతి చేసుకుని దానిని శుద్ధిచేసి ఇతర దేశాలకు విక్రయించడం ద్వారా ఆదేశానికి భారత్ భారీ లాభాలు సమకూరుస్తోందని, ఈ ధనంతోనే పుతిన్ ఉక్రేన్‌లో యుద్ధం కొనసాగిస్తున్నారని, ఆ యుద్ధం కొనసాగడానికి పరోక్షంగా భారత్ కారణమని ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేసినప్పటినుండీ భారత్–అమెరికా మధ్య సంబంధాలు క్షీణదశలో ప్రయాణిస్తున్నాయి. ఈ భారీ సుంకాలవల్ల ప్రధానంగా కార్మికులు,కార్మికశ్రమ అత్యధికంగా ఉండే టెక్స్‌టైల్స్, వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు, రొయ్యలు, తోలు ఉత్పత్తులు,చెప్పులు, పాడి ఉత్పత్తులు, రసాయనాలు,ఎలక్ట్రానిక్స్, మెకానికల్ యంత్ర విభాగాలకు నష్టం కలుగుతుంది. ఫార్మా, ఇంధన ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఈ భారీ సుంకాల బారి నుండి తప్పించుకున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుండి 437.42 బిలియన్ డాలర్లు విలువైన 20 శాతం ఎగుమతులు జరిగాయని అమెరికా లెక్కకట్టింది. 2021–22 ఆర్థిక సంవత్సరం నుండి అమెరికాకు అతిపెద్ద వాణిజ్యభాగస్వామిగా ఉంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రెండు దేశాలమధ్యా వస్తు ఎగుమతుల వాణిజ్యం 131.8 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇందులో 86.5 బిలియన్ డాలర్లు ఎగుమతులు ఉండగా, 45.3 బిలియన్ డాలర్ల మేరకు దిగుమతులు ఉన్నాయని నిర్మలా సీతారామన్ పిటిఐ ఇంటర్వ్యూలో చెప్పారు.

**22వ తేదీ నుండి దాదాపు 400 వస్తువుల ధరల తగ్గుదల...**

0వస్తుసేవల పన్ను (జిఎస్‌టి)లో ప్రజలకు మేలుచేసేవిధంగా మైలురాయి ఘట్టం వంటి సంస్కరణలు తీసుకువచ్చామని మంత్రి చెప్పారు. జిఎస్‌టి పన్ను రేటు హేతుబద్ధీకరణవల్ల ప్రతి కుటుంబం అనేక వస్తువుల కొనుగోళ్ళలో ఎంతో లాభపడుతుందని, దీనివల్ల వినియోగం, కొనుగోళ్ళు భారీగా పెరుగుతాయని, ఆర్థిక వ్యవస్థకు కొత్త ప్రోత్సాహం వస్తుందని నిర్మలాసీతారామన్ చెప్పా రు. ఈ విషయాలను తాను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నానన్నారు. ఇప్పటికే కొన్ని పరిశ్రమలు కొత్త ధరలను ప్రకటించాయని, కొద్దిరోజుల వ్యవధిలోనే కార్ల కంపెనీలు, ప్రభుత్వరంగ బీమా కంపెనీఉ,చెప్పులు,వస్త్రాల బ్రాండ్స్ వారు కూడా ఇప్పటికే గణనీయంగా ధరలు తగ్గించారని మిగిలిన రంగాలవారు కూడా మెల్లిగా ధరలు తగ్గిస్తారని చెప్పారు. కొత్తగా ఆమోదించిన రెండు శ్లాబుల విధానం ఈనెల 22వ తేదీ నుండి అమలులోకి వస్తుందని, ఇక అప్పటినుండీ సబ్బుల దగ్గర నుండి కార్లు వరకూ దాదాపు 400 రకాల వస్తువుల ధరలు తగ్గుతాయని, ప్రజలకు ఎక్కువగా అందుబాటులోకి రావడంవల్ల కొనుగోళ్ళు భారీగా పెరుగుతాయని మంత్రి నిర్మలాసీతారామన్ చెప్పారు. దసరా శరన్నవరాత్రుల మొదటి రోజు నుండీ ఈ ధరలు అందుబాటులోకి వస్తాయన్నారు. వ్యక్తుల ఆరోగ్యం, జీవిత బీమాలకు పన్ను లేదు. అదేవిధంగా ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే వస్తువులపైన, బాగా విలాసవంతమైన వస్తువులపైన అత్యధికంగా 40 శాతం పన్ను విధించారు. ఈ సంస్కరణలు దేశంలోని 140 కోట్లమంది ప్రజలకు ఉపయోగపడతాయని ఆమె చెప్పారు.

# సాంప్రదాయక,శాస్త్రీయ వైద్యాల మిక్స్

ప్రజాపక్షం 09-09-2025, మంగళవారం

వెనకటికొకడు – పిచ్చి ముదిరింది, తలకు రోకలి చుట్టండి అన్నాడట. సకల విద్యలకు, కళలకు భారతదేశమే మూలమని విశ్వసించే ధోరణుల వ్యవహారం అలాగే ఉంది. ఆ మాట అన్నామంటే ప్రాచీన భారతదేశంలో ప్రాచుర్యం పొందిన గణితం, వైద్యం, నాట్యశాస్త్రం తదితర విద్యలను చిన్నచూపు చూడటం కానేకాదు. వేదగణితం, ఆయుర్వేదం భారతీయుల సొంతం. అయితే అవి మన దారి స్తాలు, గోష్ఠిక, గురు–శిష్య పరంపరతో ఒకానొక దశలో అభివృద్ధి కోల్పోయాయి. ప్రపంచమంతా శాస్త్రం(సైన్స్) అభివృద్ధి చెందుతూ ఉంటే మన విద్యలు శాస్త్రీయంగా అభివృద్ధికి నోచుకోలేదు. వేద గణితం గూర్చి మనం ఎంత గొప్పగా చెప్పుకున్నా అది శాస్త్రవిజ్ఞాన అభివృద్ధిలో భాగం కాలేకపోయింది. శాస్త్రీయంగా అభివృద్ధి చెందిన ఇంగ్లీషు వైద్యం (అల్లోపతి) ప్రజలకు గగనకుసుమంగా ఉన్నంతకాలం, ఆయుర్వేదు వంశపారంపర్యంగా అలవరుచుకున్న ఆయుర్వేద వైద్యమే ప్రజలకు ఎంతో కొంత దిక్కు అయింది. స్వాతంత్ర్యానంతరం 70 ఏళ్లకైనా అత్యధిక జనాభాకు ఇంగ్లీషు వైద్యం, మందులు అందుబాటులోకి వచ్చాయి. జనరిక్ మందుల తయారీ, ఎగుమతిలో మనమే టాప్ అని ఘనంగా చెప్పుకోవచ్చు. అదే సమయంలో ఆయుర్వేదం, యునాని, సిద్ధ, ప్రకృతి వైద్యం వంటి దేశీయ చికిత్సారీతులు ప్రభుత్వ ప్రోత్సాహంతో, కొందరు వ్యక్తుల కృషితో వర్ధిల్లుతున్నాయి. ధార్మిక భావాలలో విశ్వాసం మెండుగా ఉన్న బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చాక యోగాతోపాటు, ఆయుర్వేదకు రాజపోషణ పెరిగింది. బాబా రాందేవ్ లాంటివాళ్లు కాషాయాన్ని ఆశ్రయించి స్వల్పకాలంలోనే ఆయుర్వేద వైద్య వ్యాపారిగా గణుతికెక్కారు. తప్పుడు పబ్లిసిటీ ఎంచుకున్నందుకు కోర్టులనుంచి ఛీవాట్లు తింటుంటారు.

ఏ వైద్య రీతి దాని మార్గంలో అది అభివృద్ధి చెందవచ్చు. ప్రజల ఆదరణ, వ్యామోహం బట్టి ఐతికి బట్టకడుతూ ఉంటాయి. ఇప్పుడు సమస్య ఏమంటే ఎంబిబిఎస్ (బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్ అండ్ సర్జరీ), బిఎఎంఎస్ (బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ)లను కలగలిపి పుదుచ్చేరిలోని జిప్మర్‌లో ఐదేళ్ల పెదక డిగ్రీ కోర్సు చేయటానికి కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిందట! ఆ పైన ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్, రెండు డిగ్రీలు ఇస్తారట! అలోపతీలో ఫౌండేషన్ సిద్ధం చేసిన ఈ ప్రతిపాదనను వైద్య, కుటుంబ సంక్షేమ, ఆయుష్ కేంద్ర సహాయమంత్రి ప్రతాపరావు జాదవ్ మే 27న ఆవిష్కరించారు. ఈ వినూత్న ప్రయోగ ప్రకటన చేశారు. మొదటి దశకు సిలబస్ సిద్ధంగా ఉందట. దేశంలో వైద్య విద్యను నియంత్రించే నేషనల్ మెడికల్ కౌన్సిల్, వైద్యశాస్త్ర ప్రవీణులు, సంస్థలు, పరిశోధనా సంస్థలు సమగ్ర ప్రాతిపదికగా ఈ సిలబస్ తయారు చేశాయట. అయితే ఆర్‌టిఐ ప్రశ్నకు సమాధానంగా లభించిన దస్తావేజుల ప్రకారం, వైద్య విద్య కొత్త కోర్సులు, సిలబస్ నిర్ణయించే ఎన్ఎంసి, భారతీయ వైద్య రీతి మెడిసిన్ జాతీయ కమిషన్‌లకు ఈ ప్రతిపాదనలో పాత్ర లేక పోవటం హాస్యాస్పదంగా ఉంది.

వివిధ వైద్య రీతులను కలగలిపే విద్య అశాస్త్రీయం అని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఖండించింది. ప్రజల ప్రయోజనం రీత్యా ఈ 'కిచిడీ' కోర్సు ప్రతిపాదన ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కేరళకు చెందిన ఆర్‌టిఐ కార్యకర్త డాక్టర్ కె.వి.బాబు పంపిన దరఖాస్తుకు ఆ ప్రతిపాదన గూర్చి సమాచారమివ్వటానికి జిప్మర్ తిరస్కరించింది. కేంద్రమంత్రి అట్టహాసంగా ప్రకటించిన కషాయం కోర్సు గూర్చి దాపరికమెందుకు? అలోపతి కార్యదర్శి మాత్రం దీనిపై చర్చలు జరిగాయని ధృవీకరించారు గాని వివరాలు వెల్లడించలేదు.

ఎంబిబిఎస్, బిఏఎంఎస్ డిగ్రీలు రెండూ ఒకే కోర్సు కింద ప్రదానం చేసేందుకు అనుమతించే చట్టం ఏదీ దేశంలో లేదు. నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు తెలియకుండా ఈ కలగూరగంప కోర్సును ఎలా ప్రవేశపెడతారో దాన్ని ప్రకటించిన మంత్రికైనా తెలుసో, లేదో! 21వ శతాబ్దంలో కూడా ఆధునిక ప్రపంచదేశాలు, శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధిని చూడనొల్లనివారు మంత్రులుగా ఉండటం దౌర్భాగ్యం.

# వెనుజులా కబళింపుకై అమెరికా యుద్ధ నౌకలు



బుడ్డిగ జమీందార్
9849491969



లాటిన్ అమెరికా దేశమైన వెనుజులా వామపక్ష అధ్యక్షుడు మదురో ప్రభుత్వాన్ని కూల్చి అమెరికా తన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోటానికి 8 యుద్ధ నౌకలు, దాదాపు 4,500 మంది మిలిటరీ సిబ్బందితో కూడి న అమెరికా నావికా దళం వెనిజులా తీరానికి సమీపంలో మోహరించింది. న్యూస్‌వీక్ అందించిన సమాచారం ప్రకారం గైడెడ్ క్షిపణి డిస్ట్రాయరు యుఎస్ఎస్ జాసన్ డన్‌హామ్ యుఎస్ఎస్ గ్రేవీ, లిటోరల్ యుద్ధనౌకలు, యుఎస్ఎస్ మినియాపొలిస్‌లు ఇప్పటికే వెనుజులా జలాలను చుట్టుముట్టాయి. రెండు ఉభయచర రవాణా డాక్‌లు, పి8 సముద్ర పట్రోల్ విమానాలు ప్యూర్టోరికో సమీపంలో ఉండి వెనుజులాపై దాడికి సిద్ధంగా ఉన్నాయి. అణుశక్తితో నడిచే జలాంతర్గాములు కూడా వెనుజులా సమీప జలాల్లో గస్తీ తిరుగుతున్నా యి. వెనుజులాలో ప్రతిపక్ష నాయకురాలు ఫాసిస్టు మారియా కొరినా ట్రంప్‌కు మద్దతు పలికింది. ఏ దేశంపైనైనా యుద్ధం చేసి ఆ దేశంలో తన అనుకూల ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలంటే ముందుగా ఒక దుష్ప్రచార నినాదాన్ని తన మీడియా ద్వారా అమెరికా సామ్రాజ్యవాదం తన మిత్ర దేశాలతో తెరమీదికి తీసుకొస్తుంది. ఈ నినాదాన్ని ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్లి యుద్ధాన్ని చేస్తుంది అమెరికా.

''ఉగ్రవాదం పై గ్లోబల్ యుద్ధం'' పేరిట అఫ్ఘనిస్తాన్‌పైనా, 'చెడుఅక్షంపై యుద్ధం' నినాదంతో ఇరాక్‌పైనా, 'కొసావాలో జాతి ప్రక్షాళణను ఆపండి' పేరిట యుగోస్లావియాపైన, 'గరిష్ఠ ఒత్తిడి' పేరన ఇరాన్‌పైనా వ్యాప్తిలోకి తెచ్చిన నినాదాలు కొన్ని ఉదాహరణలు మాత్రమే. వీటికి తోడు 'ప్రజాస్వామ్యం కోసం', 'మానవ హక్కుల కోసం', 'నియమాల ఆధారిత ప్రపంచ నిబంధనలు మొదలగు సూత్రాలను తరచూ అమెరికా యుద్ధాల కోసం వాడుకొంటుంది. తాజాగా ఇప్పుడు వెనుజులాపై ప్రయోగించి ప్రచారం చేస్తున్న యుద్ధ నినాదం 'మాదక ద్రవ్యాల వ్యతిరేకం' గా తీసుకొచ్చింది. కానీ వాస్తవానికి చైనా, రష్యాల అనుకూల వామపక్ష ప్రభుత్వాన్ని వెనుజులాలో కూలదోయటమే ట్రంప్ ప్రధాన లక్ష్యం. 1989 లో పనామాపై కూడా ఇటువంటి మాదక ద్రవ్యాల నినాదంతో అమెరికా 27 వేల మంది సైనికులతో దాడిచేసి పనామాను వశపర్చుకొని, పనామా కాలువపై ఆధిపత్యాన్ని సాధించి, వేలాది మంది సామాన్య ప్రజలను చంపింది.

అధ్యక్షుడు మదురో మాదక ద్రవ్యాల విక్రేతేగానీ చట్టబద్ధమైన అధ్యక్షుడు కాదని, నార్కో టెర్రరిస్టు అని పేర్కొంటూ తనను అరెస్టు చేస్తే ఇది వరకు ప్రకటించిన వైట్‌హౌస్ బహుమతి 250 లక్షల డాలర్ల నుంచి ఇప్పుడు 500 లక్షల డాలర్లకు పెంచింది.

వెనుజులాపై తిరగబడటానికి యుద్ధ నౌకలు తమ సముద్ర జలాల్ని ఉపయోగించుకోవచ్చునని దక్షిణ కరీబిక్ దీవుల దేశం ట్రినిడాడ్, టొబాగో లు ఈ ఆపరేషన్‌కు మద్దతు ప్రకటించాయి. తమ భూభాగంలో మిలిటరీ స్థావరాల ఏర్పాటుకు అంగీకరించాయి. అమెరికా విదేశాంగ మంత్రి రూబియో మెక్సికో, ఈక్వెడార్ దేశాల మద్దతు కోసమై వెళ్లనున్నాడు. ఇప్పటికే ఈక్వెడార్ లో ట్రంప్ మిత్రుడు ఫాసిస్టు అధ్యక్షుడు డేనియల్ నోబోవా విదేశీ సైనిక స్థావరాలను ఆహ్వానించాడు. వెనుజులాపై సైనిక దాడిని సమర్థిస్తానన్నాడు. ఫ్రెంచ్ అధ్యక్షుడు మాక్రాన్ తన మద్దతును ధృవీకరించాడు. కెనడా, ఇటలీ, యూ.కె, మద్దతు అమెరికా పొందింది. ఇక యుద్ధమే తరువాయిగా అన్నట్టు పావులు కదులుతున్నది. వెనుజులా ఆక్రమణ ద్వారా దక్షిణ సెంట్రల్ అమెరికాలో చైనా వాణిజ్య సంబంధాలను దెబ్బ తీసే భాగంగా కూడా ఈ యుద్ధ ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మరోవైపున వెనిజులా అధ్యక్షుడు మదురో గస్తీ కోసం సముద్ర జలాల్లోకి యుద్ధ నౌకలను పంపాడు. అనేక డ్రోన్‌లను సిద్ధం చేశాడు. కొలంబియా సరిహద్దుకు 15 వేల మంది సైనికుల్ని పంపాడు. లక్షలాది మంది సగం శిక్షణ పొందిన మిలీషియా సభ్యులను ప్రత్యామ్నాయంగా సిద్ధపరిచాడు. పాలన మార్పునకు సైనిక ఉగ్రదాడిని ప్రోత్సహిస్తున్న వాషింగ్టన్‌ను మదురో ఖండించాడు. దేశ పౌరులను మిలీషియాలో చేరమని మదురో పిలుపునిచ్చాడు. గత 20 రోజుల నుంచి మాపై ముట్టడి ప్రయత్నాలు పెరిగే కొద్దీ మేమింకా బలపడ్తున్నామని మదురో ప్రకటించాడు. వెనుజులాను రక్షించటానికి సహాయమందించవల్సిందిగా ఐరాసకు ఇతర దేశాలకు మదురో విజ్ఞప్తి చేశాడు. ఒకవేళ యుద్ధం అనివార్యమైతే ప్రజాబలం నెగ్గుతుందా లేక యుద్ధోన్మాదం నెగ్గుతుందో వేచి చూడాలి. చైనా వంటి దేశాల ఖండనే తప్ప ప్రత్యక్షంగా మద్దతు చేస్తున్న జాడ కనబడటం లేదు. కానీ కొన్ని దేశాలు సామ్రాజ్యవాదంపై ఆర్థికంగా ఆధారపడి తమ అధికారాన్ని రక్షించుకోటానికి తమ దేశ పౌరులను, కార్మికులను అమెరికాకు ఫణంగా పెడుతున్నారు.

ప్రపంచ ముడిచమురు నిల్వల్లో వెనుజులా దేశం 20 శాతంతో అగ్రభాగాన ఉంది. కానీ ప్రపంచ ముడి చమురు ఉత్పత్తిలో 1 శాతం కూడా లేదు. సామ్రాజ్యవాద దేశాలు వెనుజులాను దిగ్బంధనంచేయటం, సోషలిజం దిశగా సాగుతున్న ఆదేశాన్ని అడుగడుగునా అడ్డుపడటం కోసం వెనుజులా దేశంపై రాజకీయ, ఆర్థిక ఆంక్షలు విధించటం ప్రధాన కారణాలు. ద్రవ్యోల్బణం కొంచెం తగ్గి 2025 నాటికి 400 శాతానికి ఉంది అంటే ఆర్థికంగా ఎంత వెనుకంజలో ఉందో అర్థమవుతుంది. నిరుద్యోగం 6శాతమే ఉండటం గమనార్హం. వెనుజులా జీడీపీలో అగ్రభాగం 95 శాతం వరకూ ముడిచమురు ఎగుమతులపైనే ఆధారపడింది. అటువంటి ఎగుమతులను జరగనివ్వకుండా ఆంక్షలతో వెనుజులా ఆర్థిక వ్యవస్థను అమెరికా చిదిమేస్తుంది.

వెనుజులా అంటే అమెరికాకు ఎందుకీ కక్ష, వైరం? సరళీకృత ఆర్థిక విధానాల సారాంశంలో ఒక భాగం ముడి సరుకులను కారుచౌకగా కొనటం, తద్వారా ఉత్పత్తి కాబడిన యంత్రాలు, యంత్ర పరికరాలు, యుద్ధ సామగ్రి విలువ పెంచి వర్ధమాన దేశాల ప్రజల కొనుగోలు శక్తి క్షీణింపజేయటం. బొలీవియన్ విప్లవ పార్టీ నాయకుడు హ్యూగో ఛావెజ్ నాలుగుసార్లు వెనిజులా అధ్యక్షునిగా (1999–2013) అనేక ప్రజా అనుకూల పథకాలు ప్రవేశపెట్టి ఆర్థికవ్యవస్థను గాడిన పెట్టాడు. తన మరణానంతరం మదురో అధికారంలోకి వచ్చాడు. ఛావెజ్ వెనుజులా దశదిశను మార్చాడు. 1970 దశకంనుండి చమురు ధరలు విపరీతంగా పెరగగా విదేశీ ఆదాయం ప్రైవేటు రంగ చమురు పరిశ్రమాధికారుల (ఎక్కువ అమెరికా కంపెనీలు)కు దక్కేవి. చమురు పరిశ్రమలను ఛావెజ్ జాతీయం చేశాడు.

2005 లో భూ సంస్కరణలు అమలు చేశాడు. ఇదే సంవత్సరంలో 13 లాటిన్ అమెరికా దేశాలు కలిసి వాణిజ్య సమాఖ్యగా ఏర్పడినాయి. ఈ 3 ప్రధాన కారణాల నుంచి నష్టం పొందిన కార్పొరేట్ కంపెనీలు అప్పటి నుంచి ఇప్పటిదాకా ఆంక్షల రూపంలో వెనుజులాపై దాడికి దిగటమేగాక , 2009 లో కొలంబియాను ఉసిగొల్పి వెనుజులాపై యుద్ధం చేసి పరాభవం పొందిన అమెరికా ఇప్పుడు మరలా ప్రత్యక్ష యుద్ధానికి ఎత్తుగడలు వేస్తున్నది. తిరిగి తన అనుకూల ప్రభుత్వాన్ని నియమించటం కోసం పావులు కదుపుతోంది.

# గుజరాత్ మోడల్ 'చట్టబద్ధ అవినీతి'

## కేంద్ర దర్యాప్తు సంస్థల కంటికి కనిపించదా?



ఎస్.తిర్మల్

అవినీతి అష్టాదశ రూపాలుగా విస్తరిస్తోంది. అందులో చట్టబద్ధ అవినీతి కూడా ఓ ప్రధాన రూపంగా మారి పోయింది. ఇప్పుడు పాలకులకు అదే కామధేనువు, కల్ప వృక్షం కూడానూ? ఓట్లను సరకుగా మార్చి, కొనుగోలు రూపంలోకి మార్చిన రాజకీయాలు బయటకు ఎన్ని చిలుక పలుకులు పలికినా.. లోపల అందివచ్చిన రూపం లో దండుకోవడమే లక్ష్యంగా భారీ ప్రాజెక్టులు, పథకాలు రూపకల్పన చేసుకుంటున్నారు. అప్పులు, పరోక్ష పన్నుల రూపంలో ప్రజలకు నొప్పి తెలియకుండా సొమ్ములు పోగేసుకుంటున్న ఆధునిక ప్రభుత్వాలు ప్రజలకు పేదరికం పేరుతో,నగదు బదిలీ పేరుతో కొన్ని పథకాలను ఎరవేసి, ఓట్లు కొనుగోలు పరోక్ష రూపాలుగా మార్చుకున్నారు. ఉచితానుచితాల పేరుతో సామాజిక అభివృద్ధికి మంగళం పాడుతున్నారు. ఎన్నో త్యాగాలతో కూడబెట్టిన ప్రభుత్వ రంగ ఆస్తులను, సంస్థలను నష్టాల పేరుతో తమ సన్నిహిత ఆశ్రిత పెట్టుబడిదారులకు చౌక ధరలకు అమ్మకం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటుపరం చేస్తున్నారు. పరస్పర ప్రయోజనం పేరుతో పెట్టుబడి దారులు, పాలక రాజకీయ పార్టీల మధ్య అనుబంధం రోజురోజుకు బలోపేతం అవుతుంది. చట్టబద్ధ అవినీతికి సైతం మార్గాలు అన్వేషణ జరుగుతోంది. అందులో ఒకానొక రూపమే ఎలక్టోరల్ బాండ్లు వ్యవహారం. చట్టబద్ధ అవినీతి సాక్ష్యాధారాలతో సహా బయటపడినా కేంద్ర దర్యాప్తు సంస్థలైన ఇడి, సిబిఐ, ఐటి లాంటి సంస్థలు మౌనరూపం దాల్చడం వెనుక ఆంతర్యం ఏమిటి!? చట్టబద్ధమైన అవినీతి నిగ్గు తేల్చవలసిన అవసరం లేదా? ఈ ఎలక్టోరల్ బాండ్లు వ్యవహారం కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2017లో రూపుదిద్దుకుంది. ఎన్నికల ఖర్చు నిధులు సమకూర్చుకోవడంలో పారదర్శక త పేరుతో ప్రజా ప్రాతినిధ్య చట్టం1951ప్రకారం, సెక్షన్ 29(ఎ) ప్రకారం 7 జాతీయ పార్టీలు, 24 గుర్తింపుపొందిన ప్రాంతీయ పార్టీలు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా వెయ్యినుండి కోటిరూపాయల వరకు ఎలక్టోరల్ బాండ్లు రూపంలో చట్ట బద్ధంగా నిధుల సమీకరణకు అవకాశం కల్పించారు. 2018లో చట్టమైన ఈ ఎలక్టోరల్ బాండ్లు వ్యవహారం 2019 సాధారణ ఎన్నికల నుండి 2024 సాధారణ ఎన్నికల వరకు యథేచ్ఛగా చట్టబద్ధమైన రూపంలో రాజకీయ పక్షాలు నిధులు సమకూర్చుకున్నాయి. అయితే సమాచారహక్కు చట్టం సెక్షన్ 19(1)(ఏ) ప్రకారం సుప్రీంకోర్టు ఈ చట్ట బద్ధ అవినీతిరూపం ఎలక్టోరల్ బాండ్లు బ్యాన్ చేసేవరకు 18,299 ఎలక్టోరల్ బాండ్లు రూపంలో 9,857కోట్ల రూపాయలు ఆయా రాజకీయ పక్షాల అకౌంట్స్‌లో జమ అయ్యాయి. మెజార్టీ భాగం 6,060కోట్ల రూపాయలు అంటే 47.5శాతంతో కేంద్రంలో అధికారం లో ఉన్న బిజెపి పార్టీ అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత స్థానంలో తృణమూల్ కాంగ్రెస్ 1609 కోట్లు, కాంగ్రెస్ 1421కోట్లు, ఇంకా తెలంగాణాలోని బిఆర్ఎస్, జెయంయం,యస్పిపి,ఆప్ లాంటి పార్టీలు తర్వాత స్థానంలో నిలిచాయి.

ఇక సుప్రీంకోర్టు ఈ చట్టబద్ధ పాపంలో భాగం అయిన దాతలు పేర్లు రహస్యంగా ఉంచడాన్ని తప్పు పట్టే వరకు ఈ వ్యవహారంలో జరిగిన నీకిది, నాకిది అన్న చట్టబద్ధ అవినీతి వ్యవహారం బయటపడలేదు? ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసిన వారిలో సింహాభాగం ఆశ్రిత పెట్టుబడిదారులు, పెద్దపెద్ద ప్రాజెక్టులు నిర్మించిన బడా కాంట్రాక్టర్లు, సంస్థలు, టోల్ ప్లాజాల కాంట్రాక్టర్లు, మందుల తయారీ సంస్థలు, ఆయా రంగాల్లో వ్యాపారులు ప్రధానంగా ఉండడంతో ఈ ఎలక్టోరల్ బాండ్లు చట్టబద్ధ అవినీతిలో మరో కోణం బయటపడింది.

2024 ఎన్నికలముందు సుప్రీంకోర్టు తీర్పుతో కన్నంలో దొరికిన దొంగల్లా ఆయా పాలక రాజకీయ పక్షాల నీతి, రీతి ఏమిటో ప్రజలకు బహిర్గతం అయ్యింది. ఇకపోతే ఈ వ్యవహారంలో మరిన్ని చీకటి కోణాలు ఇటీవల దైనిక్ భాస్కర్ అనే వెబిసైట్ బయట పెట్టింది. మన ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వంలో కీలక స్థానాల్లో ఉన్న అమిత్ షా లసొంత రాష్ట్రం గుజరాత్ మోడల్ దోపిడిని బట్టబయలు చేసింది. ఇక్కడ ఓ తొమ్మిది బినామీ పార్టీల కు 2018–2024వరకు చేకూరిన4300కోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్లు కుంభకోణం వ్యవహారం అది. చిన్నాచితక పార్టీలకు అంతపెద్ద అమౌంట్ ఎలా చేకూరింది అనేదే పెద్ద ప్రశ్న.

అయితే ఆయా పార్టీల భౌతిక స్థితి అనేక అనుమానాలకు కారణం అవుతుంది. 1)లోక్సాహి సత్తాపార్టీ 1046కోట్లు పొందగా అది మూడు ఎన్నికల్లో 6మంది అభ్యర్థులను పోటీలో నిలిపి 3997 ఓట్లు మాత్రమే పొంది, 2.27లక్షలు మాత్రమే అధికారి గా ఎన్నికల్లో ఖర్చు పెట్టింది. 2)స్వతంత్ర అభివ్యక్తి పార్టీ 663కోట్లు పొంది మూడు ఎన్నికల్లో 6మంది అభ్యర్థులను పోటీపెట్టి 11,692ఓట్లు పొంది12.18లక్షలరూపాయలు ఖర్చు చేసింది. 3)న్యూ ఇండియా యునైటెడ్ పార్టీ 608కోట్లు పొంది మూడు ఎన్నికల్లో నలుగురు అభ్యర్థుల ను పోటీపెట్టి 9029ఓట్లు పొంది, 1.61లక్షలు ఎన్నికల్లో ఖర్చు చేసింది. 4)సత్యవాణి రక్షక్ పార్టీ 416కోట్లుపొంది ఇద్దరు అభ్యర్థులను పోటీపెట్టి 1042ఓట్లుపొంది1.43లక్షలు ఖర్చు చేసింది.5) బారతీయ జనపరిషత్ పార్టీ248 కోట్లు పొంది మూడు ఎన్నికల్లో 15మంది అభ్యర్థులను బరిలో నిలిపి14324 ఓట్లు సాధించింది. 14.08లక్షలు ఎన్నికల ఖర్చుచూపింది. 6)సౌరాష్ట్ర జనతాపక్ష్ 20కోట్లు పొందిఒక అభ్యర్థిని పోటీపెట్టి140ఓట్లుపొంది1.47లక్షలు ఎన్నికల ఖర్చు చూపింది.7 ) జన్మాల్ పార్టీ 133కోట్లు పొంది ఇద్దరు అభ్యర్థులను పోటీపెట్టి480ఓట్లు సాధించి1.31లక్షలు ఎన్నికల ఖర్చు చూపింది. 8)మానవాది కార్ నేషనల్ పార్టీ120కోట్లుపొందిఇద్దరు అభ్యర్థులను పోటీపెట్టి1887 ఓట్లుపొంది. 0.82లక్షలు ఎన్నికల ఖర్చుచూపింది. 9)గరీభ్ కళ్యాణ్ పార్టీ ముగ్గురు అభ్యర్థులు పోటీపెట్టి 3979ఓట్లుపొంది, ఎన్నికలఖర్చుగా, 3.27లక్షలు చూపించింది.

గుజరాత్ రాష్ట్రంలో గుర్తింపు పొందిన ఈ తొమ్మిది రాజకీయ పక్షాలు ఎలక్టోరల్ బాండ్లు రూపంలో 4300కోట్ల రూపాయలు పొందాయి.

అన్నిపార్టీలు అధికారికంగా మూడు ప్రధాన 2పార్లమెంటు, ఒక అసెంబ్లీ ఎన్నికల్లో 43మంది అభ్యర్థులను పోటీపెట్టి 54,069ఓట్లను మాత్రమే పొందగలిగాయి. అధికారికంగా 39.02 లక్షల ఎన్నికల ఖర్చు ఈ పార్టీలు చూపించాయి. ఈ గుజరాత్ మోడల్ రాజకీయ పక్షాలకు వచ్చిన 4300కోట్లరూపాయలు ఎలెక్టోరల్ బాండ్లు సొమ్ములు ఎవరి బొక్కసాలు నింపాయి.తేలాలసిఉంది.దైనిక్ భాస్కర్ పరిశీలనలో వీటిలో 3500కోట్లు ఖర్చు అయినట్లు ఆడిట్ నివేదికలు స్పష్టం చేశాయి. అంటే ఈ తొమ్మిది పార్టీలుఎన్నికల్లో కేవలం ఖర్చుచేసింది 39.02లక్షలు మాత్రమే మిగతా వేల కోట్లు రూపాయలు ఎవరి ఖజానాకు జమ అయ్యాయి? ఈ తొమ్మిది పార్టీలకు ఎలెక్టోరల్ బాండ్లు రూపంలో నిధులు జారీ చేసిన కంపెనీలు 24రాష్ట్రాలనుండి ఉన్నాయి. వారిలో జైదూస్, ఇన్టాస్, అలెంబిక్, అరవింద్, నిర్మాలాంటి బహుళజాతి కంపెనీలు, సంస్థలు ఉన్నాయి? అవి తమ నల్లధనాన్ని తెల్ల ధనం చేసుకోవడం తో పాటు ఆదాయపన్నురాయితీ 80సిసి,80సిసిబి ప్రకారం పొందారు. తద్వారాకూడా లబ్ధిపొందారు.ఇది ఆయా సంస్థలకు దక్కిన మరో ఆయాచిత లబ్ధి!ఇంతకీ ఈ రాజకీయ పక్షాలు ఏపక్షం బినామీలో నిగ్గు తేల్చాల్సి న అవసరం ఉంది? ఈ రాజకీయ పక్షాలకు అందిన 4300కోట్లరూపాయల ఎలెక్టోరల్ బాండ్లు గురించి, ఇంతపెద్ద చట్టబద్ధ అవినీతి గురించి ఎందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలు పట్టించుకోవడంలేదు? ఇన్ని వేలకోట్లు రూపాయలు అతీగతీ కనుక్కోవడంలో ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనం దాల్చుతుంది?

ఎలక్టోరల్ బాండ్లు రూపంలో జరిగిన ఈగుజరాత్ మోడల్ చట్టబద్ధ అవినీతి కుంభకోణం గురించి సమగ్ర దర్యాప్తు జరిపించాల్సిన తక్షణ అవసరం ఉంది. నిజాలు నిగ్గు తేల్చాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. ఆధారాలేని కేసులలో దూకుడు చూపుతున్న కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈవిషయంలో ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నాయి? అన్ని లెక్కలు సరితూచాల్సిన, సరిచేయాల్సిన సమయం దగ్గర పడుతుంది. కనుక గుజరాత్ మోడల్ చట్టబద్ధ అవినీతి రూపం,బినామీ మోడల్ కుంభకోణం దర్యాప్తు సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిద్వారా జరగాలని కోరుకుందాం.

సీనియర్ జర్నలిస్టు,
9441864514
ఇమెయిల్: thirmal.1960@gmail.com




## రాజకీయ పంథాను మలుపు తిప్పిన సిపిఐ మూడవ కాంగ్రెస్

### మధురై, 1953–54

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మూడవ కాంగ్రెస్ (జాతీయ మహాసభ) 1953 డిసెంబర్ 27 నుంచి 1954 జనవరి 3వరకు మధురై (తమిళనాడు)లో జరిగింది. 1952లో తొలి సార్వత్రిక ఎన్నికల్లో సిపిఐ పలు రాష్ట్ర శాసనసభల్లో ప్రాతినిధ్యంతోపాటు లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఆవిర్భవించింది. ప్రజాసంఘాలు నెమ్మదిగా పునరుద్ధరణ పొందుతున్నాయి. తక్షణ ప్రజాసమస్యలపై ఆందోళనలతో సిపిఐ దేశంలో బలమైన ప్రజాశక్తిగా ఆవిర్భవిస్తున్నది. రాజకీయ పంథాపై కూడా మహాసభ స్పష్టతకు వచ్చింది. ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ విదేశాంగ విధానంలో ప్రగతిశీల స్వభావాన్ని రాజకీయ తీర్మానం గుర్తించింది. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానంలో ప్రగతిశీల కాంగ్రెస్‌వాదులు సహా ప్రజాతంత్రశక్తులతో కూడిన ప్రభుత్వం ఏర్పాటు చేయటం కీలకమైన కర్తవ్యంగా ప్రధాన కార్యదర్శి అజయ్‌ఘోష్ వివరించారు.

ప్రధాన కార్యదర్శిగా అజయ్‌ఘోష్‌ను మహాసభ తిరిగి ఎన్నుకుంది. **పోలిట్‌బ్యూరో సభ్యులు :** అజయ్ ఘోష్ (ప్రధాన కార్యదర్శి), ఇఎంఎస్ నంబూద్రిపాద్, ఎస్ఎ డాంగే, పి.రామమూర్తి, సి.రాజేశ్వరరావు, పి. సుందరయ్య, రణేన్ సేన్, జడ్ఎ. అహ్మద్, హరికిషన్ సింగ్ సూర్జిత్, ఎం.బసవపున్నయ్య

**39 మంది సభ్యులతో కేంద్ర కమిటీ:**

1. అజయ్ ఘోష్, 2. ఇఎంఎస్ నంబూద్రిపాద్, 3. ఎస్ఎ డాంగే, 4. పి.రామమూర్తి, 5. సి.రాజేశ్వరరావు, 6. పి.సుందరయ్య, 7. రణేన్ సేన్ 8. జడ్ఎ. అహ్మద్, 9. హరికిషన్ సింగ్ సూర్జిత్, 10. ఎం.బసవపున్నయ్య 11. ఎం.హనుమంతరావు, 12. ఫణి బోర, 13. ముజఫర్ అహ్మద్, 14. జ్యోతి బసు, 15. భూపేష్ గుప్త, 16.యోగేంద్ర శర్మ, 17. ఎస్ ఎస్. మిరాజ్‌కర్, 18. ఎస్.జి.పాట్‌కర్, 19. ఎస్.జి.సర్దేశాయ్, 20. జి.అధికారి 21. టి.డి.శర్మ, 22. అరుణా అసిఫ్ అలి, 23. దిన్‌కర్ మెహత, 24. రావి నారాయణరెడ్డి, 25. బి.వెంకటేశ్వరరావు, 26. ఎన్.ఎల్.ఉపాధ్యాయ 27. ఎల్.ఆర్.ఖండేకర్, 28. సుదామ్ దేశ్‌ముఖ్, 29. ఎ.కె.గోపాలన్, 30.గురు చరణ్ పట్నాయక్, 31. సోహన్ సింగ్ జోష్, 32. హెచ్.కె.వ్యాస్, 33. ఎం.ఆర్.వెంకటరమణ్, 34. సి.అచ్యుత మీనన్, 35. ఎం.ఎన్.గోవిందన్ నాయర్, 36.దశరథ్ దేవ్ బర్మాన్, 37. ఎస్.ఎస్.యూసుఫ్ 38. ఎన్.ప్రసాదరావు, 39. రమేష్ చంద్ర

### 1955 జూన్ తీర్మానం

ఈ కీలకమైన పత్రం సిపిఐ ఎత్తుగడలు, వ్యూహాత్మక వైఖరులను, పార్లమెంటరీ సంస్థల సానుకూల పాత్రను వివరించింది. ప్రజాస్వామిక శక్తుల సంఘటన ప్రాముఖ్యతను వక్కాణించింది. భారత ప్రభుత్వ విదేశాంగ విధానాన్ని, దేశీయంగా ప్రభుత్వరంగ అనుకూలతతో కూడిన విధానాలను సానుకూల అంచనా వేసింది. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తూనే, మితవాద అభివృద్ధి నిరోధకులు అధికారంలోకి రాకుండా చూసేందుకు జాగ్రత్త పడాలని అది దిశానిర్దేశం చేసింది. **ప్రజాస్వామిక శక్తుల సంఘటనలో** కాంగ్రెస్‌లోని ప్రగతిశీల విభాగాలు కూడా ఉంటాయనే నిర్ధారణను ప్రకటించింది.

## పార్టీ నాల్గవ కాంగ్రెస్

### పాల్ఘాట్ (కేరళ) 1956

1956 ఏప్రిల్ 19–29 తేదీల్లో పాల్ఘాట్‌లో జరిగిన సిపిఐ నాల్గవ కాంగ్రెస్, పార్టీ రాజకీయ— భావజాల చరిత్రలో గుణాత్మక మలుపు తెచ్చింది. బిటిఆర్ హయాంలో పార్టీకి తగిలిన తీవ్రమైన దెబ్బ నుండి కోలుకుని ప్రధానస్రవంతి రాజకీయాల్లోకి పార్టీ రావటానికి అది సహాయపడింది. పార్టీ సభ్యత్వం 1,05,000లకు పెరిగింది. వారికి ప్రతినిధులుగా 407 మంది పాల్గొన్నారు. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టుపార్టీ చరిత్రలో కొత్త మలుపు తెచ్చిన చరిత్రాత్మక 20వ కాంగ్రెస్ నేపథ్యం కూడా పాల్ఘాట్ మహాసభ చర్చలపై, వ్యూహాత్మక విధానాల నిర్ణయంపై ప్రభావం చూపింది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ప్రధాని, సిపిఎస్‌యు ప్రధాన కార్యదర్శి జోసఫ్ స్టాలిన్ పార్టీలోపల సాగించిన అత్యాచారాలను, వ్యక్తి ఆరాధన ధోరణులను సిపిఎస్‌యు మహాసభలో నికితా కృశ్చేవ్ బహిర్గతం చేశారు. ఆయన నివేదికను ఆ మహాసభ ఆమోదించింది; ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని ప్రభావితం చేసిన ఆ వైఖరితో సిపిఐ పూర్తిగా ఏకీభవించలేదు, నాయకత్వంలో తీవ్రమైన భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి.స్టాలిన్ వ్యక్తిపూజను పాల్ఘాట్ మహాసభ విమర్శిస్తూనే, ఆయన పాత్రను తులనాత్మకంగా అంచనా వేయాలని కోరింది.

పాల్ఘాట్ మహాసభలో అజయ్‌ఘోష్ జాతీయ, అంతర్జాతీయ పరిస్థితి ని, నూతన కర్తవ్యాలను, సిపిఎస్‌యు 20వ కాంగ్రెస్ నిర్ణయాలను వివరిస్తూ నివేదిక సమర్పించారు. నూతన ప్రపంచ వాస్తవికతలను నొక్కి చెబుతూ, పార్టీ వ్యూహం, ఎత్తుగడల్లో మార్పు అవసరాన్ని విశ్లేషించారు. పార్లమెంటరీ సంస్థల పాత్రను, శాంతియుత పరివర్తన అవకాశాలను వక్కాణించారు.

**భాష ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు** పాల్ఘాట్ మహాసభ సానుకూలత తెలియజేసింది. ప్రజాస్వామ్య సంఘటన కాంగ్రెస్ వ్యతిరేక సంఘటనగా ఉండబోదని రాజకీయ తీర్మానం స్పష్టం చేసింది. ''భారతదేశసమాజంలో ప్రాథమిక సంఘర్షణ ఒకవైపున సామ్రాజ్యవాదం, ఫ్యూడలిజం మధ్యన, మరోవైపున సామ్రాజ్యవాదం, జాతీయ బూర్జువావర్గంతోపాటు యావత్ భారత్ ప్రజల మధ్యన సంఘర్షణ'' అని తీర్మానం పేర్కొన్నది. మితవాద శక్తులకు ఎట్టి రాయితీలు ఇచ్చే ప్రశ్నేలేదని స్పష్టం చేసింది.

అజయ్ ఘోష్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా తిరిగి ఎన్నుకోబడినారు.

**పోలిట్‌బ్యూరో సభ్యులు :** 1.అజయ్ ఘోష్, 2. ఇఎంఎస్, 3.రామమూర్తి, 4.సి.రాజేశ్వరరావు, 5. హర్‌కిషన్ సింగ్ సూర్జిత్, 6. భూపేష్ గుప్తా, 7. ఎస్.ఎ.డాంగే, 8. డాక్టర్ జడ్ఎ.అహ్మద్, 9. సుందరయ్య

**39 మంది సభ్యులతో కేంద్ర కమిటీ:**

1.అజయ్ ఘోష్, 2. ఇఎంఎస్, 3. ఎస్ఎ. డాంగే, 4. రామమూర్తి, 5. హెచ్.ఎస్. సూర్జిత్, 6.జ్యోతి బసు, 7. రణేన్ సేన్, 8. భూపేష్ గుప్త, 9. ముజఫర్ అహ్మద్, 10. భవాని సేన్, 11. సుందరయ్య, 12. సి.రాజేశ్వరరావు, 13.ఎం.బసవ పున్నయ్య, 14. ఎం.హనుమంతరావు, 15. రావి నారాయణరెడ్డి, 16. ఎల్లారెడ్డి, 17.వెంకటేశ్వర రావు, 18. ఎం.ఆర్.వెంకటరమణ, 19.ఎ.కె.గోపాలన్,20. కె.దామోదరన్, 21. అచ్యుత మీనన్, 22. ఎం.ఎన్.గోవిందన్ నాయర్, 23. ఎన్.ఎల్.ఉపాధ్యాయ, 24. జి.అధికారి,25. ఎస్.జి.సర్దేశాయి, 26.ఎస్ఎస్.యూసుఫ్, 27. పి.సి.జోషి, 28. వై.డి.శర్మ, 29. ఫణి బోర 30. దశరథ్ దేవ్, 31. సోహన్ సింగ్ జోష్, 32. యోగిందర్ శర్మ, 33. గురుచరణ్ పట్నాయక్, 34. సుదామ్ దేశ్‌ముఖ్, 35. నండూరి ప్రసాదరావు, 36.రమేష్ చంద్ర, 37. బి.టి.రణదివె, 38. హెచ్.కె.వ్యాస్, 39. జడ్.ఎ.అహ్మద్, ఘాటె(సిసిసి).

## అజయ్‌ఘోష్ జీవిత సంగ్రహం

అజయ్ కుమార్ ఘోష్ 1909 ఫిబ్రవరి 20న మిహిజం (బెంగాల్)లో జన్మించారు. కాన్పూర్‌లో, అలహాబాద్‌లో చదువుకున్నారు. బిఎస్‌సి పాసైనారు. భగత్‌సింగ్, బటుకేశ్వర్ దత్, జితేంద్రనాథ్‌దాస్, సుఖదేవ్, రాజ్‌గురు, చంద్రశేఖర్ ఆజాద్, బిజయ్ కుమార్ సిన్హా తదితర విప్లవకారులతో పాటు ఆయన బ్రిటిష్ వ్యతిరేక టెర్రరిస్టు ఉద్యమంలో పాల్గొన్నారు. 1928లో భగత్‌సింగ్‌తో కలిసి హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ స్థాపించారు. 1929లో లాహోర్ కుట్రకేసులో నిందితుడిగా నిర్బంధించారు. రెండేళ్ల అనంతరం విడుదలైనా రు. 1933లో కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికైన అజయ్ ఘోష్ 1934 నుంచి 1937వరకు రహస్య జీవితం గడిపారు.



1938లో పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యునిగా ఎన్నికైనారు. 1939లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభంకాగానే అనేకమంది కమ్యూనిస్టు నాయకులతోపాటు ఘోష్‌ను అరెస్టు చేసి దియోలీ నిర్బంధ శిబిరంలో ఉంచారు. 1943 వరకు జైల్లో ఉన్నారు. క్షయవ్యాధి కారణంగా విడుదలైనారు. 1945లో పంజాబ్‌లో పార్టీ నిర్మాణం చేపట్టారు. 1948–50 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం పూనా జైల్లో బంధించింది. తెలంగాణ సాయుధ పోరాటం సమస్యపై 1950–51లో మాస్కోలో స్టాలిన్‌ను కలిసిన నలుగురిలో అజయ్ ఘోష్ ఒకరు. మిగతా సభ్యులు డాంగే, రాజేశ్వరరావు, బసవపున్నయ్య. 1951లో ఆయన సిపిఐ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనారు. తీవ్రమైన భిన్నాభిప్రాయాలను సమన్వయ పరుస్తూ పార్టీ ఐక్యత పరిరక్షణకు తీవ్రంగా కృషి చేశారు. 1956లో మాస్కోలో జరిగిన 64 దేశాల కమ్యూనిస్టు పార్టీల మహాసభకు సిపిఐ ప్రతినిధివర్గానికి ఆయన నాయకత్వం వహించారు. 1960 చివరలో మాస్కోలో 81దేశాల కమ్యూనిస్టుపార్టీల అంతర్జాతీయ మహాసభకు ముసాయిదా పత్రం రచనా సంఘంలో సభ్యులు. 1962 జనవరి 13వ తేదీన కన్నుమూసేవరకు పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు.

## పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకారం అందించాలి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : ఈనెల 10న తుది ఓటరు జాబితా, ఎంపిటిసి, జడ్పిటిసిల ఎన్నికల షెడ్యూల్లో భాగంగా సెప్టెంబర్ 10న ఓటర్ల తుది జాబితా స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీలో రాజకీయపార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. రాష్ట్ర ఎన్నికలసంఘం ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఎంపిటిసిలు, జడ్పిటిసిలవారిగా 1224 పోలింగ్ కేంద్రాల్లో ఫొటోలతోకూడిన ఓటరు జాబితాను సిద్ధం చేసి ఎంపిటిసిల పోలింగ్ కేంద్రాల వారిగా సోమవారం ప్రచురించడం జరిగిందని, ఎంపిటిసిలు, జడ్పిటిసిల పోలింగ్‌కేంద్రాలవారిగా ఓటర్లజాబితా తయారీతోపాటు అవసరమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకారం అందించాలని రాజకీయపార్టీల ప్రతినిధులను కోరారు. సోమవారం కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ సమావేశమందిరంలో వివిధరాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానికసంస్థల అదనపు కలెక్టర్ దేవసహాయంతోకలిసి ఎంపిటిసిల, జడ్పిటిసిల ఎన్నికల ఓటరు జాబితా షెడ్యూల్ అంశాలపై సమావేశం నిర్వహించారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/వెల్దండ : మండలపరిధిలోని కేస్లీతండా గ్రామపంచాయతీ పరిధిలోని తుమ్మలకుంటతండాకు చెందిన రామావత్‌పెంట్యకన్యా రూ.44వేలు, మిద్దెలతండాకుచెందిన రామావత్‌చరణ్ రూ.34వేల చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన చెక్కులను సోమవారం బాధిత కుటుంబసభ్యులకు బిఎంసి సభ్యులు శ్రీనివాస్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్‌లు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకోసం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి సాకారంతో మంజూరయ్యాయని తెలిపారు.

## రేపు తుది ఓటరు జాబితా




ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా: జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల తుది ఓటరు జాబితాను ఈనెల 10న వెలువరించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ ఎస్ శ్రీను తెలిపారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం అదనపు కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం అదేశాలకు అనుగుణంగా ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయడం జరిగిందని అన్నారు. ముసాయిదా జాబితా, పోలింగు కేంద్రాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన మీదట సెప్టెంబరు 10వ తుది జాబితా వెలువరిస్తామని సూచించారు. మండల స్థాయిలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కూడా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో డిఆర్డి మొగులప్ప, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు సలీం, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు సాయిబన్న, బిఆర్‌ఎస్ నాయకులు సుదర్శన్‌రెడ్డి, సిపిఎం నాయకులు వెంకట్రాంరెడ్డి, డిఎస్పి నాయకులు బొదిగెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యం పెంపునకు ఉపాధ్యాయులు కృషి



ప్రజాపక్షం/కృష్ణ: కృష్ణ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముదుమాలను ఫౌండేషన్ లీటరసీ అండ్ న్యూమరసీ ప్రోగ్రామ్ (ఎఫ్ఎల్ఎన్)లో భాగంగా గుడెబల్లూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గణేష్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానాన్ని అందించే ఒక ముఖ్యమైన లక్ష్యం అని, ముఖ్యంగా 3వ తరగతిలోపు పిల్లలకు దీనిని సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. పూర్తి స్థాయిలో ప్రతి విద్యార్థికి కనీస సామర్థ్యాలు పెంపొందించడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో పెంచుతున్న మొక్కలను పరిశీలించి అభినందించారు. ఎకో క్లబ్ ఆధ్వర్యంలో అలంకరణ మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారతి, రవి కుమార్, ఆస్మా నిషాత్, జ్యోతి, వాలంటీర్ శిరీష, సర్వీస్ పర్సన్స్ సోఫీ, శివమ్మ, మధ్యాహ్న భోజన సిబ్బంది, గ్రామ యువకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఆనంద్, హనుమంతు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



ప్రజాపక్షం/నర్వ: నర్వ మండలంలోని ఉందెకోడ్ , నాగిరెడ్డిపల్లి, పాతర్‌చెడ్ గ్రామాల నుండి బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీల నుండి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, మండల అధ్యక్షులు బీసం చెన్నయ్య, సాగర్ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర మంత్రి డా.వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో 100 మంది చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్వ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్య, సాగర్, ఉపాధ్యక్షుడు శరణప్ప, ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణరెడ్డి, జగన్మోహన్ రెడ్డి, పోలీసు చంద్రశేఖర్ రెడ్డి, జగదాబిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు అశోక్ గౌడ్, బి.ఉమాపతి, ఉండేకోడ్ గ్రామ అధ్యక్షుడు కొండప్ప, నాగప్ప, కాలప్ప, బుల్లక్ భగవంతు, ఉప్పర్ శ్రీను, జంగం రెడ్డిపల్లి రాజారెడ్డి, రవీందర్‌రెడ్డి, నాయకులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్వ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగిరెడ్డిపల్లి పాతర్‌చెడ్ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్య అష్టావధాన గోడపత్రిక విడుదల



ప్రజాపక్షం/ జడ్చర్ల : జడ్చర్ల పట్టణంలోని చంద్ర గార్డెన్ లో ఈనెల 10 న ఏర్పాటు చేయనున్న సాహిత్య అష్టావధాన గోడపత్రికను తెలంగాణ సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాల్మి శివకుమార్ విడుదల చేశారు. సోమవారం నాడు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి ఆయన మాట్లాడుతూ చంద్ర శేఖర్ ఎడ్యుకేసన్ సోసైటీ ఆధ్వర్యంలో కాళోజి నారాయణరావు జయంతి, తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా సాహిత్య అష్టావధాన కార్యక్రమం విద్యార్థులకు సాహితీ ప్రియులకు భాషాభిమానులకు ఉపయుక్తంగా ఉండునట్లు సెప్టెంబర్ 10న చంద్ర గార్డెన్‌లో ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం ఒకటి వరకు నిర్వహిస్తున్నాము. ఏనుగు. నరసింహారెడ్డి, అదనపు కలెక్టర్ మహబూబ్ నగర్ ముఖ్య అతిథులుగా విచ్చేయుచున్నారు. అవధాని చేపూరి శ్రీరామ్, హనుమకొండ వాస్తవ్యులు, కవివర్యులు వృచ్ఛకులుగా వ్యవహరిస్తారు. అనుసంధనకర్తగా కంది శంకరయ్య, వరంగల్ వాస్తవ్యులు విచ్చేయుచున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆత్మీయ మిత్రమండలి వారి సహకారంతో చంద్రశేఖర్, ఎడ్యుకేషన్ సొసైటీ , లైన్స్ క్లబ్ జడ్చర్ల వారి ఆధ్వర్యంలో కార్యక్రమ నిర్వహణ జరగబోతున్నది. దానికి సంబంధించిన కరపత్రములు విడుదల చేసాము. సంబంధిత ఫోటోలు, కరపత్రం మీకు పంపనగుచున్నది. ఈ కార్యక్రమంలో పాఠశాలలకు చెందిన 8,9,10 తరగతిలో విద్యార్థులను ఆహ్వానిస్తున్నాము. సంబంధిత ప్రధానోపాధ్యాయులను సహకరించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ॥ మహేశ్వర్ , అలంపల్లి మనోహర్, కరకల కృష్ణా రెడ్డి, మంచన పాండయ్య, రవీందర్, జనార్ధన్, మంచన విట్టలయ్య, బొట్ల విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తులోనూ సమన్వయంతో పనిచేయాలి

గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా ముగింపు...
రెవెన్యూ, పోలీస్, విద్యుత్, మున్సిపల్, ఆరోగ్య తదితర శాఖల సేవలకు అభినందనలు : మంత్రి వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం/మక్తల్ : ప్రజల సహకారంతో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించిన గణేష్ నిమజ్జనాలు భవిష్యత్తులోనూ ఇదే విధంగా సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచనలు మక్తల్ నియోజకవర్గంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ఎటువంటి ప్రక్రియ సంఘటనలు లేకుండా శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించబడిన సందర్భంలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, మున్సిపల్, ఆరోగ్య, పంచాయతీ తదితర శాఖల అధికారులు, సిబ్బందిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు అనేవి ప్రజల ఆధ్యాత్మికతకు ప్రతీక. ఇంత పెద్ద ఎత్తున జరిగే వేడుకలను సమన్వయం చేసి, ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు లేకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయడం ప్రతి శాఖ అధికారుల కృషికి నిదర్శనం అలాగే భవిష్యత్తులోనూ ప్రజల భద్రత, సౌకర్యాలు, దృష్టిలో ఉంచుకొని ఇదే విధంగా నమన్వయంతో పనిచేయాలని సూచించారు. గణేష్ మండప నిర్వాహకులు, స్థానిక ప్రజలు కూడా శాంతి, సహకార భావనతో ముందుకు రావడం పట్ల మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# మైక్రోబ్రూవరీల పేరుతో విచ్చలవిడి మద్యం అమ్మకాల అనుమతిని ఆపేయాలి



ఎన్ఎఫ్ఐడబ్ల్యు మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి కొండికంటి పద్మావతి

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ పట్టణంలోని సురవరం వెంకట్రాంరెడ్డి భవన్‌లో జిల్లా అధ్యక్షురాలు జీ.భార్గవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పట్టణం కార్పోరేషన్‌గా మారుతున్న సందర్భంలో జిల్లా ఎక్సైజ్ శాఖ కమిషనర్ ద్వారా మైక్రోబ్రూవరీల పేరుతో మద్యం అమ్మకాల అనుమతుల కోసం ప్రకటన వెలువడిన నేపథ్యంలో ఆ ప్రకటనపై తీవ్ర వ్యతిరేకతను తెలుపుతూ నిరసన వ్యక్తం చేశారు. తాగుడుకు బానిసలై ఇప్పటికే చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయి. భర్తలు తాగుబోతులుగా మారి బాధ్యతలు మరిచిపోతుంటే మహిళలు కష్టపడుతూ కూలి నాలి చేసి పిల్లల్ని సాకుతున్నారని ఏ పని చేతకాని మహిళలు పిల్లల్ని చంపేసి తాము చావడానికి సిద్ధపడుతున్నారు. దీనంతటికి కారణం ఈ విచ్చలవిడి మద్యం అమ్మకాలే. అంతేకాకుండా మరోవైపు యువత డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడి తల్లిదండ్రులు మాట వినడం లేదు. ఇప్పటిదాకా కేవలం వైన్ షాపులు మాత్రమే ఉండేది అక్కడికి వెళ్లాలంటే మహిళలు కానీ మైనర్లు కానీ భయపడే వాళ్లు ఇబ్బంది పడే వాళ్లు కానీ ఇలా టీస్టాల్ లాగా ఓపెన్ చేసి ఎక్కడికక్కడ బీర్లు తయారుచేసి అమ్మే సెంటర్లు పెడితే విద్యార్థి దశ నుండే తాగుడుకు బానిస అవుతారు. వెయ్యి గజాల స్థలం ఉంటే ఆధార్ కార్డు లక్ష రూపాయల చలానా తీసుకుని వస్తే పరిమిషన్ ఇస్తామని అంటున్నారు. ఓవైపు అన్నదాతలు ఎరువులు యూరియా అందక రోడ్డున పడి ఏడుస్తున్నారు. అదే యూరియా కంపెనీలు ఎక్కడ పడితే అక్కడ పెట్టొచ్చు కదా. మద్యం పేరుతో మరో దోపిడి వ్యవస్థకు శ్రీకారం చుడుతున్న ఎక్సైజ్ శాఖ కమిషనర్ వెంటనే ఈ ప్రకటనని వెనక్కి తీసుకోవాలని డిమాండు చేస్తున్నాం. లేదంటే ఎలాంటి ఆందోళన కార్యక్రమానికైనా వెనకాడబోమని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో యన్ఎఫ్ఐడబ్ల్యు పట్టణ కార్యదర్శి బి.ఇందిర, మహేశ్వరి, సత్యమ్మ, కారూరి అంజమ్మ, మాధవి, పూజ పాల్గొన్నారు.

# ఫిర్యాదులు పెండింగులో పెట్టొద్దు

ప్రజావాణికి 156 ఫిర్యాదులు



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 156 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ డా.ఏనుగు నరసింహ,లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగులో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిసిఈఓ వెంకటరెడ్డి, డిఆర్‌డిఓ నర్సింహులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**మహిళా నిరక్షరాస్యులను అక్షరాస్యులు చేసేందుకు ఉల్లాస్**

ఉల్లాస్ కార్యక్రమం ద్వారా మహిళా సంఘాల్లో నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులు చేయనున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తెలిపారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం ప్రాముఖ్యతను వయోజన విద్యాశాఖ ఉపసంచాలకులు ఏ.శ్రీనివాస్ రెడ్డి, తెలిపారు. వయోజన విద్యాశాఖ రాష్ట్ర సంచాలకుల ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లాలో 64467 మహిళా నిరక్షరాస్యులను తీసుకుని గౌరవ అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ ఆదేశాల మేరకు మెప్మా ఆధ్వర్యంలో అన్ని కలిపి 15000 మహిళా నిరాక్షరాస్యులను తీసుకుని మొత్తము 79,467 మందిని మహిళా నిరాక్షరాస్యులను ఈ విడతలో అక్షరాస్యులుగా మార్చుటకు గాను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేస్తూ, వాలంటీర్లను గుర్తించి ఒక్కొక్క వాలంటీరు పదిమందికి చదువు నేర్పాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లా స్థాయిలో మండల స్థాయిలో వాలంటీర్లకు, నిరక్షరాస్యులకు ఏవిధంగా చదువు చెప్పాలని వారికి శిక్షణ నిచ్చినట్లు తెలిపారు. తదుపరి వారు గ్రామ స్థాయిలో ఎంపిక చేయబడిన వాలంటీర్లకు సెప్టెంబరు 12 నుండి శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అక్షరాస్యతను పెంచడమే ప్రాముఖ్యతగా తీసుకున్నారు.

# చట్ట ప్రకారం ఫిర్యాదులు పరిష్కరించాలి



జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

ప్రజాపక్షం/నారాయణపేట్/నారాయణపేట జిల్లా: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ యోగేష్ గౌతమ్ బాధితుల నుండి 12 ఫిర్యాదులను స్వీకరించి వాటిని చట్టప్రకారం పరిశీలించవలసిందిగా సిఐ, ఎస్సైలకు సూచించారు. భూతగాదాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న పోలీసు రెవెన్యూ అధికారులు సమన్వయంతో ఫిర్యాదులను పరిష్కరించాలని లేదా సామరస్యంగా మాట్లాడుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని, ఎలాంటి ఆవేశాలకు లోనుకారదు అని ఫిర్యాదుదారులకు ఎస్పీ సూచించారు. బాధితులు తీసుకువచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచరాదని వాటిని వెంటనే చట్ట ప్రకారం పరిష్కరించాలని ఫోన్లో మాట్లాడి సంబంధిత అధికారులకు తెలిపారు. 07 ఫిర్యాదులు భూ తగదాలకు సంబంధించినవి రాగా, 03 ఫిర్యాదులు ఆస్తి తగాదాలకు సంబంధించి, 02 ఫిర్యాదులు ఫ్యామిలీ గొడవలకు సంబంధించి రావడం జరిగింది. పోలీస్‌స్టేషన్‌కు, ఇతర కార్యాలయాలకు వెళ్లే ఫిర్యాదుదారులు మధ్యవర్తులను తీసుకెళ్లరాదని స్వయంగా వెళ్లి సమస్యను ఫిర్యాదు ఇచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

**ఘనంగా మిలాద్-ఉన్-నబీ ర్యాలీ**

నారాయణపేట జిల్లా కేంద్రంలో మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ఘనంగా నిర్వహించడం జరిగింది. ర్యాలీలో మెయిన్ చౌక్ దగ్గర జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ పాల్గొని ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మిలాద్‌ఉన్‌నబీ పండుగ శాంతి సౌభ్రాతృత్వానికి ప్రతీక అని అందరూ ఐక్యత స్నేహభావంతో జీవించాలని సూచించారు. నారాయణపేట జిల్లాలో ఈనెల 5వ తేదిన మిలాద్ ఉన్ నబీ పండుగ ఉన్నందున ముస్లింలు గొప్ప ఔదర్యాన్ని చాటుతూ తమ ర్యాలీని ఎనిమిదో తేదీ నాటికి వాయిదా వేయడం గొప్ప విషయమని అలాగే నారాయణపేట జిల్లా అంటే హిందూ ముస్లింలు భిన్నత్వంలో ఏకత్వంగా కలిసి ఉండి తమ ఐక్యత చాటాలని ఎస్పీ తెలిపారు. ర్యాలీలో అదనపు ఎస్పీ యం.డి. రియాజ్, హుల్ హక్, డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేశ్, సీఐ శివ శంకర్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాజు, నరేష్, సునీత, గాయత్రి, కృష్ణ, చైతన్య, పోలీసులు, హిందూ ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.




## రోజుకూలీ రూ.700 చెల్లించాలి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : జాతీయ ఉపాధిపథకం కార్మికులకు రోజువారి కూలీ రూ.700 చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోళ్ల యేసయ్య డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు, ఉపాధికూలీలు అనేక సమస్యలతో ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి సంవత్సరంలో 200రోజులు పనులు కల్పించి రోజువారి రూ.700 కూలీ ఇవ్వాలన్నారు. ప్రభుత్వస్థలంలో గుడిసెలు వేసుకున్నవారికి పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇల్లు మం జూరు చేయాలన్నారు. ప్రమాదవశాత్తూ మరణించిన కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లకు ఎస్సి, ఎస్టి కుటుంబాలకు రూ.6లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వేనేపల్లి రవీందర్, జిల్లా నాయకులు మద్దిలేటి వెంకటస్వామి, విష్ణు, చింతపల్లి కుర్మయ్య, ప్రకాష్, రాములు, అంజనమ్మ, రజిత పాల్గొన్నారు.

## రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని వినతి



ప్రజాపక్షం/వెల్దండ : మండల పరిధిలోని కొట్రగ్రామానికి నిర్మించిన బిటి రోడ్డు వాహనాల తాకిడికి అక్కడక్కడ రోడ్డు గుంతలుగా ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు గురవుతున్నారని, వెంటనే రోడ్డు పునర్‌నిర్మాణం చేపట్టాలని గ్రామ బిజెపి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా 2001 సంవత్సరంలో నిర్మించిన బిటిరోడ్డు నిర్మాణం చేపట్టి 2016 సంవత్సరంలో రెన్యువల్ చేశారని, రోడ్డు మొత్తం గుంతలమయంగామారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిలో పేర్కొన్నారు. 2022 రోడ్డు మరమ్మత్తు పనులకు ప్రొసిడింగ్ మంజూరుచేసి శంకుస్థాపనలుచేసి నేటికి పూర్తికాలేదన్నారు. ఇప్పటికైనా పనిపూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి మాజీమండల అధ్యక్షులు జూలూరు బాలస్వామి, బూత్ అధ్యక్షులు బలరాం, జంగయ్య, పరమేష్, మండలవైస్‌చైర్మన్ రాజు, గ్రామ నాయకులు దశరథంయాదవ్, బాలస్వామి, కృష్ణ, మండలసీనియర్ నాయకులు జంగయ్య పాల్గొన్నారు.

## ఘనంగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార అవార్డుల ప్రదానం



ప్రజాపక్షం/బిజినేపల్లి : మండలకేంద్రంలో సోమవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండల విద్యాశాఖ అధికారి రఘునందన్‌శర్మ ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులలో 23మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి పూలమాలలు, శాలువాలతో, మెమోంటో, ప్రశంసాపత్రాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండలంలోని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, వివిధ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన





ప్రజాపక్షం/కల్వకుర్తి : పట్టణంలోని జిల్లా ప్రజాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు హెచ్ఐవిపై అవగాహన కల్పిస్తూ నాలుగుమార్గాలద్వారా వస్తుందని తెలియజేశారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ఐసిటిసిసెంటర్ దగ్గర హెచ్ఐవి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ లింగయ్య, ఆర్‌డిఎస్ ప్రోగ్రాం మేనేజర్ శివయ్య, ఓఆర్‌డబ్ల్యుకె. రాజు, పిఇ శారద, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తహసీల్దార్లు సమయానికి విధులకు హాజరుకావాలి

కలెక్టర్ బదావత్‌సంతోష్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : రెవెన్యూ అధికారులు భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సోమవారం సాయంత్రం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశమందిరంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.అమరేందర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ ఆర్‌డిఓలతో 20 మండలాల తహసీల్దార్లతో భూభారతి, ప్రజావాణి అర్జీలు, ఇందిరమ్మ ఇండ్లకి ఇసుక సరాఫరా, మీసేవ సర్టిఫికెట్ల పెండింగ్‌పై పలురెవెన్యూ అంశాలపై కలెక్టర్ రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ తహసీల్దార్లు ప్రతిరోజు ఉదయం 10.30గంటలకు తప్పనిసరిగా అమలుచేయాలి, ఉద్యోగుల నెలవారి జీతాలు బయోమెట్రిక్ హాజరు వివరాల ఆధారంగానే విడుదల చేయబడతాయని తెలిపారు. అదనపు కలెక్టర్, ఆర్‌డిఓలు తాను జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాలకు ఎప్పుడైన ఆకస్మిక తనిఖీలు చేపడతామని ఈ తనిఖీల సందర్భంలో తహసీల్దార్లు , ఇతర సిబ్బంది విధుల్లో లేకుండా అనధికారికంగా గైర్హాజరు ఉన్నట్లు గుర్తిస్తేవారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమయానుసారంగా సేవలు అందించడానికి కలెక్టర్ స్పష్టంచేశారు. మండలాలవారిగా ప్రభుత్వ భూముల వివరాలను శుక్రవారం నాటికి కలెక్టర్ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో స్లాట్‌బుక్‌చేసిన లబ్దిదారులకు అదేరోజు రిజిస్ట్రేషన్ వ్యవహారాల్లో స్లాట్‌బుక్ చేసిన లబ్దిదారులకు అదేరోజు రిజిస్ట్రేషన్‌పూర్తిచేయాలని, తహసీల్దార్ అందుబాటులో లేకుంటే డిప్యూటి తహసీల్దార్‌ను ఇంచార్జీగా నియమించాలని ఆదేశించారు. కార్యాలయాల్లో రోజువారి రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఒక రిజిస్టర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈసమావేశంలో ఆర్‌డిఓలు జనార్ధన్‌రెడ్డి, బన్సిలాల్, సురేష్ బాబు, మాధవి, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, కలెక్టరేట్ విభాగాల సూపరిండెంట్లు రవికుమార్, వెంకట్, శోభ, తహసీల్దార్లు పాల్గొన్నారు.



**ఇవిఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్**

నాగర్‌కర్నూల్ పట్టణంలో ఉన్న ఇవిఎం గోడౌన్‌ను కలెక్టర్ బదావత్‌సంతోష్ సమగ్రంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆయనతోపాటు గుర్తింపుపొందిన రాజకీయపార్టీల ప్రతినిధులుకూడా హాజరయ్యారు. వారి సమక్షంలో ఇవిఎం గౌడౌన్ సీల్‌ను అధికారికంగా తెరిచి గోడౌన్‌లో ఎన్నికల సామాగ్రి పరిస్థితిని పరిశీలించారు. కలెక్టర్‌వెంట కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు రవికుమార్, గుర్తింపుపొందిన వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు, బిజెపి నాగేంద్రగౌడ్, బిఆర్‌ఎస్ వెంకటయ్య, వైఎస్సార్‌సిపి హుస్సేన్, బిఎస్‌పి రామకృష్ణ, సిపిఐ శివశంకర్, టిడిపి బాలకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

## కొరత లేకుండా యూరియా సరఫరా చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతులకు ఎలాంటి కొరత లేకుండా యూరియాను సరఫరా చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఖమ్మం మంత్రి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును సోమవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ నియోజకవర్గంలో యూరియా కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులను మంత్రికి వివరించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి రెండు, మూడు రోజుల్లో కావాల్సిన యూరియాను మిర్యాలగూడ నియోజకవర్గ రైతులకు ఎలాంటి సమస్య లేకుండా అందించాలని అధికారులను ఆదేశించారు.

## చౌటుప్పల్ ఆర్‌డిఒకు సిపిఐ వినతి



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చౌటుప్పల్ సిపిఐ మున్సిపల్ పార్టీ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో శేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ఇళ్ల నిర్మాణ బిల్లులు సకాలంలో చెల్లించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి, సర్వీస్ రోడ్ల పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పిల్లి శంకర్, కొండూరు వెంకటేష్, టంగుటూరి రాములు, ఉడుత రామలింగం, రొండి నరసింహ, అంజయ్య, సుదర్శన్, యాదయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధి హామీ పని దినాలు 200 రోజులకు పెంచాలి

### బికెఎంయు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

**ప్రజాపక్షం/చండూరు(గట్టుప్పల్):** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఎన్నికలు ఇచ్చిన హామీల అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గురి నరసింహ డిమాండ్ చేశారు.గట్టుప్పల్ మండల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో సిపిఐ మండల కార్యదర్శి బీవనపల్లి రమేష్,వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వల్ల పెంటయ్య,ఉపాధ్యక్షులు గూడెపు నరసింహ, మండల నాయకులు కందాల ముత్యాం,దేందే నరసింహ,రాపోలు సత్తయ్య, మాదగోని యాదయ్య, కట్ట ధర్మయ్య,అనిమల్ల శేఖర్,కట్ట చెన్నయ్య, కట్ట శేఖర్,కొల్లూరు లింగయ్య,బాలం లింగయ్య పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/మునుగోడు:** జాతీయ ఉపాధి హామీ పథకం 100 రోజుల నుండి 200 రోజుల వరకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు ఎండి జానీమియా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బికెఎంయు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మండల తాహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు.అనంతరం తాహసిల్దార్‌కు పలు డిమాండ్లతో కూడిన మెమోరండం అందజేశారు. ఈ ధర్నాలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురుజ రామచంద్రం,జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి,మండల కార్యదర్శి చాపల శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షకార్యదర్శి ఉప్పునూతలరమేష్,కాగితం వెంకన్న, మాజీ జెడ్పిటిసి గోసుకొండ లింగయ్య పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/డిండి :** వ్యవసాయ కార్మికులకు, ఉపాధి కూలీలకు సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టాన్ని కేంద్రం అమలు చేయాలని సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొల్లె శైలేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఎలిమినేటి హుస్సేన్ లు అన్నారు. సోమవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ మండల తహశీల్దార్ కార్యాలయంలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ శ్రీనివాస్‌గౌడ్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/దేవరకొండ :** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయూ రాష్ట్ర సమితి పిలుపు మేరకు వ్యవసాయ కార్మిక సంఘం దేవరకొండ మండల సమితి ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ మధుసూధన్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే 25లక్షల బీమా వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీను, భారీములు, అనిల్, బిక్షం, తిరుపతమ్మ, యాదమ్మ, సత్తయ్య, జావుద్దీన్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్తానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ అనుబంద సంఘమైన వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేసి మాట్లాడారు. కార్యక్రమంలో రామలింగం, పి.ఉదయ్‌కుమార్, బిల్లా కనకయ్య, ఎండి. సయ్యద్, వెంకన్న, లింగానాయక్, దుర్గమ్మ, పద్మ, డి.శాంతి, ఎస్‌కె.షమీ, జగన్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నల్లగొండ(నకిరేకల్):** వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర సమితి పిలుపు మేరకు నకిరేకల్ ఎండిఓ కు మెమోరాండం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులు పని కల్పించి రోజుకి 700 రూపాయలు చొప్పున కూలి ఇవ్వాలని, వ్యవసాయ కార్మికులకు వ్యవసాయ కూలి భరోసా పథకం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కొత్త పెన్షన్ ఇవ్వకుండా పాత పెన్షన్లు రెట్టింపు చేయకుండా ఆలస్యం చేయడం పేదలను మోసం చేయడం వారు పేర్కొన్నారు. ఇంటి స్థలం లేని పేదలకు ఇంటి స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పాల్వాయి విద్యాసాగర్, ఊట్కూరి రాజు ,సిపిఐ మండల కార్యదర్శి గౌని లక్ష్మి నరసయ్య, పల్లె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## ట్రిపుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతుల పక్షాన ప్రభుత్వంతో కొట్లాడుతాం

### ‘దివిస్’ భూములను కాపాడేందుకు అలైన్మెంట్‌లో మార్పు

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆరోపణ




**ప్రజాపక్షం/మునుగోడు:** ట్రిపుల్‌ఆర్ దక్షిణ భాగంలో చేపడుతున్న భూసేకరణలో దివిస్ కంపెనీ భూములను కాపాడే కుట్రలో భాగంగా పలుమార్లు అలైన్మెంట్లు మార్చారని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ఆరోపించారు. ట్రిపుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు అండగా నిలుస్తామని హామీఇచ్చారు. సోమవారం మునుగోడు సిపిఐ మండల కార్యాలయంలో జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అలైన్మెంట్లు మర్పు కారణంగా పచ్చని పంట పొలాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భూములు కోల్పోతున్న రైతుల పక్షాన ప్రభుత్వంతో కొట్లాడడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. పేద రైతులు భూమిని కొలిపోతున్న బాధ వర్ణనాతీతం బాధపడ్డారు. ట్రిబుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా 10 రెట్ల ధరను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరత తీర్చడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. తెలంగాణ కు రావలసిన యూరియాను సరైన సమయంలో అందించడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు.తెలంగాణ రైతాంగం పట్ల బిజెపి మంత్రులకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు.రైతులకు ఎలాంటి షరతులు లేకుండా యూరియాని అందించాలని డిమాండ్ చేశారు.

**10న నల్లగొండలో ‘సురవరం’ సంస్మరణ సభ**

నల్లగొండ పట్టణంలోని జివిఎల్ గార్డెన్ లో ఈనెల 10న సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి,నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ లో పార్టీ కార్యకర్తలు,సానుభూతిపరులు,మేధావులు పెద్ద ఎత్తున పాల్గొలని సిపిఐ జిల్లా కార్యదర్శి,ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం కోరారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను ఈనెల 11 నుండి 17 వరకు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఈ సందర్భంగా కోరారు. ఆనాటి నిజాం నిరంకుశ వెట్టిచాకిరి విముక్తి కొరకు దున్నేవాడికే భూమి దక్కాలని తలంపుతూ సాగిన సాయుధ పోరాటంలో అమరుల త్యాగాలను స్మరించుకొనుటకు కమ్యూనిస్టు కార్యకర్తలు సిద్ధం కావాలని అన్నారు.ఈ సమావేశానికి మండల కార్యవర్గ సభ్యులు ఉప్పునూతల రమేష్ అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురజా రామచంద్రం, తీర్పారి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి చాపల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, బి.లాలు,మండల కార్యవర్గ సభ్యులు గోసుకొండ లింగయ్య,మందుల పాండు, బండమీది యాద య్య, వనం వవెంకన్న,ఈధుల కంటి కైలాస్, దుబ్బ వెంకన్న,కాగితం వెంకన్న,మాదగొని సత్తమ్మ, మునుగోటి దయాకర్,బండారు శంకర్, రమేష్, ఆంజనేయులు, శంకర్, వెంకన్న, కృష్ణయ్య,ముత్తయ్య పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజావాణి ఫిర్యాదులను జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ వివిధ అంశాలను సమీక్షిస్తూ పెండింగ్‌లో ఉన్న శాఖల అధికారులు పెండింగ్ ఫిర్యాదులపై దృష్టి సారించి తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాగా ఈ సోమవారం 63 ఫిర్యాదులు వచ్చాయని వీటిన్నింటిని సంబంధిత శాఖల అధికారులకు పంపడం జరిగిందని, జాగ్రత్తగా అన్నిటిని పరిశీలించి ఆలస్యం చేయకుండా వేగంగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్‌డిఓ వేణు మాధవ్, డిఆర్‌డిఓ అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఏఓ శ్రీధర్ రెడ్డి, డిసిఓ పద్మ, డిఇఓ అశోక్, డిఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, డిఎస్‌ఓ మోహన్‌బాబు, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

## బిజెపి అలసత్వంతోనే యూరియా సరఫరాలో నిర్లక్ష్యం

### రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలి

### తహసీల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ధర్నా




**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** రైతులకు సరిపడా యూరియాను వెంటనే సరఫరా చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భువనగిరి మండల సమితి ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. రైతులకు విరివిగా యూరియాను సరఫరా చేయాలని వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు కల్వర్టులు వెంటనే బాగు చేయాలని నినాదాలతో తహసిల్దార్ కార్యాలయం మారుమోగింది. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు సరిపడే యూరియాను అందించడంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అలసత్వం చేస్తున్నదని ఇప్పటికైనా స్పందించి వెంటనే రైతాంగానికి యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గత వారం రోజుల క్రితం కురిసిన వర్షాల వలన ముఖ్యంగా పత్తి వరి వాణిజ్య పంటలు నష్టం జరిగాయని వెంటనే సంబంధిత అధికారులు సర్వే చేసి రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. వర్షాల వలన రోడ్లు ముఖ్యంగా హనుమాపురం వెళ్లే రైల్వే బ్రిడ్జి పూర్తిగా దెబ్బతిన్నదని బస్వాపురం ఉసిరిలే వర్రె వాగుపై అలాగే నాగిరెడ్డిపల్లి ప్రధాన రహదారిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం ఎన్నికల డిప్యూటీ తాసిల్దార్ ప్రణయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. భువనగిరి జిల్లా సమితి నిర్ణయం మేరకు జిల్లాలోని అన్ని మండలాలలో ధర్నాలు జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎండి ఇమ్రాన్, సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మ య్య, సహాయ కార్యదర్శి ఉడుత రాఘవులు, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, నాయకులు చొప్పరి సత్తయ్య, ముదిగొండ ఠాగూర్, ఘనబోయిన వెంకటేష్, రాణా, నాగపురి యాదగిరి, కూరాకుల అబ్బులు ముదుగుల ఉప్పలయ్య, బండిరాళ్ల వెంకటేశం, భాగ్యమ్మ పాల్గొన్నారు.




## తండా ప్రజలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

### పాదయాత్రలో సిపిఐ నేతల డిమాండ్

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం నుండి మేళ్లచెరువు తండాకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఐ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. తండా నుండి పాదయాత్ర ప్రారంభించిన వెంటనే స్కూలుకు వెళ్లే విద్యార్థులు పాదయాత్రలో పాల్గొంటామని సిపిఐ నాయకుల వెంట నడిచారు. పూర్తిగా అద్వానంగా మారిన రోడ్డు వల్ల తమ గ్రామానికి బస్సుతో పాటు ఆటోలు కూడా రావడం లేదని ప్రతి రోజు ఐదు కిలోమీటర్ల నడిచి వెళ్లేందుకు ఇబ్బందులకు పడుతున్నామని చిన్నారులు తెలిపారు. ఈ పాదయాత్ర ను తహసిల్దార్ కార్యాలయం వరకు చేపట్టి సిపిఐ నాయకులు తహసిల్దారుకు వినతి పత్రం అందజేశారు. రోడ్డుతో పాటు అంగన్వాడి సెంటర్, మంచినీటి సౌకర్యం కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. మేళ్లచెరువు తండాకు రోడ్డు సౌకర్యం కల్పించే వరకు తమ పోరాటాన్ని ఆపమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చన గోని గాలయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గిరిజన రైతుల భూ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తహసిల్దార్‌ను కోరారు. ఎన్నికల ముందు ఓట్ల కొరకు అమలు గాని హామీలు ఇచ్చి హామీలు నీటి మూటలుగానే మిగిలాయని తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కే శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, నాయకులు పొట్ట శంకరయ్య, పట్టణ కార్యదర్శి పల్లె మల్లారెడ్డి, వీరమల్ల యాదయ్య, పందుల యాదగిరి, సింగపంగ మల్లయ్య, ఎర్రోళ్ల లింగయ్య, దుబ్బాక సంజీవ, గాలయ్య, యాదగిరి, తండ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్రం ఉపాధి హామీ పథకానికి రూ. 2.70లక్షల కోట్లు కేటాయించాలి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సమగ్ర కేంద్ర వ్యవసాయ కార్మిక చట్టాన్ని రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి రూ. 2లక్షల 70వేల కోట్లు కేటాయించి సంవత్సరంలో 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.700 కూలీ ఇవ్వాలని, ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు విస్తరింప చేయాలని, పని ప్రదేశాల్లో కనీస మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, బడు గు, బలహీన వర్గాలపైన, మహిళలపైన దాడులు అరికట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయబరోసా పథకాన్ని వెంటనే అమలు జరిపి వ్యవసాయ కార్మికుల కుటుంబాలకు రూ.12 వేల ఆర్థిక సహాయం తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. వ్యకాసం జిల్లా అధ్యక్షుడు రెమిడాల రాజు మాట్లాడుతూ సామాజిక పెన్షన్లు రూ.4వేలకు అలాగే వికలాంగుల పెన్షన్ రూ.6వేలకు పెంచాలని, అర్హత కలిగిన వారందరికి పెన్షన్లు మంజూరి చేయాలన్నారు. 50 సంవత్సరాలు పైబడిన వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.6వేల పెన్షన్ అందించాలని, పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన వ్యవసాయ కార్మికులకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి రావుల సత్యం, నాయకులు నీలం నాగభద్రం, పిల్లి శ్రీనివాస్, కొమ్రరాజు వెంకట్, మాతంగి సైదులు, మొల్గూరి కోటయ్య, గుండు ధనమ్మ, జయసుధ, సాయి, వెంకన్న పాల్గొన్నారు.

## రూరల్ సర్కిల్ కార్యాలయం తనిఖీ

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** పోలీసు కార్యాలయాల తనిఖీలలో భాగంగా సోమవారం జిల్లా ఎస్‌పి కె నరసింహ సూర్యాపేట రూరల్ పోలీస్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డ్సును పరిశీలించారు. పోలీసు స్టేషన్ల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని సర్కిల్ అధికారిని ఆదేశించారు. కార్యాలయం నందు రికార్డులను మంచిగా నిర్వహించాలని పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు నమోదు పక్కాగా ఉండాలని సూచించారు. అధికారులు పర్యవేక్షణ పటిష్టంగా ఉన్నప్పుడే కింది స్థాయిలో ప్రజలకు విలువైన సేవలు అందుతాయని, సిబ్బంది పటిష్టంగా పనిచేస్తే కేసుల పెండెన్సీ తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, సూర్యాపేట రూరల్ ఎస్‌ఐ బాలు, ఆత్మకూర్ ఎస్‌ఐ శ్రీకాంత్, చివ్వెంల ఎస్‌ఐ మహేశ్వర్, పెన్‌పహాడ్ ఎస్‌ఐ గోపికృష్ణ, డిసిఆర్‌బి ఎస్‌ఐ యాకూబ్ పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ వర్క్‌తో పని ఒత్తిడి ఎదుర్కొంటున్నాం

### కలెక్టరేట్ ముందు ఎఎన్ఎంల ధర్నా

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నేషనల్ హెల్త్ మిషన్ నందు ఎఎన్ఎంలుగా పనిచేస్తున్న వారికి ఆన్‌లైన్ యాప్ వల్ల తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని తక్షణమే వాటిని రద్దు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి మెమోరాండం సమర్పించారు. ధర్నాను ఉద్దేశించి దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ వాస్తవానికి గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవటానికి, అంటువ్యాధులు ప్రబలకుండా కావలసిన జాగ్రత్తలు తీసుకోవడానికి, ఆరోగ్యం మెరుగు పడటానికి కావలసిన ముందస్తు జాగ్రత్తలతో పాటు అవగాహన కల్పించడానికి, చిన్నపిల్లలకు టీకాలు వేయడానికి ఏఎన్‌ఏంలుగా ఉద్యోగంలోకి తీసుకున్నారనీ, మారుతున్న పరిస్థితుల రీత్యా గత కొంతకాలంగా చేసిన పనులకు సంబంధించిన కొన్ని రిపోర్టులను ఆన్‌లైన్ ద్వారా పంపించాలని 2016వ సంవత్సరంలో తెలియజేశారు. ఒకటి రెండు యాపులతో ప్రారంభమైన ఆన్లైన్ పనులు ప్రస్తుతం దాదాపు 14 మొబైల్ అప్లికేషన్స్‌లను పూర్తి చేయాల్సి వస్తుంది. ఆన్‌లైన్ వర్క్స్ నుండి మినహాయింపు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కేఎస్ రెడ్డి,డివిజన్ కార్యదర్శి విశ్వనాధులు లెనిన్, ఏఎన్‌ఏం14ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ గీతారాణి,కోశాధికారి ఎస్ పద్మ, సరిత, భవాని, శారద,ఎస్ రేణుక,నాగమణి,సిహెచ్ సరిత,హైమావతి,బిహరిత,ఎం నిర్మల, శిల్ప,మాధురి,అనిత పాల్గొన్నారు.



## ముసాయిదా ఓటర్ జాబితా, పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రానున్న జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల దృష్ట్యా ముసాయిదా ఓటర్ జాబితా, పోలింగ్ స్టేషన్లపై ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ రాజకీయ పార్టీ ప్రతినిధులతో కోరారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం సూచన మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో ముసాయిదా ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాల ప్రచురణ, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 6వ తేదీన జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గం, మండల పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాలకు చెందిన ముసాయిదా ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రాదేశిక నియోజక వర్గాల వారీగా ప్రచురించడం జరిగిందని, జిల్లాలో 23 జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాలు, 235 మండల పరిషత్ ప్రాదేశిక నియోజక వర్గాలలో మొత్తం 6,94,815 మంది ఓటర్లు ఉన్నారని, 1272 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ విషయంలో సెప్టెంబర్ 8న జిల్లా స్థాయిలో, మండల స్థాయిలో రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహించడం జరుగుతుందని, సెప్టెంబర్ 8 సాయంత్రం లోపు ఓటర్ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా ఎంపిడిఓలకి తెలియజేయాలని, సెప్టెంబర్ 9న అభ్యంతరాలు, రాజకీయ పార్టీల సూచనలు పరిష్కరించడం జరుగుతుందని, సెప్టెంబర్ 10న తుది ఓటర్ జాబితాను పబ్లిష్ చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జడ్‌పి సిఇఓ అప్పారావు, డిపిఓ యాదగిరి, జడ్‌పి డిప్యూటి సీఈఓ శిరీష, డిఎల్‌పిఓ నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుండి రాజేశ్వరరావు, బిజెపి నుండి నర్సింహ, హబీద్, సిపిఎం నుండి గోపి, బిఆర్ఎస్ నుండి బిక్షం, వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, సత్యనారాయణ, సిపిఐ నుండి బెజవాడ వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, వైఎస్‌ఆర్‌సిపి నుండి రమేష్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నుండి దేవిడ్ కుమార్, సైదులు, ప్రజావాణి నుండి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# క్రీడ

## ప్లేయర్ ఆఫ్ ది మంత్‌గా సిరాజ్ నామినేట్

టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ ఐసీసీ ప్లేయర్ అవార్డుకు నామినేట్ అయ్యాడు. ఇంగ్లాండ్ పర్యటనలో సిరాజ్ తన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఐదవ టెస్ట్‌లో తన అద్భుతమైన బౌలింగ్‌తో భారత్‌ని గెలిపించాడు. ఈ మ్యాచ్‌లో గెలుపుతో టీమిండియా ఐదు మ్యాచుల సిరీస్‌ను 2–2తో సమం చేసింది. సిరాజ్‌తో పాటు, న్యూజిలాండ్‌కు చెందిన మాట్ హెన్రీ, వెస్టిండీస్‌కు చెందిన జాడెన్ సీల్స్ ఆగస్టు నెల ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డు రేసులో ఉన్నారు. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లు ఆడిన సిరాజ్ 23 వికెట్లు పడగొట్టాడు. జూన్ చివరలో ప్రారంభమైన ఈ సిరీస్ ఆగస్టు ప్రారంభంలో ముగిసింది. ఐదు టెస్టుల్లో సిరాజ్ 185.3 ఓవర్లు బౌలింగ్ చేశాడు. సిరీస్‌ను 2–2తో సమం చేయడంలో కీలకపాత్ర పోషించాడు. ఆగస్టులో సిరాజ్ ఒకే ఒక మ్యాచ్ ఆడాడు, కానీ ఆ మ్యాచ్‌లో అద్భుతమైన బౌలింగ్ నామినేషన్ పొందేందుకు సరిపోయేంతట ఐసీసీ పేర్కొంది. అండర్సన్‌టెండూల్కర్ ట్రోఫీ సిరీస్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో ది ఓవల్‌లో జరిగిన చివరి టెస్ట్‌లో హైదరాబాదీ బౌలర్ 21.11 సగటుతో తొమ్మిది వికెట్లు పడగొట్టి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. జస్‌ప్రీత్ బుమ్రా గైర్హాజరీలో.. టీమిండియా బౌలింగ్‌కు నాయకత్వం వహించాడు. సిరీస్‌లోని మొదటి నాలుగు మ్యాచ్‌లు ఆడినప్పటికీ.. ఐదో టెస్ట్ రెండు ఇన్నింగ్స్‌లో 46 ఓవర్లకు పైగా బౌలింగ్ చేశాడు. మొదటి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు పడగొట్టాడు. రెండవ ఇన్నింగ్స్‌లో అద్భుతమైన ఐదు వికెట్లు తీసుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో నిర్ణయాత్మక స్పెల్ భారత్‌ను విజయం వైపు నడిపించింది. సిరీస్‌ను 2–2తో ముగించింది. ఈ అద్భుతమైన ప్రయత్నానికి సిరాజ్ ఈ మ్యాచ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఇదిలా ఉండగా.. జింబాబ్వేలో టెస్ట్ సిరీస్ విజయంలో అత్యుత్తమ ప్రదర్శనకు న్యూజిలాండ్‌కు చెందిన హెన్రీ అవార్డుకు నామినేట్ అయ్యాడు. ఈ సిరీస్‌లో కుడిచేతి వాటం బౌలర్ 16 వికెట్లు పడగొట్టాడు. హెన్రీ మొదటి టెస్ట్‌లో తొమ్మిది వికెట్లు, రెండవ టెస్ట్‌లో ఏడు వికెట్లు తీసి తన జట్టు 2–0తో గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. సీల్స్ అద్భుతమైన ప్రదర్శన వెస్టిండీస్ 34 సంవత్సరాల తర్వాత వారి తొలి వన్డే సిరీస్‌లో పాకిస్తాన్‌ను ఓడించడంలో సహాయపడింది. ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో సీల్స్ పది వికెట్లు పడగొట్టాడు. చివరి మ్యాచ్‌లో అతను 18 పరుగులకు ఆరు వికెట్లు తీశాడు. దాంతో పాకిస్తాన్ జట్టు 295 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 92 పరుగులకే పరిమితమైంది.

## అర్ష్‌దీప్ సింగ్‌కు ప్రాక్టీస్ లేకపోవడం అతిపెద్ద సవాలు

ప్రతిష్ఠాత్మకమైన ఆసియా కప్‌లో టీమ్ఇండియా తన మొదటి మ్యాచ్ సెప్టెంబర్ 10న యూఏఈతో ఆడనుంది. రెండో మ్యాచ్‌లో సెప్టెంబర్ 14న పాకిస్తాన్‌తో, మూడో మ్యాచ్‌లో సెప్టెంబర్ 19న ఒమన్‌తో తలపడనుంది. అయితే టీమ్ఇండియా స్క్వాడ్‌లో స్థానం దక్కించుకున్న

అర్ష్‌దీప్ సింగ్ ఆసియా కప్‌లో ఇబ్బంది పడే అవకాశముందని, టీమ్ ఇండియా మాజీ బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ అభిప్రాయపడ్డాడు. అతడికి తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లేకపోడమే దీనికి కారణమని విశ్లేషించాడు. అర్ష్‌దీప్ సింగ్.. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున పూర్తి సీజన్ ఆడాడు. ఇంగ్లాండ్ టూర్‌కు ఎంపికైన టీమ్ఇండియా స్క్వాడ్‌లో స్థానం దక్కించుకున్నప్పటికీ బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇంగ్లాండ్‌తో టీమ్ఇండియా అయిదు టెస్ట్ మ్యాచ్‌లు ఆడితే కనీసం ఒక్కదాంట్లోనూ అర్ష్‌దీప్ సింగ్ బరిలోకి దిగలేదు. ఇంగ్లాండ్ నుంచి భారత్‌కు తిరిగి వచ్చిన తర్వాత అతడు దులీప్ ట్రోఫీలో కేవలం ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడాడు. ఈ నేపథ్యంలో అర్ష్‌దీప్ సింగ్‌కు తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లేదని భరత్ అరుణ్ అభిప్రాయపడుతున్నాడు. 'అర్ష్‌దీప్ సింగ్ శక్తి, సామర్థ్యాల గురించి మనందరికీ తెలుసు. కానీ, అతడికి తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లేదు. ఎక్కువ మ్యాచ్‌లు ఆడితేనే ఆటగాళ్లు రిథమ్‌లోకి వస్తారు. నెట్స్, ప్రాక్టీస్ సెషన్స్‌లో ఎన్ని ఓవర్లు బౌలింగ్ చేసినా.. అది పెద్దగా లెక్కలోకి రాదు' అని భరత్ అరుణ్ ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించాడు. 'నా ఉద్దేశంలో మ్యాచుల్లో బౌలింగ్ చేయాలి. ప్రస్తుత పరిస్థితి నిజంగా అర్ష్‌దీప్ సింగ్‌కు ఓ పెను సవాలే. అతడు ఎంత త్వరగా తన రిథమ్‌లోకి వస్తాడనేదే ఇక్కడ ముఖ్యమైన అంశం. దీనికోసం కనీసం రెండు మ్యాచ్‌ల సమయమైనా పట్టొచ్చు' అని భరత్ అరుణ్ విశ్లేషించాడు. అర్ష్‌దీప్ ఇప్పటి వరకు 63 టీ20 మ్యాచుల్లో 99 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అతడు ఆసియా కప్‌లో మరో వికెట్ తీసుకుంటే.. వంద వికెట్ల క్లబ్‌లోకి చేరతాడు. అలాగే టీ20ల్లో ఈ ఘనత సాధించిన తొలి భారత బౌలర్‌గా నిలిచే అవకాశముంది.

# ఫోకస్ యువతరంగం

## సాంకేతిక నైపుణ్యాలకు యువత దూరం!

విద్యావ్యవస్థ రోజురోజుకూ అధ్వాన్నంగా మారుతున్న తరుణంలో సాంకేతిక నైపుణ్యాలకు యువత దూరమవుతున్నది. జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) 2020 ప్రకారం, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విద్యా పాఠ్యమాల్లో అమలవుతున్న ముఖ్యమైన మార్పులను గమనిస్తే, ఈ విషయం స్పష్టమవుతుంది. ఎన్ఇపి ప్రకారం ఆరో తరగతి నుంచి సాంకేతిక విద్యా కోర్సులను విద్యార్థులకు అందించాలి. వాటిలో ప్రధానంగా కృత్రిమ మేధస్సు (ఎఐ), డేటా సైన్స్, అధునాతన సాంకేతికతపై అవగాహన, రోబోటిక్స్, మెకాట్రానిక్స్ వంటి కోర్సులను ప్రవేశపెట్టాలి. తద్వారా 2025 నాటికి కనీసం 50 శాతం మంది విద్యార్థులను సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దాలన్నది ఎన్ఇపి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2024–25 విద్యా సంవత్సరం ముగిసింది. 2025–26 విద్యాసంవత్సరంలో దాదాపు సగం పూర్తయింది. పరిస్థితి ఇప్పటికీ, 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగానే ఉంది. నైపుణ్య ఆధారిత విద్య ఒక ప్రహసనంగానే మిగిలిపోయింది. ఇక బహుళ విద్యా విధానం కింద అంతర్విభాగాల మధ్య ప్రాజెక్ట్ ఆధారిత పద్ధతుల్లో శిక్షణ ఇవ్వాలి. ఇందులో వివిధ రకాల సమస్యలను ఆధునిక సాంకేతికత ఆధారంగా పరిష్కరించడం కీలకమైన అంశం. పరిశ్రమలతో పాఠ్యాంశాలను అనుసంధానం చేయాల్సిన అవసరం కూడా ఉందని ఎన్ఎపి గురించి వివరిస్తూ కేంద్రం ఘనంగా ప్రకటించింది. ఇందులో అప్రెంటిస్‌షిప్, పరిశ్రమల_భాగస్వామ్యం (ఉత్పత్తి, ఐటి, ఆరోగ్యం, ఆర్థికం, ఇ–కామర్స్) ద్వారా విద్యార్థులకు వివిధ కంపెనీలు లేదా సంస్థలు లేదా ఉత్పత్తి కేంద్రాలపై పూర్తి అవగాహన కల్పించాల్సి ఉంది. కానీ, ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని, ఈ పథకం అమలైన తర్వాత పాఠశాల విద్యను పూర్తి చేసుకొని, కళాశాల్లో చేరిన విద్యార్థుల పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. ఉపాధి కల్పన, వృత్తి నైపుణ్యం లక్ష్యాలుగా విద్యా విధానం ఉండాలని, అందుకే సంపూర్ణ ప్రక్షాళన అవసరం అంటూ ఊదరగొట్టిన మోదీ సర్కారు, అందుకు విరుద్ధంగా విద్యను తిరోగమన బాట పట్టించింది. సాంకేతిక రంగంలో చోటు చేసుకుంటున్న మార్పులు, వాటికి అనుగుణంగా మారాల్సిన నైపుణ్యాలు మన దేశంలో అభివృద్ధి చెందడం లేదు. విద్యా విధానం ఈ కోణంలో ఆలోచించడం లేదు. నిజానికి నైపుణ్య, సాంకేతిక విద్యలతో ఉపాధి అవకాశాలు, మానవ వనరుల నాణ్యత, ఉద్యోగ మేదో విలువ పెంచుతాయి. డిజిటల్, టెక్నాలజీ రంగాల్లో విద్యార్థులకు సమర్థమైన అవకాశాలు, సాంఘికఆర్థిక మార్పులకు దారితీసే మార్గాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ మార్పులతో విద్యార్థులు పరిశ్రమలకు సిద్ధంగా, దేశంలో నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా విద్యా విధానం ప్రస్తుతావసరం. అందుకే, నేటి విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు రావాలి.

## ఒక సలహా.. ఒక నిర్ణయం..

'ప్రపంచానికి మహమ్మద్ అలీని బాక్సింగ్ పరిచయం చేయలేదు... అలీయే ప్రపంచానికి బాక్సింగ్‌ను పరిచయం చేశాడు' అనడంలో అతిశయోక్తి ఎంతమాత్రం లేదు. అప్పటి వరకూ బాక్సింగ్ పట్ల పెద్దగా ఆసక్తిలేని దేశాల్లోనూ లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్న అలీ తనను తాను 'ది గ్రేటెస్ట్' అని ప్రకటించుకోవడంలో గర్వంకాదు.. అంతులేని ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది. బాక్సింగ్‌లో అత్యున్నత శిఖరాలకు చేర్చిన అతని ప్రయాణం చాలా యాదృచ్ఛికంగా జరిగింది. ఒక సలహా.. దానిని అంగీకరించాలన్న నిర్ణయం అతనిని బాక్సింగ్ రింగ్‌లో తిరుగులేని వీరుడిగా మలచింది. వివరాల్లోకి వెళితే, 1960లో అలీ (అప్పట్లో అతని పేరు కాసియస్ క్లే) వద్ద ఉన్న కొత్త సైకిల్‌ను ఎవరో దొంగిలించారు. దాని కోసం తీవ్రంగా గాలించిన అతను, ఒక చోట సైకిల్‌ను గుర్తించి, దానిని తిరిగి తీసుకుంటూ, 'ఒక్క దెబ్బతో మట్టికరిపిస్తాను జాగ్రత్త' అని హెచ్చరించాడు. ఒక 12 ఏళ్ల బాలుడు తనకంటే వయసులో, ఆకృతిలో ఎంతో పెద్దవాడిని ఆ విధంగా బెదిరించడాన్ని మార్టిన్ జో అనే పోలీస్ అధికారి గమనించాడు. ఆ పిల్లవాడిలో, స్వయంగా బాక్సింగ్ ట్రైనరైన అతనికి అపారమైన ధైర్యం... ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటాననే మొండితనం కనిపించాయి. 'ఒక్క దెబ్బతో చిత్తుచేయాలంటే, పోరాటంలో మెళకువలు తెలుసుకోవాలి' అని అలీకి సలహా ఇచ్చాడు. క్షణం కూడా ఆలోచించకుండా అతనితో వెళ్లి బాక్సింగ్ నేర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. తండ్రి బిల్‌బోర్డ్‌లపై పెయింటింగ్ వేసేవాడుకాగా, తల్లి గృహిణి. మధ్య తరగతి కుటుంబం. పెద్దగా సమస్యలు లేవు. చదువుకునే వయసు. అలీకి ఏ రకంగా చూసినా బాక్సింగ్ రింగ్‌లోకి దిగాల్సిన అవసరం లేదు. కానీ, మార్టిన్ జో సూచన అతనికి నచ్చింది. బాక్సింగ్ శిక్షణను తీసుకోవడం ప్రారంభించాడు. ఆ తర్వాత కాలంలో బాక్సింగ్‌కు పర్యాయపదంగా మారాడు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం, సమయానుకూల నిర్ణయాలు తీసుకోవడం యువతకు ఎంత కీలకమో ఈ ఘటన చెప్తుంది.

## రాలిన ఆకులతో పేపర్

రాలిపోయే ఆకులను పునరుత్పాదక ముడిసరుకుగా మార్చవచ్చన్న ఆలోచన రావడం, దానిని అమలు చేయడం, విజయం సాధించడం వలెంటైన్ ఫ్రెచా జీవితంలో చకచకా జరిగిపోయాయి. ఉక్రేన్‌కు చెందిన అతను పర్యావరణ పరిరక్షణ కోసం తపించేవాడు. పేపర్ తయారీ కోసం ఏటా లక్షలాది చెట్లను కొట్టివేస్తున్నరన్న వాస్తవం అతనిని కలచివేసింది. వృక్ష సంపదకు ఎలాంటి నష్టం లేకుండా రాలిన ఆకులను ఉపయోగించి పేపర్ తయారీ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేశాడు. ప్రయోగాలు జరిపాడు. ఈలోగా రష్యాతో యుద్ధం రావడంతో ఫ్రాన్స్‌కు వెళ్లాడు. అక్కడ తన ప్రయోగాలు కొనసాగించి, అనుకున్నది సాధించాడు. రాలిపోయిన ఆకులతో అతను తయారు చేసిన ప్రతి టన్ను పేపర్ గుజ్జు కనీసం 17 చెట్లను కాపాడుతున్నది. పర్యావరణ హితమైన ఈ పేపర్ తయారీకి తర్వాత, మిగిలిన వ్యర్థాన్ని పొలాల్లో ఎరువుగా కూడా ఉపయోగించుకోవచ్చు. ఈ రి'లీఫ్' పేపర్‌ను చెత్తగా మారినప్పుడు భూమిలో కలిసిపోతుంది. నేల సారాన్ని పెంచుతుంది. తద్వారా మొక్కల పెరుగుదలకు ఉపయోగపడుతుంది. 23 సంవత్సరాల్లో అపూర్వ విజయాన్ని సాధించిన ఫ్రెచా 'యూత్ ఐకాన్'గా ప్రశంసలకు అర్హుడు.

**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపచేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

# 'ఏఎన్ఎం'లపై పనిభారం తగ్గించాలి

**ఎన్‌సిడి ఇతర ఆన్‌లైన్ యాప్‌లను తక్షణమే రద్దు చేయాలి**

**రెండో ఎఎన్ఎంల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రామాంజనేయులు**

**కలెక్టరేట్ ఎదుట ధర్నాలు**

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఎఎన్ఎంలపై పని భారాన్ని మోపి వారి ప్రాణాలను హరించవద్దని తెలంగాణ రాష్ట్ర రెండవ ఎఎన్ఎంల సంఘం (ఎఐటియుసి) రాష్ట్ర గౌరవాధ్యక్షులు తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐటియుసి అనుబంధం నేషనల్ హెల్త్ మిషన్ ఎఎన్ఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర నమితి పిలుపు మేరకు సోమవారం వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఫస్ట్ ఎఎన్ఎం, సెకండ్ ఎఎన్ఎం, అవుట్ సోర్సింగ్ ఎఎన్ఎం, కాంట్రాక్ట్ ఎఎన్ఎంలు ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పేపర్‌లెస్ ప్రోగ్రామ్స్ అంటూ మొబైల్ అప్లికేషన్స్‌ను(యాప్స్) తీసుకువచ్చి ఉద్యోగులను నానా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. 32 రకాల మొబైల్ అప్లికేషన్స్ అప్‌లోడ్ చేయాలంటే సుమారు 16 గంటల సమయం పడుతుందన్నారు. ఒక వైపు ప్రజల ఆరోగ్యం గురించి సర్వేలు, స్క్రీనింగ్ చేస్తూనే మరోవైపు ఆన్‌లైన్‌లో పనులు చేయాలంటే ఎఎన్ఎంలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆన్‌లైన్ కార్యక్రమాల్లో సాంకేతిక లోపంతో జాప్యం జరిగినా అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ఎఎన్ఎంలపై పని ఒత్తిడి తగ్గించడం, వేధింపులు మానకపోతే ఎఐటియుసి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్, జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, కార్యనిర్వహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, ఫస్ట్ ఎఎన్ఎం నాయకులు కృష్ణకుమారి, నాగమణి, సరోజ, విజయలక్ష్మి, సరస్వతి, సీత, ముంతాజ్, జ్యోతి, రెండవ ఎఎన్ఎం సంఘం జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, శైలజ, హేమ, సుగుణ, మంగమ్మ, భవాని, నిర్మల, శోభ, స్వాతిరెడ్డి, అబేదా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

**మహబూబ్ నగర్:** నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఎఎన్ఎం ఉద్యోగులపై పని భారాన్ని పెంచుతున్న ఎన్సిడి, యుడబ్ల్యుఐఎన్, ఎంసిహెచ్ లాంటి ఆన్‌లైన్ యాప్‌లను తక్షణమే రద్దు చేయాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పి.సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎఐటియుసి అనుబంధం నేషనల్ హెల్త్ మిషన్ ఎఎన్ఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర నమితి పిలుపు మేరకు మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎఎన్ఎం ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు, డిఎంహెచ్ఒకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ఉద్యోగులు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయమ్మ నేతలు ఎఎన్ఎంలు నజ్మతులాల, లలిత, అంజమ్మ, పద్మజ, అన్నపూర్ణ, వెంకటేశ్వరమ్మ, గౌరీ, రేణుక, సునీత, విజయలక్ష్మి, కళావతి, సరిత, సుజాత, సుగుణ, పద్మావతి, మౌనిక, జానకమ్మ, సత్యమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

**సంగారెడ్డి :** ఎఐటియుసి అనుబంధం నేషనల్ హెల్త్ మిషన్ ఎఎన్ఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర నమితి పిలుపు మేరకు సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎంఏ రహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటరాజ, ఎఎన్ఎంల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోయిని ప్రసాద్ , ఎఎన్ఎంల సంఘం జిల్లా నాయకులు శ్యామల, శారద, రోజా, మేఘన, సునీత, పుష్పలత, స్వప్న, శ్రీలత, మీనా, తదితరులు పాల్గొన్నారు.

**ములుగు :** రెండవ ఎఎన్ఎంలకు పనిభారాన్ని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. సోమవారం సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎఐటియుసి ఆధ్వర్యంలో ములుగు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అంద జేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ముత్యాల రాజు, రెండవ ఎఎన్ఎంల అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు పి.సరోజన, ప్రధాన కార్యదర్శి కోడి సుజాత, ఆదిలక్ష్మి , రజిత, సూర్యకాంతం, సబిత, ఉమ, ఊర్మిళ, లక్ష్మి , పుణ్యవతి, సమ్మక్క, వెంకటరమణ, శకుంతల, రాజేశ్వరి, లలిత, కన్యాకుమారి పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ :** ఎన్‌సిడి ప్రోగ్రాంలో ఆన్లైన్ పనుల నుంచి ఎఎన్ఎంలను విముక్తి కల్పించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, ఉపాధ్యక్షుడు చిరంజీవి, ఎఎన్ఎం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సంతోషి, ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, కోశాధికారి సునీత, ప్రచార కార్యదర్శి ప్రమీలతో పాటు ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ఖమ్మం..

మంచిర్యాల..

సంగారెడ్డి...

మహబూబ్‌నగర్...

ములుగు...

# సాగులో ఉన్న ప్రతీ ఎకరాకూ పోడుపట్టాలు ఇవ్వాలి

**సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా డిమాండ్**

**బికెఎంయు, సిపిఐ కలెక్టరేట్ ముట్టడి**

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** పోడు సాగుచేసుకొని బుక్కెడన్నం తింటున్న గిరిజన, గిరిజనేతర పోడు సాగుదారులపై అటవీ శాఖ అధికారులు జరుపుతున్న దాడులు, దౌర్జన్యాలకు స్వస్తి చెప్పి, వారు స్వేచ్ఛగా సాగుచేసుకొనే వెసులుబాటు కల్పించాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, వలస ఆదివాసీలకు కుల ధృవీకరణ పాత్రలు అందించాలని డిమాండ్ చేస్తూ బికెఎంయు రాష్ట్ర శాఖ పిలుపులో భాగంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఐ భద్రాద్రి జిల్లా ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సాబీర్‌పాషా మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో పేదలు పోడుసాగు చేసుకొని పట్టెడు మెతుకులు తింటున్నారని, వీరి భూములు లాక్కొని మళ్లి అడవిలో దుంపలు తినే స్థితికి తీసుకురావద్దన్నారు. సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో కందకాలు తవ్వి, సాగులో ఉన్న పంటలను ధ్వంసం చేస్తూ, మొక్కలు నాటి బలవంతంగా భూములు లాక్కునే చర్యలు మానుకోవాలన్నారు. పోడు వ్యవసాయం గిరిజనుల హక్కని, ఈ హక్కును లాక్కునే చర్యలు మానుకొని అటవీ హక్కుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ద్వారా ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు అందుకున్న పోడు రైతుల భూములను సైతం లాక్కుంటూ అమాయక గిరిజనులను భయభ్రాంతులకు గిరి చేస్తున్నారని, ఈ విధానం సరైంది కాదన్నారు. ఉపాధి పథకాన్ని 200 రోజులకు పెంచి రోజుకు రూ.700ల కూలీ చెల్లించాలన్నారు. సమగ్ర కేంద్ర వ్యవసాయ కార్మిక చట్టాన్ని ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని, ఇండ్లు లేని పేదలకు పక్కా గృహాలు మంజూరు చేయాలనే కార్మికుల డిమాండ్ న్యాయమైందని తక్షణమే వాటి అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి దశాబ్దాల క్రితం ఈ జిల్లాకు వచ్చి స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకున్న ఆదివాసీలకు ఎస్టీ ధ్రువపత్రాలు మంజూరు చేసి, సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. అనంతరం సమస్యల వినతి పత్రాన్ని అధికారులకు అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వీసంశెట్టి పూర్ణచందర్ రావు, రేసు ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన సభ, ధర్నా కార్యక్రమంలో నాయకులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, నరాటి ప్రసాద్, ఎస్ డి సలీం, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, మువ్వా వెంకటేశ్వరరావు, బంధం నాగయ్య, ఎండి యూసుఫ్, పేరాల శ్రీనివాస్, అనంతనేని సురేష్, జి.రామకృష్ణ, సాప్క నాగేశ్వరరావు, సుంకిపాక ధర్మ, విజయ్, కొమరం హన్మంతరావు, బొర్రా కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ భరోసా రూ.12వేలు ఇవ్వాలి

**బికెఎంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్**

**ప్రజాపక్షం/కరీంనగర్ సిటీ :** సమగ్ర కేంద్ర వ్యవసాయ కార్మిక చట్టాన్ని అమలు చేయాలని బికెఎంయు రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బికెఎంయు రాష్ట్ర సమితి పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట దర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సృజన్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తోందన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ భరోసా పథకం కింద 12 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సామాజిక పెన్షన్ రూ.4 వేలు, దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలు, రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, నాయకులు గంటె రాజేశం, విలాసాగరం అంజయ్య, కూనరవి, చందు, ఐలయ్య, రాజేందర్, లచ్చవ్వ, కనుకవ్వ పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి
స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మార్పీ పెంట్రోల్ బంక్ ఎదురుగా నరేష్ అడ్వాన్స్‌డ్ న్యూరో హస్పటల్‌ను స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. డాక్టర్ యెన్నం నరేష్‌రెడ్డి వైద్యబృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు,స్నేహితులుక తదితరులు పాల్గొన్నారు.




## కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి అడుగు జాడలో వెళ్తాం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** నిస్వార్థ సేవలందించిన సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి కామ్రెడ్ సురవరం సుధాకరరెడ్డి అడుగు జాదల్లో ముందుకు వెళుతామని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బంగారి రాజయ్య అన్నారు.ఘట్‌కేసర్ మండలం కొర్రెముల ప్రాంతంలోని సుప్రభాత టౌన్‌షిప్‌లో సోమవారం సురవరం సుధాకరరెడ్డి సంస్మరణ సభ ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను విద్యార్థిగా ఏఐఎస్ఎఫ్‌లో పలు ప్రజా పోరాటాల్లో సురవరంతో స్వయంగా పాల్గొని స్ఫూర్తి పొందానన్నారు. కమ్యూనిస్టు భావజాలాలతో చిన్ననాటి నుండే ప్రజాసేవే ధ్యేయంగా కృషి చేయటమే తుది శ్వాస వరకు లక్ష్యంగా ఏర్పాటు చేసుకొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఆళవందార్ వేణు మాధవ్, మల్లయ్య, రాజనర్సు, ప్రతాప్‌సింగ్, వెంకటరెడ్డి, సత్యనారాయణ, సర్జిత్‌సింగ్, బాల్‌రెడ్డి, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదు
కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

**ప్రజాపక్షం /కూకట్‌పల్లి :** రోడ్డు పనుల నాణ్యతలో రాజీ పడే ప్రసక్తేలేదని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణరావు సహకారంతో మంజూరు చేయించిన రూ. 20లక్షల నిధులతో సోమవారం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని వాల్మికి నగర్‌లో రోడ్డు పనులను కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాలనీ వాసులకు ఇచ్చిన హామీ మేరకు మొదటగా డ్రైనేజీ పనులు, మంజీరా వాటర్ లైన్ పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ప్రజా అవసరాలకు అనుగునంగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని అన్నారు. ప్రజా సంక్షేమ తమ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి నాక్ ఇంజనీర్ మనోజ్, డివిజన్ పార్టీ అధ్యక్షులు కంచి బిక్షపతి, చందు, మల్లికార్జున్, ప్రవీణ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



## వికలాంగులకు పెన్షన్లు పెంచాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు వికలాంగులకు పెన్షనలను పెంచుతూ వెంటనే అందించాలని జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు వినయ్ ఆధ్వర్యంలో ఎంఆర్‌పిఎస్ సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద కొనసాగిన ధర్నాలో జిల్లా అధికారి రాంమోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్‌కు చెందిన లక్ష్మణ్, రాంచందర్, శివకుమార్,శేఖర్, బలనరసింహ, రామకృష్ణ, అంజి, శేఖర్, రాములక్ష్మి, శేషబానా, రజిగ, గోసమ్మ, శైలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## నాగిశెట్టిపల్లిలో తాంత్రిక షూటింగ్ ప్రారంభం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపాలిటి నాగిశెట్టిపల్లిలోని హరిహర దేవాలయంలో తాంత్రిక సినిమా షూటింగ్ సోమవారం అట్టహసంగా ప్రారంభ మైంది. తాంత్రిక సినిమా దర్శకుడు రాగిరి విష్ణువర్ధన్‌రెడ్డి క్లాప్ ఇవ్వడంతో మొదటి షూట్‌ను దేవాలయంలో చిత్రీకరించారు. ముందుగా ఆలయంలో దేవతమూర్తులకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం షూటింగ్‌ను ప్రారంబించారు. ఈ సందర్భంగా దర్శకుడు రాగిరి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విఎన్ క్రియేషన్స్ బ్యానర్‌పై అత్తపు నవీన్ సమర్పణలో రూపొందుతున్న కొత్త చిత్రం తాంత్రిక అట్టహసంగా ప్రారంబించామని చెప్పారు. ప్రేక్షకులను కట్టిపడేసి హర్రర్ సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో తాంత్రిక సినిమా రూపొందిస్తున్నామని, విభిన్నమైన ట్రిట్మెంట్‌తో ఈ సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబోతుందన్నారు. ఈ చిత్రంలో హిరోగా గణేష్‌రెడ్డి, హిరోయిన్‌లుగా మౌనిక, శ్రీవాణినాయుడు నటిస్తున్నారని అన్నారు. ప్రేక్షకులకు కొత్త రుచిని అందిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. టెక్నిషియన్‌ల విబాగంలో అరవింద్ బల్లెడ సినిమాటోగ్రఫి బాద్యతలు చేపడుతున్నారని చెప్పారు. సినిమా ఫస్ట్ షెడ్యుల్ పూర్తి చేసుకున్న వెంటనే యూనిట్ హైద్రాబాద్, అరకు ప్రాంతాల్లో తదుపరి షెడ్యుల్ ప్లాన్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత, నటి నటులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బోధనాభ్యాసన సామాగ్రి ప్రదర్శన

**ప్రజాపక్షం /దోమః** పరిగి నియోజకవర్గంలో దోమ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దోమ మండల స్థాయి టిఎల్ఎం భోదన సామాగ్రిని ప్రదర్శన కార్యక్రమం మండల విద్యాధికారి వెంకట్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రాథమికప్రాథమికున్నత పాఠశాలల ఉపాద్యాయులు పాల్గోన్నారు. తెలుగు ఇంగ్లీష్ ,గణితం ,పరిసరాల విజ్ఞానం కు సంబంధించిన తయారు చేసిన టిఎల్ఎం ను పాదర్శించారు. యంపిడిఓ గ్యామా పాల్గోని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాద్యాయులు అంజనేయులు , ఉపాద్యాయులు సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

# రోడ్లు, డ్రైనేజీ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు విఎస్ బోస్ డిమాండ్






**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఇటీవల కాలంలో నగర వ్యాప్తంగా కురిసిన వర్షాల కారణంగా ఉప్పల్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అనేక కాలనీలలో దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆధ్వర్యంలో ఈసీఐఎల్ లోని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి.జగన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్.బోస్ మాట్లాడుతూ, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కాప్రా సర్కిల్ లోని పలు కాలనీలు కుషాయిగూడ, జమ్మిగడ్డ,హెచ్ బీ కాలనీ, అశోక్ నగర్, మల్లాపూర్, మర్రిగూడా, నాచారం, బాబానగర్ తదితర కాలనీలలో పూర్తిగా రోడ్లు, అంతర్గత డ్రైనేజీలు, విద్యుత్ సమస్యలు ఉన్నాయని, త్వరితగతిన ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఆదే విధంగా చిన్నపాటి వర్షాలకే రోడ్లు పెచ్చులూడి అధ్వాన్న స్థితికి చేరాయని వీటికి ప్రధాన కారణం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం అని వారు ధ్వజమెత్తారు. రోడ్ల నిర్మాణం టెండర్ల ద్వారా పొంది, కనీసం ఐదు నుండి ఏడు సంవత్సరాలకు గ్యారెంటీగా ఉండాల్సిన రోడ్లు, పూర్తి స్థాయిలో నాణ్యత లేకుండా వేస్తున్నారని, ఇలా నిర్లక్ష్య పూరిత కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని సీపీఐ డిమాండ్ చేస్తున్నదన్నారు. విద్యుత్ స్తంభాలు కూడా కొన్ని ప్రాంతాల్లో పక్కకు ఒరిగాయని వీటిని కూడా యదాస్థితికి చేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.ధర్మేంద్ర, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్య ప్రసాద్, సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా, కృపాకర్, రజినీ, శ్రీనివాస్, యాకూబ్, బంగారయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.




**జవహర్‌నగర్‌లో:** ఇటీవలి భారీ వర్షాల కారణంగా దెబ్బ తిన్న రోడ్లు, డ్రైనేజి మరమ్మత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సిపిఐ జిల్లాకార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ డిమాండ్ చేసారు.సోమవారం సిపిఐ కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి ఆధ్వర్యంలో జవహర్‌నగర్ మన్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తోటపల్లి మాట్లాడుతూ వర్షాలతో ప్రధాన రహదార్లే కాకుండా బస్తీ రోడ్లలోనూ గుంతలు ఏర్పడి ప్రమాదభరితంగా తయారయ్యాయన్నారు. రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్ దశరథ్ మాట్లాడుతూ చెన్నాపురం నుండి వికలాంగుల కాలనీ వరకు వీధి దీపాలు వేసి పరిష్కరించాలన్నారు. ఈ ధర్నాలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నర్సింలు, గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.స్వరూప నాయక్, ఏఐటియుసి మండల అధ్యక్షుడు ఎల్లయ్య, మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు జయమ్మ, సిపిఐ నేతలు గంగారం రాజు, కురుమయ్య, రాజు నాయక్, అర్జున్, కృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



**మల్కాజిగిరిలో:** భారీ వర్షాల కారణంగా దెబ్బ తిన్న రోడ్లు, డ్రైనేజి మరమ్మత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సిపిఐ జిలా కౌన్సిల్ సభ్యులు సిహెచ్ దశరథ్ డిమాండ్ చేసారు.సోమవారం సిపిఐ మల్కాజిగిరి మండల సమితి ఆధ్వర్యంలో ఈ మేరకు జిహెచ్ఎంసి మల్కాజిగిరి డిప్యూటి కమిషనర్ జకియా సుల్తానాను కల్సి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ వర్షాలతో ప్రధాన రహదార్లే కాకుండా బస్తీ రోడ్లలోనూ గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందిగా మారి ప్రమాదాలకు దారి తీస్తున్నాయన్నారు. వినాయకనగర్ డివిజన్‌లోని దీనదయాల్ నగర్, టెలికాం కాలనీ, రేణుకానగర్, మధురానగర్, కాకతీయనగర్‌లతో పాటు నేరేడ్‌మెట్ గౌతంనగర్ డివిజన్లలో పలు ప్రాంతాల రహదార్లు దెబ్బ తిన్యాన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మల్కాజిగిరి మండల కార్యదర్శి యాదయ్య గౌడ్, కాసర్ల నాగరాజు, అశోక్, యాదగిరి, సత్యనారాయణ, లింగం, బాబు, నరేంద్రచారి, జంగయ్య, సదానంద్, కుమార్ తదితరులు పాల్గొన్నా రు.

**కుత్బుల్లాపూర్‌లో :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మేడ్చల్ జిల్లా పార్టీ పిలుపు మేరకు సోమవారం గాజుల రామారం సర్కిల్ మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కామ్రెడ్ ఏసురత్నంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల రోజుల నుంచి కురిసిన వర్షం వల్ల సర్కిల్లో ఉన్న రోడ్లు పాడైపోయాయని, అనేక చోట్ల గుంతలు ఏర్పడ్డాయని వాటివల్ల వాహనదారులు, ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అలాగే జగద్గిరిగుట్టలోని డంపింగ్ యార్డ్ సమస్య, రావి నారాయణరెడ్డి నగర్, ద్వారకా నగర్‌లో నాలాను నిర్మించి నాలా చుట్టూపక్కల ఉన్న గుంతలను పూడ్చకపోవడం వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలపై మున్సిపల్ అధికారులు స్పందించి పరిష్కరించకపోతే వచ్చే వారం సిపిఐ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కె.స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, ఎఐటియుసి కార్యదర్శి శ్రీనివాస్, శాఖాకార్యదర్శులు సదానంద్, సాయిలు, వీరస్వామి, సహదేవరెడ్డి, కె.ఇమామ్, ప్రభాకర్, శ్రీనివాస్‌చారి, జంబు, ఆశప్ప, రాజకుమార్, యాదగిరి, పూర్ణచందర్‌లు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించాలి

కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించిన సిపిఐ శామీర్‌పేట మండల కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** తూంకుంట మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ప్రజలకు కనీస మౌళిక వసతులు కల్పించాలని శామీర్‌పేట మండల సిపిఐ కార్యదర్శి డిజి నరేంద్రప్రసాద్ అన్నారు. సిపిఐ జిల్లా కమిటి ఇచ్చిన పిలుపు మేరకు సిపిఐ శామీర్‌పేట మండల కార్య దర్శి డిజి నరేంద్రప్రసాద్ సిపిఐ కార్యకర్తలతలో కలిసి తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు, వార్డుల వారీగా ఇంటి నెంబర్లను సమీక్షించి నెంబర్‌లు లేని వారికి కొత్తగా ఇంటి నెంబర్లు కేటాయించాలని అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గుంతలమయంగా మారాయని ఆ గుంతలతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున రోడ్లను మరమ్మత్తులు చేయాలని కోరారు. శామీర్‌పేట పెద్దమ్మ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజి వ్యవస్థ సరిగా లేదని భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని నూతనంగా డ్రైనేజి ఏర్పాటు చేయాలని చెప్పారు. డ్రైనేజిలు, మురికి కాలువలు మంచినీటి కుంటల్లో కలువకుండా చర్యలు తీసుకోవాలని, సీవేజ్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ల ద్వార నీటిని శుద్ది చేసి చెరువులు, కుంటలు కాలుష్యం కాకుండా చూడాలని అన్నారు. తూంకుంట పురపాలక సంఘంలోని చెరువులు, కుంటల ఎఫ్‌టిఎల్ ను గుర్తించి హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని, డ్రోన్ కెమరాల ద్వార వీడియోలు రికార్డులు చేసి ప్రభుత్వ చెరువులను, కుంటలను కాపాడాలని కోరామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పై డిమాండ్లకు కమిషనర్ జ్యోతి సానుకూలంగా స్పందించారని ఎగ్జిక్యూటివ్ అధికారులకు రిఫర్ చేశారని పేర్కొన్నారు. మున్సిపల్ వార్డుల్లో ఉండాల్సిన మౌళిక వసతులను ఏర్పాటుకు తగిన ప్రణాళికలు, కేటాయింపులు నిర్వాహణ వాటి ఆచరణకు త్వరితగతిన తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట సిపిఐ గ్రామ కార్యదర్శి సోగ్గాడ రమేష్, దొంతరబోయిన భూమయ్య, పెద్దమ్మ కాలనీ కార్యదర్శులు గౌరి, వసంత, మోహన్‌లు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో 86 అర్జీలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కింది స్థాయిలో పరిష్కారం కాకపోవటంతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో తమ అర్జీలు ఇస్తే మోక్షం లభిస్తుందన్న గంపెడాశతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సోమవారం 86 అర్జీలను ధరఖాస్తుదారులు అధికారులకు సమర్పించారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డిలతో కల్సి స్వీకరించిన అనంతరం వారితో పాటు ఉన్న వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులను అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించ లేని పక్షంలో దానికి కారణాలను సైతం ధరఖాస్తుదారులకు తెలియచేస్తూ




## రైతులకు సరిపడా యూరియా వచ్చేదెప్పుడు?
యూరియా కావలంటూ రైతులు ధర్నా

**ప్రజాపక్షం/బంట్వారం :** మండల కేంద్రంలో యూరియా కావలంటూ సోమవారం రైతులు సోసైటి కార్యలయంలో ముందు బైటాయించి ధర్నా నిర్వహించారు. యూరియా కోసం రైతులకు గంటల తరబడి లైన్‌లో నిలబడితే రైతులు యూరియా దోరకడం లేదని, 200 బస్తాల యూరియా వచ్చి గంటలోపే అయిపోవడంతో రైతులు సోసైటి కార్యాలయానికి తాళాలు వేసి కార్యాలయం ముందు కూర్చోని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం యూరియా కోరత లేదని పదే పదే చేబుతూ రైతులను మభ్యపెడుతుందని అవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు పండించే పంటలు అధిక దిగుబడి వస్తుందని యూరియా ఎంతో అవసరం ఉండడంతో, వేయకపోతే పంట దిగుబడి రాదని రైతులు నిరాశ చేందుతున్నారు. మండల పరిధిలో ఉన్న బోపునారం, తోర్‌మామిడి, బస్వాపూర్, మంగ్రాస్‌పల్లి రోంపల్లి, నాగ్వారం, సల్‌బత్తాపూర్, మాలసోమారం, యాచారం, సూల్తాన్‌పూర్, నూర్‌ల్లాపూర్, బంట్వారం గ్రామాల రైతులకు యూరియా సమాయాకి దోరకాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

## దరఖాస్తులు పూర్తిగా పరిశీలించాలి
అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**ప్రజాపక్షం/వికారాబాద్:** వికారాబాద్ జిల్లాలో భూభారతి చట్టం రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించని దరఖాస్తులను అన్ని మాడుల్స్‌లో పరిశీలించి పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తహసీల్దార్లను అదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించి డేటా ఎంట్రీ చేయలని ,గ్రామాలవారిగా రైతుల నుండి తీసకున్న ప్రతి దరఖాస్తుకు సంబంధించి సాధాబైనామా ,ఆర్ఓఆర్ సమస్యలు,పట్టాలో కరెన్స్‌వంటి వివిధ సమస్యలపై దరఖాస్తులను పరిశీలించాలని అదేశించారు. భూ భారతీ లో స్వీకరించిన దరఖాస్తులపైన చర్యలు తీసుకోవలని తహసీల్దార్‌లను అదేశించారు. రేషన్ కార్డులపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వరికి అందించాలని తహసీల్దార్‌కు సూచించారు. ఈ సమావేశంలో డాఆర్ఓ మంగ్లీ లాల్ , సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ , ఆర్‌డిఓ వాసుచంద్ర అన్ని మండల తహసీల్దార్లు పాల్గోన్నారు.

**ప్రజావాణికి 83దరఖాస్తులు స్వీకరణ :** ప్రజావాణికి 83 దరఖాస్తులు స్వీకరించడం జరిగింది అని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి పరుష్కరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉంచకుండా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ హర్స్‌చౌదిరి, డిఆర్ఓ మంగ్లీ లాల్ , ఆర్‌డిఓ వాసుచంద్ర, తదితరులు పాల్గోన్నారు.



## భగత్ సింగ్ కాలనీలో స్వల్ప అగ్ని ప్రమాదం
బాధిత కుటుంబాన్ని పరామర్శించిన తుంగతుర్తి రవి

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మొదటి డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ కాలనీలో ప్రమాదవశాత్తు ఒక గుడిసెలో మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో గుడిసెలో ఉన్న కొన్ని నిత్యవసర సరుకులు పాక్షికంగా కాలిపోయాయి.విషయం తెలుసుకున్న పీర్జాదిగూడ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆర్.వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణాలను తెలుసుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఆర్ వి ఫౌండేషన్ ద్వారా తక్షణసాయంగా బాధ్యత కుటుంబానికి 50 కిలోల బియ్యం నిత్యవసర సరుకులను తుంగతుర్తి రవి అందించి తన ఉదారతను చాటుకున్నారు.ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ, దేవుడి పూజలో వెలిగించిన దీపం కారణంగా మంటలు వ్యాపించాయని చుట్టుపక్కల వాళ్ళు గమనించి మంటలు ఆర్పడంతో బారీ ప్రమాదం తప్పిందని ఆయన అన్నారు. అదేవిధంగా కాలనీలో మంచినీటి సమస్య,డ్రైనేజీ వ్యవస్థసరిగ్గా లేకపోవడం,వీధి దీపాలు లేకపోవడం, కరెంటు వైర్లపై చెట్టుకొమ్మలు పడడం తదితర సమస్యలను గమనించిన తుంగతుర్తి రవి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి భగత్ సింగ్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## భవిష్యత్ తరాలను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే..
ఉపాధ్యాయులను సన్మానించిన ఆర్‌టిఎ మెంబర్ జైపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేటః** భవిష్యత్తు తరాలను తీర్చిదిద్ది దేశ, సమాజ సేవకు పంపించేది ఉపాద్యాయులేనని జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం తూంకుంట మున్సిపాలిటి దేవరయాంజాల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రీసర్వేపల్లి రాధకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఉపాద్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాల ఉపాద్యాయులను శాలువాలతో, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఇటీవల పదవీ విరమణ పొందిన గణితశాస్త్ర ఉపాద్యాయుడు నారెడ్డి హరికృష్ణరెడ్డిని పదవీ వీడ్కోలును పురస్కరించుకుని శాలువాలతో ఘనంగా సత్కరించి గణిత ఉపాద్యాయుడుగా విద్యార్థులకు బోధించిన తీరును ప్రశంసించారు.

ఉపాద్యాయుడు హరికృష్ణరెడ్డి విద్యారంగంలో చేసిన కృషి ప్రశంసనీయమని బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాద్యాయుడు గునుకుంట బాలేష్, కల్యాణి, గ్రామస్థులు బెజగం ఆనంద్‌రావు, డాక్టర్ సింగం రామారావు, డాక్టర్ ప్రహ్లద్, చింతల శ్రీనివాస్ రెడ్డి, పట్నం నర్సింహారెడ్డి, హరికృష్ణరెడ్డి, కుటుంబీకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి మాణిక్‌రావుకు ఘన నివాళులు

**ప్రజాపక్షం/తాండూరుః** స్వర్గీయ మాజీ మంత్రి మాణిక్‌రావు మహారాజ్ 9వ వర్థితి వేడుకలను తాండూరు ఘనంగా జరుపుకున్నారు. మాణిక్‌రావు వర్థంతిని పురస్కరించుకుని సోమవార ఆయన కుమారు రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ మెంబర్ రమేష్ మహారాజ్ ఆద్వర్యాన మాణిక్‌రావు చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగానివాళులు అర్పించారు. తాండూరు పట్టణ పరిధి చించోల్లి రోడ్ మార్గంలోని మాణిక్ రావు విగ్రహానిలు పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణితో పాటు అన్నదానం నిర్వహించారు. అనంతరం పీపుల్స్ కళాశాల, ఎంపిటి పంక్షన్ హాల్‌లో నిర్వహించిన వర్థింతి వేడుకలకు పట్టణంలోని పలువురు నేతలు, నాయకులు భారిగ తరలివచ్చి నివాళులు అర్పించారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## భారీగా రద్దయిన పెద్ద నోట్లు పట్టివేత



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలో భారీగా రద్దయిన పెద్ద నోట్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. నారాయణగూడలో తనిఖీలు చేపట్టిన పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3 బ్యాగులు స్వాధీనం చేసుకోగా.. వాటిలో రూ.2 కోట్లు విలువైన రద్దయిన రూ.500, రూ.1000 నోట్లు ఉన్నట్లు గుర్తించారు. వాటిని పోలీసులు జప్తు చేశారు.

## పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొంత మాధవరెడ్డి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** పార్టీలకు అతీతంగా అర్హులైన పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు కొంతం మాధవరెడ్డి సోమవారం తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి కోహెడ గ్రామం సుర వరం సుధాకర్‌రెడ్డి కాలనీ పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింప చేసే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్య క్షులు చల్ల నారాయణరెడ్డి, సిపిఐ తుర్కయంజాల్ కార్యదర్శి నరేందర్‌గౌడ్, బాలయ్య, జగన్ మోహన్ రెడ్డి, అంజమ్మ ,శ్రీనివాస్, ఫాతిమా, లక్ష్మమ్మ, నిర్మల, సంతోష తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయుల సేవలు మరవలేనివి



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్:** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్య యుల సేవలు మరవలేనివి అని కాంగ్రెస్ నాయకుడు దేవిడి వేణుగోపాల్ రెడ్డి అన్నారు. తట్టి అన్నారంలో ప్రభుత్వ పాఠశాలలో విదులు నిర్యాహించి బదిలీపై వెల్లినా ఉపాధ్యాయులకు సోమవారం ఘనంగా సత్కారం చేశారు. కార్యక్రమంలో వంసత లక్ష్మి, జె.రూప్‌సింగ్, పిఆర్‌టియు నాయకులు కొండల్‌రెడ్డి , రజినీకాంత్‌రెడ్డి, విశ్వాప్రసాద్ తదితరులున్నారు.

## ఉచిత వైద్యసేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** శంకర్ పల్లి మండలం గోపులారం గ్రామ మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్ జన్మదిన సందర్భంగా ఆయన గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వ హించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తీగల అనిత రెడ్డి హాజరయ్యారు. మాజీ చైర్మన్ మాట్లాడుతూ మాజీ సర్పంచ్ తన జన్మదిన సందర్భంగా పేదల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వారికి డాక్టర్లతో వైద్య పరీక్షలు చేయించి, ఉచితంగా మందు లు అందించడం అభినందనీయమన్నారు. కాగా తన జన్మదిన సందర్భంగా మాజీ సర్పంచ్ గ్రామంలోని 500 మంది మహిళలకు ఉచితంగా చీరలను అందించారు. వైద్య శిబిరంలో సంగారెడ్డి ఎమ్మెన్నార్ ఆసుపత్రికి చెందిన డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం



**ప్రజాపక్షం/సరూర్‌నగర్:** ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరమని మహేశ్వరం నియోజకవర్గం బిఆర్‌ఎస్ ప్రధాన కార్యధర్శి మురుకుంట్ల అర విండ్‌శర్మ అన్నారు. సోమవారం ఆర్‌కెపురం డివిజన్ పార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్‌నగర్ కు చెందిన మేతరి సుశీలమ్మ అనారోగ్యానికి గురై ఆసుప త్రిలో చికిత్స చేయించకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.68వేల చెక్కును కుటుంబసభ్యులకు అరవింద్‌శర్మ అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పెంద్యాల నగేష్, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, సాజిద్, కంచర్ల శేఖర్, వెంకటేష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వనస్థలిపురం అభివృద్ధికి ప్రాధాన్యత

వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ఎల్‌బి నగర్ నియోజ కవర్గంలోని వనస్థలిపురం డివిజన్ అభివృద్ధికి ప్రధాన్యత కల్పించాలని రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు సోమవారం మంత్రి వారి నివాసం కలిసి కోరినట్లు వనస్థలిపురం కార్పొరే టర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే ప్రధానమైన సమస్యలు పరిష్కారం చేయడం జరిగిం దని, డివిజన్‌లో కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కారం చేస్తే సంపూర్ణమైన డివిజన్‌గా వనస్థలిపురం డివిజన్ నిలబడుతుందన్నారు. మైజర్ అయిన నాలా, వరద ప్రభావం ఉన్న సమస్యలు తొలగిపోయయ్యాని ఆయన పేర్కొన్నారు. వనస్థలిపురం డివిజన్ అభివృద్ధికి మరింతా నిధులు కేటాయిస్తే పూర్తి స్థాయిలో అబివృద్ధి చెంది ఉంటాదన్నారు. ఈ మేరకు మంత్రి సానుకులంగా స్పదించినట్లు కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

## ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశం

**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** రాష్ట్ర ఎన్నికల సంఘం హైదరాబాద్ ఆదేశాలను అనుసరించి మండల ప్రాదేశిక, జిల్లా ప్రాదేశిక సభ్యుల ఎన్నికల 2025 నిర్వహణలో భాగంగా సోమవారం శంకర్ పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ పార్టీల నాయకులతో ఇంచార్జ్ ఎంపీ డీవో గోపాలకృష్ణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపిఒ గిరి రాజు,ఎపిఒ నాగభూషణం,మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రవీం దర్ రెడ్డి,మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు గోవర్ధన్ రెడ్డి,రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యుడు బి. రాములు గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు విష్ణు పంతులు వాసుదేవ్ కన్నా, మండల బిజెపి అధ్యక్షులు లీలావతి బయన్న, ఎమ్మార్పీ ఎస్ నుండి ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో చెత్త సమస్యకు జిహెచ్‌ఎంసి కీలక నిర్ణయం

# మరో 18 సెకండరీ కలెక్షన్, ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల ఏర్పాటు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జిహెచ్‌ఎంసి కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న 42 సెకండరీ కలెక్షన్, ట్రాన్స్ ఫర్ స్టేషన్ల సంఖ్యను 60కి పెంచుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు అదనంగా 18 కొత్త స్టేషన్లను ఏర్పాటు చేయా లని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం నగరంలో రోజుకు సుమారు 8,300 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. వినాయక చవితి, బక్రీద్ వంటి పండుగల సమయంలో ఈ మొత్తం మరింత పెరుగుతుంది. దీంతో చెత్తను సెకండరీ కలెక్షన్ స్టేషన్ల నుంచి జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు తరలిం చడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమ స్యను అధిగమించేందుకు కొత్త స్టేషన్లు ఎంతగానో ఉప యోగపడతాయని అధికారులు భావిస్తున్నారు.

### స్థలాల గుర్తింపునకు బాధ్యతలు అప్పగింత

కొత్త స్టేషన్ల ఏర్పాటు కోసం 30 సర్కిళ్లలో అనుకూలమైన స్థలాలను గుర్తించే బాధ్యతను ముగ్గురు జాయింట్ కమి షనర్లు(పారిశుద్ధ్యం) తిప్పర్తి యాదయ్య, మోహన్‌రెడ్డి, సుధాంశ్‌లకు అప్పగించారు. వీరు ప్రస్తుతం ఉన్న స్టేష న్లను స్వయంగా సందర్శించి, వాటి పనితీరు ను పరిశీలి స్తారు. గుర్తించిన కొత్త స్థలాలు ఆఅవసరాలకు అనుగు ణంగా ఉన్నాయా లేదా అని నిర్ధారించుకున్నతర్వాతే జాబితాను సమర్పించాలని కమిషనర్ సూచించారు.



### పక్షం రోజుల్లో నివేదిక

ఈ స్థలాల గుర్తింపు ప్రక్రియను కేవలం పక్షం రోజుల్లో పూర్తి చేయాలని జాయింట్ కమిషనర్లకు గడువు విధిం చారు. ఈ కాలంలో వారు ఆయా సర్కిళ్లలో రోజువారీగా ఎంత చెత్త వస్తుంది, ప్రస్తుత స్టేషన్ల సామర్థ్యం ఎంత, కొత్తగా ఏర్పాటు చేయబోయే స్టేషన్లలో ఎంత చెత్తను నిల్వ చేయవచ్చు అనే విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీ లించి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో స్థానిక సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్ల సహాయం తీసుకోవా లని కూడా కమిషనర్ ఆదేశించారు. ఈ కొత్త స్టేషన్ల ఏర్పాటుతో చెత్తను నగర శివారుకు మరింత వేగంగా, సమర్థవంతంగా తరలించడం సాధ్యమవుతుందని, తద్వారా పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగుపడు తుందని జిహెచ్‌ఎంసిఅధికారులు భావిస్తున్నారు.

## సమగ్ర ఓటర్ల జాబితా తయారీలో..

# రాజకీయ పార్టీలు సహకరించాలి





జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజక వర్గం ఉప ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను సమ గ్రంగా తయారు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతిని ధులు సహకరించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ కోరారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావే శంలో ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 2న ప్రచురించామని కర్ణన్ తెలి పారు. ముసాయిదా జాబితా ప్రకారం, జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో మొత్తం 139లొకేషన్లు, 407పోలింగ్ స్టేషన్లు ఉన్నా యి. ఇందులో 3,92,669మంది ఓటర్లు ఉన్నారు. ఈ జాబి తా అన్ని రాజకీయ పార్టీలకు పంపబడిందని, అలాగే తెలం గాణ ప్రధానఎన్నికల అధికారి, జిహెచ్‌ఎంసి వెబ్‌సైట్లలో కూడా అందుబాటులో ఉంచబడిందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ లెవల్ ఏజెంట్లను నియమించి, జాబితా సవ రణలో పారదర్శకంగా భాగస్వాములు కావాలని ఆయన పార్టీ ప్రతినిధులను కోరారు. ఈనెల 17వ తేదీ వరకు ఓటర్ల జాబితాకు సంబంధించి అభ్యంతరాలు, దరఖాస్తులను స్వీక రించడానికి అవకాశం ఉందన్నారు. జూలై 1 నాటికి 18 సంవ త్సరాలు పూర్తిచేసుకున్న అర్హులైన పౌరులు ఈనెల 17 లోపు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేయించుకోవాలని కర్ణన్ సూచించారు. జాబితాలో సవరణలు, మార్పులు ఉంటే ఈ నెల 17 లోపు సంబంధిత దరఖాస్తు ఫారాలను సమర్పించా లని, ఇప్పటివరకు ఫారం6, 6ఎ, 7, 8 ద్వారా వచ్చిన 2,855 దరఖాస్తుల్లో 8.62 శాతం దరఖాస్తులను పరిష్కరించామని, మిగతావి త్వరలో పరిష్కరిస్తామని కర్ణన్ వివరించారు. ఓటర్ల జాబితాను తప్పులు లేకుండా సిద్ధం చేయడానికి రాజకీయ పార్టీల సహకారం అవసరమన్నారు. తుది ఓటర్ల జాబితా ఈనెల 30న ప్రచురించబడుతుందని తెలిపారు. సమావేశంలో అదనపుకమిషనర్ (ఎన్నికలు) మంగళతాయారు, ఎల్.బి. నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, సికింద్రా బాద్ కంటోన్మెంట్ బోర్డు జాయింట్ సిఈఓ పల్లవి విజయవన్ పాల్గొన్నారు. అంతకుముందు, హైదరాబాద్ జిల్లాలో జిఐఎస్ ఆధారిత నజరి నక్ష తయారీ కార్యాచరణ ప్రణాళికపై కమిష నర్ ఆర్‌వి.కర్ణన్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు.

## గణేశ్ నిమజ్జనం..

# 17 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాల తరలింపు

రాత్రింబవళ్లు శ్రమించిన పారిశుద్ధ్య యంత్రాంగం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత నెల 27 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు జరిగిన గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా, జిహెచ్‌ఎంసి 17,049 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించింది. ఈ వ్యర్థా లను జవహర్‌నగర్‌లోని డంపింగ్‌యార్డుకు తర లించినట్లు అధికారులు తెలిపారు. సాధారణంగా రోజుకు 8,300 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవు తుండగా, ఉత్సవాల రోజుల్లో అదనంగా 1,550 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు జతయ్యాయి. ఈసారి నిమజ్జనం రెండు రోజుల పాటు కొనసాగినం దున, జిహెచ్‌ఎంసి ప్రత్యేకంగా 'ఇంటెన్సివ్ శాని టేషన్ డ్రైవ్'ను చేపట్టింది. నిమజ్జనం ప్రారంభ మైన శనివారం ఉదయం నుంచి ఆదివారం రాత్రి వరకు ఈ డ్రైవ్ కొనసాగింది. ఈ మొత్తం ప్రక్రి యలో అదనంగా సేకరించిన 17,049 మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెసింగ్ కోసం పంపించినట్లు జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ (ఆరోగ్యం పారి శుద్ధ్యం) సి.ఎన్. రఘుప్రసాద్ తెలిపారు. చెత్త సేక రణ కోసం 14,486 మంది పారిశుద్ధ్య కార్మికు లను మూడు షిఫ్టుల్లో నియమించారు. వీరిని 160 గణేశ్ యాక్షన్ టీమ్‌లుగా విభజించారు. గణేశ్ మండపాలు తక్కువగా ఉన్న జోన్‌ల సిబ్బందిని ఈ మూడు షిఫ్టుల్లో వినియోగించారు. ప్రతి వంద మీటర్ల దూరానికి ఒక బృందాన్ని నియమించి, వారికి బ్లాక్ కవర్ బ్యాగ్‌లు అందించడంతో చెత్త సేకరణ వేగవంతమైందని అధికారులు వెల్లడిం చారు. దీనివల్ల గతేడాది కన్నా ఈసారి చెత్త సేకర ణ ప్రక్రియ మరింత వేగంగా పూర్తైందని చెప్పారు. నిమజ్జన వ్యర్థాలను సేకరించడానికి 102 మినీ టిప్పర్లు, 124 జెసిబిలను వినియోగించారు.





## రోడ్డు ప్రమాద సూచిక బోర్డు ఢీకొని ఇద్దరు యువకుల మృతి

శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాద ఘటన

**ప్రజాపక్షం/శంషాబాద్:** శంషాబాద్,బెంగళూరు జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 44)పై బైక్ రోడ్డు ప్రమాద సూచిక బోర్డును ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృత్యువాతపడిన ఘటన శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సిఐ కె.నరేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ... శంషాబాద్ గండిగూడ గ్రామానికి చెందిన రాణిఈశ్వరయ్య దంపతుల కుమారుడు మంచర్ల అఖిల్ (22), వృత్తిరీత్యా ఎయిర్‌పోర్టు కార్గో విభా గంలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఇంటివద్దే ఉన్నాడు.ఈ క్రమంలో మదనపల్లి గ్రామానికి చెందిన బంధువు కట్ట చింటూ (23), వృత్తి: డ్రైవర్, సాయంత్రం 4 గంటల సమయంలో అఖి ల్‌కు ఫోన్ చేసి తన ఇంటికి రావాలని చెప్పాడు.దాంతో అఖిల్ తన యమహా వాహనంపై బయలుదేరి చింటూతో కలిసి మదనపల్లి వైపు రాగా, సాయంత్రం రిక్స్ మహేంద్ర షోరూమ్ సమీపంలో రోడ్డు ప్రమాద సూచిక బోర్డును గమనించకపోవడంతో బైక్ ఢీకొని ఇద్దరూ తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతిచెందారు. సంఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు శంషాబాద్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 10న జిల్లా, మండల ప్రాదేశిక స్థానాల తుది జాబితా

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాకు సంబంధించిన జెడ్.పిటిసి, ఎంపిటిసి స్థానాల తుది ఓటరు జాబి తాను ఈనెల 10న వెలువరించడం జరుగుతుంద ని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం సమీ కృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఇంచార్జ్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె శ్రీనివాస్ అధ్యక్షతన గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈసంద ర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్ని కల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయడం జరిగిందని అన్నారు. ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏమైనా అభ్యం తరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన అనంతరం తిరిగి సెప్టెంబర్ 10న తుది జాబితా వెలువరిస్తామని ఆయన వివరించారు. అదేవిధంగా మండల స్థాయిలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతిని ధుల సమావేశంలో కూడా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ కోరారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ కృష్ణా రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి(డిపిఒ)సురేష్ మోహన్,డిప్యూటీ సిఇఒ రంగారావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుండి ఎన్.మహేష్, ఆవుల యాదయ్య, కె.రాజ్ కుమార్, సిపిఐ నుండి పాల మాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, సిపి ఐ(ఎం) నుండి పగడాల యాదయ్య, బిఆర్‌ఎస్ నుండి వనం శ్రీనివాస్, బిజెపి నుండి కె.అనం తయ్యగౌడ్, అంబాజీ శ్రీనివాస్, టిడిపి నుండి జె.రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి వినతులకు తక్షణమే స్పందించాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహి స్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను తక్షణమే స్పందించాలని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం సమీ కృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యా దుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను పెం డింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం రెవెన్యూశాఖకు సంబందించి 42, ఇతర శాఖలకు చెందినవి 22 తోపాటు మొత్తం 64 దరఖస్తులు అందాయని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కూలీల పెండింగ్ వేతనాలు : సిపిఐ

**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం :** జాతీయ ఉపాధి హామీ కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరి షత్తు కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో వ్యవసాయ కార్మిక సంఘం,సిపిఐ ఆద్వర్యంలో స్థానిక ఆర్డిఓ ఆనంతరెడ్డికి వినతి పత్రం అంద చేశారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్ మాట్లాడుతూ గ్రామీణా ప్రాంతాలలో ఉపాధి హామి కూలీలు పొట్ట కూటి కోసం పనులు చేస్తే వారికి నేటి వరకు .సక్రమంగా బిల్లులు చెల్లించక పోవటం సిగ్గు చేటని విమర్శించారు.కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించటంలో సంబంధిత అధికారులు ఘోరంగా విఫం చెందారన్నారు.తక్షణమే అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించకుంటే కూలీల సమక్షంలో ఆందొళన చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో నాయకులు ఎస్ లక్ష్మ య్య,పి నీలమ్మ,ప్రవీణ్ కుమార్,నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.



## రైతుల ప్రయోజనాల కోసం మార్కెట్ కమిటీ పనిచేయాలి

వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలనలో రైతుల ప్రయోజనలే లక్ష్యంగా మార్కెట్ కమిటీలు పని చేయాలని రాష్ట్ర వ్యవ సాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. గడ్డి అన్నారం బాటాసింగారం పండ్ల మార్కెట్‌ను సోమవారం సందర్శించి సమీక్ష నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మార్కెట్‌లో మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచన చేశారు. బత్తాయి రైతుల మార్కెట్‌ను లోకి వెళ్లి పరిశీలించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసున్నారు. రైతు పక్ష పాతిగా పని చేస్తున్నా ప్రభుత్వం అనుగుణంగా కమిటీలు పని చేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలసిన భాద్యత కమిటీదే అన్నారు. కోహెడలో ఏర్పాటు చేస్తున్న మార్కెట్ పనులు అతి త్వరలోనే మొదలు పెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు సునిల్ రెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మాధు సూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర చారి, సభ్యులు అంజయ్య, మార్కెట్ కార్య దర్శి ఎల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# రీల్



## 'మాస్ జాతర' రెడీ

రాజా రవితేజ చేస్తున్న లేటెస్ట్ చిత్రం 'మాస్ జాతర' రిలీజ్‌కు రెడీఅవుతోంది. ఈ సినిమాకు దర్శకుడు భాను భోగవరపు డైరెక్ట్ చేస్తుండగా పూర్తి మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను అలరించేందుకు రెడీ అవుతోంది. రవితేజ కెరీర్‌లో 76వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే, తాజా సమాచారం ప్రకారం ఈ చిత్ర నాన్ థియేట్రికల్ రైట్స్ అమ్ముడైనట్లు తెలుస్తోంది. ఈ సినిమా ఓటీటీ రైట్స్‌ను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫార్మ్ జీ దక్కించుకోగా.. ఈ చిత్ర శాటిలైట్ రైట్స్‌ను జీ తెలుగు ఛానల్ దక్కించుకున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్ర నాన్‌థియేట్రికల్ రైట్స్‌కు మంచి ఫ్యాన్సీ రేటు లభించినట్లు సినీ సర్కిల్స్ టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. . ఇక ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు.

## ముంబైలో రష్మిక హంగామా





అనిమే అభిమానుల కోసం క్రంచిరోల్, సోనీ పిక్చర్స్ ఎంటర్టైన్‌మెంట్ ఇండియా నిర్వహించిన 'డీమన్ స్లేయర్: కిమెట్సు నో యైబా – ఇన్ఫినిటీ క్యాసిల్ ప్రత్యేక ఫ్యాన్ స్క్రీనింగ్ ముంబైలో ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్‌లో 250కి పైగా అభిమానులు పాల్గొనగా, ప్రత్యేక ఆకర్షణగా రష్మిక మందన్నా మరియు టైగర్ ష్రాఫ్ హాజరై అనిమే కల్చర్‌ను సెలబ్రేట్ చేశారు.రష్మిక, టాంజిరో – నెజుకో సోదర సోదరీమణులకి ప్రేరణగా ఉండే ప్రత్యేక డ్రెస్‌లో అభిమానులను అలరించగా, టైగర్ తన జెనిట్సు–ఇన్స్పైర్డ్ జాకెట్‌తో ఫ్యాండమ్‌ను ప్రదర్శించారు. అభిమానులతో మాట్లాడిన టైగర్, తనకు బాగా నచ్చిన సీన్ జెనిట్సు వర్సెస్ కైగాకు అని చెప్పారు. అందరూ పడిపోయినా, జెనిట్సు మాత్రమే ప్రశాంతంగా కోటలోకి ప్రవేశించాడు అని ఆయన గుర్తుచేశారు.రష్మిక కూడా అభిమానులను వారి ఫేవరెట్ సీన్ గురించి అడిగింది. దీనికి పెద్ద ఎత్తున స్పందన రావడంతో అకాజా వర్సెస్ గియు టాంజిరో ఫైట్ సీక్వెన్స్‌కు థండరస్ రెస్పాన్స్ లభించింది. డీమన్ స్లేయర్: ఇన్ఫినిటీ క్యాసిల్ టికెట్లు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. 750కి పైగా స్క్రీన్లలో విడుదల భారతదేశంలో ఇప్పటి వరకు ఎప్పుడూ లేని స్థాయి రిలీజ్ చేస్తున్నారు. సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు ఈ సినిమా రానుంది. జపనీస్ (ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్‌తో), ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగులో విడుదల కానుంది.

## విమల్ కృష్ణ కొత్త చిత్రం ప్రారంభం





రచయితదర్శకుడు విమల్ కృష్ణ, సృజనాత్మక కథలకు పేరుగాంచాడు, 2022 కామెడీ డీజే టిల్లుతో విజయవంతంగా అరంగేట్రం చేశాడు. ఈ చిత్రం భారీ సంచలనంగా మారింది. అతను మరో వింత పాత్రను క్రేజీ విధంగా సృష్టించడానికి పరిచయం చేయడానికి సిద్ధమవుతున్నాడు. చిలకా ప్రొడక్షన్స్ నిర్మించనున్న ప్రాజెక్ట్‌తో తిరిగి వచ్చాడు. ఇటీవల మేకర్స్ విమల్ కృష్ణ సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల నటించిన సరదా వీడియోతో ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఈ వీడియో వైరల్ అయ్యింది. సోమవారం పూజ కార్యక్రమాలతో కొత్త సినిమా ప్రారంభించారు. ఈ చిత్రంలో రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ నటిస్తున్నారు. సునీల్ కుమార్ నామా సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. శ్రీ చరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు. జె.కె. మూర్తి ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఎడిటింగ్‌ను అఖినవ్ కునపరెడ్డి నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమానికి మొత్తం బృందం హాజరయ్యారు. మేఘ చిలక , స్నేహ జగ్గియాని క్లాప్ కొట్టారు. సునీల్ నామా కెమెరా స్విచ్ ఆన్ చేయగా, విమల్ కృష్ణ స్క్రిప్ట్ అందజేశారు.



## క్లైమాక్స్ చిత్రీకరణలో 'ఏ మాస్టర్ పీస్'

శుక్ర, మాటరాని మౌనమిది వంటి డిఫరెంట్ మూవీస్ తర్వాత దర్శకుడు పూర్వాజ్ రూపొందిస్తున్న కొత్త సినిమా 'ఏ మాస్టర్ పీస్'. అరవింద్ కృష్ణ, జ్యోతి పూర్వజ్, మనీష్ గిలాడ, అషు రెడ్డి లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీకాంత్ కండ్రేగుల, మనీష్ గిలాడ, ప్రజయ్ కామత్ నిర్మిస్తున్నారు. 'ఏ మాస్టర్ పీస్' సినిమా ఒక న్యూ కాన్సెప్ట్ సూపర్ హీరో మూవీ ఎక్స్‌పీరియన్స్‌ను తెలుగు ప్రేక్షకులకు అందించబోతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. క్లైమాక్స్ సీన్స్ రూపొందిస్తున్నారు. 'ఏ మాస్టర్ పీస్' షూటింగ్ కవరేజ్‌కు మీడియా మిత్రులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు పూర్వాజ్ మాట్లాడుతూ దశరథ మహారాజు మంత్రుల్లో ఒకరైన సుమంత్రుడికి శ్రీరాముడు వనవాసం వెళ్తున్న సమయంలో ఒక వరం లభిస్తుంది, ఆ వరం నేపథ్యంగా సూపర్ హీరో క్యారెక్టర్‌ను, హిరణ్యకశ్యపుడి ద్వాపర యుగానికి చెందిన ఒక అంశంతో సూప ర్ విలన్ పాత్రను క్రియేట్ చేశాం. శ్రీరాముడి త్రేతాయుగానికి, హిరణ్యకశ్యపుడి ద్వాపర యుగానికి, ఇప్ప టి కలియుగానికి అనుసంధానిస్తూ సాగే ఒక కొత్త తరహా స్క్రిప్ట్‌ను 'ఏ మాస్టర్ పీస్' చిత్రంలో చూస్తారని అన్నారు.



## 'తెలుసు కదా' షూటింగ్ పూర్తి

సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్నరొమాంటిక్ డ్రామా తెలుసు కదా. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్ లుగా నటిస్తున్నారు. నీరజా కోన దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న నిర్మిస్తున్నారు. తాజాగా హీరోయిన్ రాశీ ఖన్నా ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకున్నారు.'తెలుసు కదా' జర్నీ గురించి రాశీ ఖన్నా మాట్లాడుతూ కెమెరాలు ఆగిపోయిన తర్వాత కూడా మరిచిపోలేని కథలు ఉంటాయి. 'తెలుసు కదా' అలాంటి కథల్లో ఒకటి. అద్భుతమైన అనుభవాలన్నీ కలగలిసిన ప్రయాణం ఇది. ఈ ప్రయాణంలో నాతో పాటు నడిచిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు. మేము సృష్టించిన ఈ ప్రపంచంలోకి మీరు అడుగు పెట్టే రోజుకోసం ఎదురుచూస్తున్నాను. థమన్ ఎస్ ఈ చిత్రానికి సంగీతం అందించారు.ఫస్ట్ సింగిల్ మల్లికా గంధ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ మూవీకి డీవోపీ జ్ఞాన శేఖర్. నేషనల్ అవార్డు విన్నర్ నవీన్ నూలి ఎడిటర్. అవినాష్ కొల్ల ఆర్ట్ డైరెక్షన్, కాస్ట్యూమ్స్ శీతల్ శర్మ పని చేస్తున్నారు. తెలుసు కదా సినిమా ఈ దీపావళి కానుకగా అక్టోబర్ 17న విడుదల కానుంది.

## 'బూకీ' షూటింగ్ షురూ





బిచ్చగాడు సినిమా ఫేమ్ విజయ్ ఆంటోని ఫిలిం కార్పొరేషన్ బ్యానర్‌పై 'బూకీ' సినిమా షూటింగ్ షురూ అయింది. రామానాయుడు స్టూడియోలో సోమవారం జరిగిన ఈ చిత్రం ప్రారంభోత్సవంలో హీరో హీరోయిన్లపై నటుడు సత్యదేవ్ క్లాప్ కొట్టారు. నటి మంచి లక్ష్మి కెమెరా స్విచాఫ్ చేశారు. విలన్ సునీల్ ముఖ్య అతిధిగా పాల్గొని పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. దిశాన్, ధనుషా హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. విజయ్ కార్పొరేషన్, స్రవంత్ రామ్ క్రియేషన్స్, సురేష్ ప్రొడక్షన్స్, ఏషియన్ నెట్ సంస్థలు కలసి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. అజయ్ దిషన్, ధనుష హీరో హీరోయిన్స్‌గా గణేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందుతున్న యూత్ ఫుల్ ఎంటర్టైనర్ 'బుకీ'. విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, శరవంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్స్ పై రామంజేయులు జవ్వాజీ నిర్మిస్తున్నారు. విఎఎఫ్సి ప్రజెంట్ చేస్తున్నారు. ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో సోమవారం గ్రాండ గా లాంచ్ అయ్యింది. ముహూర్తపు సన్నివేశానికి సత్య దేవ్ ఫస్ట్ క్లాప్ కొట్టారు. సి కళ్యాణ్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. మంచు లక్ష్మి స్క్రిప్ట్ అందించారు. విజయ్ ఆంథోని, రామాంజనేయులు గౌరవ దర్శకత్వం వహించారు.ఈ చిత్రంలో పాండియరాజన్, సునీల్, లక్ష్మి మంచు, ఇందుమతి, వివేక్ ప్రసన్న కీలక పాత్రలు పోషిస్తున్నారు. విజయ్ ఆంటోని మ్యూజిక్ అందిస్తున్నారు.

## పాట పాడిన రామ్



హీరోగా భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా తెరకెక్కుతున్న సినిమాలోని 'పప్పి షేమ్' పాటను విడుదల చేశారు. ఈ పాటను హీరో రామ్ స్వయంగా పాడారు.వివేక్ శివ, మెర్విన్ సోలొమన్ సంగీతం అందించిన ఈ పాటకు భాస్కరపట్ల రవి కుమార్ సాహిత్యం అందించారు. మైత్రి మూవీస్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ సినిమాలో కన్నడ నటుడు ఉపేంద్ర మరో కీలకపాత్రను పోషిస్తున్నారు. రావు రమేష్, మురళి శర్మ అత్యంత కీలమైన పాత్రలను పోషిస్తున్నారు. ఈ సినిమాకు పి.మహేష్ బాబు దర్శకత్వం వహిస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ పాడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న సినిమాను ఈ ఏడాది ఆఖరులో విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ తెలిపారు. రామ్ పాడిన ఈ పాట సినిమాలో హైలెట్‌గా నిలుస్తుందని చెప్పారు.

# యూరియా పంపిణీకి పటిష్ఠ చర్యలు: మంత్రి



ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండ యూరియా పంపిణీకి పటిష్ట చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అదేశాల మేరకు అధికారులు అన్ని చర్యలు చేపట్టారు. మంత్రి అదేశాల మేరకు యూరియా కొరత కారణంగా గతకొద్ది రోజులుగా పంపిణీలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా 500 రైతు వేదికల వద్ద అదనపు కౌంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు ముందుగానే రైతులకు టోకెన్లను జారీ చేసి క్యూ లైన్లు లేకుండా తోపులాటలు లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా యూరియా పంపిణీ సజావుగా కొనసాగడంతో ఇ దే విధానాన్ని కొనసాగించాలని మంత్రి తుమ్మల అధికారులకు దిశానిర్దేశం చేశారు. జియో పాలిటిక్స్ వల్ల యూరియా ఇంపోర్ట్ లేకపోవడం ,దేశీయంగా ఉత్పత్తి డిమాండ్‌కు తగ్గట్టు లేకపోవటం వల్ల తెలంగాణ లోనే కాకుండా దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో యూరియా సరఫరాలో కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారనీ మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడితో ఆగస్ట్‌లో అదనంగా నలభై వేల మెట్రిక్ టన్నుల యూరియా తెచ్చుకున్నామని ఇక మీదట ప్రతి రోజు 10వేల మెట్రిక్ టన్నుల యూరియా వివిధ కంపెనీలు సరఫరా చేసేలా సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి తో యూరియా సరఫరా మెరుగు పడిందని మంత్రి తుమ్మల తెలిపారు. కొన్ని పార్టీలు రాజకీయ స్వార్థంతో యూరియా పంపిణీ కేంద్రాల వద్ద కావాలని ఆందోళనలు చేసి రేవంత్ ప్రభుత్వాన్ని బదనం చేయాలనే దిగజారుడు రాజకీయం చేస్తున్నారని రైతులు వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల కోరారు. రైతులకు ప్రజా ప్రభుత్వం ఎప్పుడు భరోసాగా నిలుస్తుందనీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. మంత్రి తుమ్మల ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి యూరియా పంపిణీని నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు.

# 'ఇహెచ్‌ఎస్' విధి విధానాలను సిద్ధం చేయాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉన్నతాధికారులకు ఆదేశం



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఇహెచ్‌ఎస్ (ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్) విధి విధానాలను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇతర రాష్ట్రాలలో ప్రభుత్వ ఉద్యోగులకు అమలవుతున్న వివిధ పథకాలను, ఇన్సూరెన్స్ కంపెనీల విధానాలను అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరలో నివేదికను సిద్ధం చేయాలన్నారు. ప్రతిపాదిత ఇహెచ్‌ఎస్ విధి విధానాలపై హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో సీనియర్ ఐఎఎస్ అధికారులతో రామకృష్ణారావు సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ వేతనం నుండి కొంత డబ్బును జమ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, నగదు రహిత ఆరోగ్య చికిత్స విధానం ద్వారా ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు హెల్త్ కేర్ అందించాలని ఉద్యోగులు కోరుతున్నట్టు అధికారులు రామకృష్ణారావుకు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు మొత్తం కలిపి 7,14,322 మంది ఇహెచ్‌ఎస్ ద్వారా లబ్ధి పొందనున్నారని, ఈ పథకం కోసం సంవత్సరానికి సుమారు రూ.1300 కోట్ల అంచనా వ్యయం అవుతుందని అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ, ఆర్థిక శాఖ అధికారులు సమన్వయంతో ఆయా రాష్ట్రాలలో కొనసాగుతున్న ఇహెచ్‌ఎస్ విధి విధానాలను అధ్యయనం చేసి త్వరలో నివేదికను సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి డా.యోగితా రాణ, ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా చోంగ్తు, , జిఎడి కార్యదర్శి బెన్హర్ మహేష్ దత్ ఎక్కా తదితరులు పాల్గొన్నారు.





## భారీ ప్రదర్శన

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్ తదితరులు నడవగా కలెక్టరేట్ సమీపంలోని వైరా రోడ్డు నినాదాలతో హోరెత్తింది. ఆసరా పింఛన్లు పెంపుదల చేయాలని, వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేయాలని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, మహాలక్ష్మి పథకాన్ని సత్వరమే అమలు చేయాలని వ్యవసాయ కార్మికులు నినదించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డిమాండ్స్‌తో కూడిన ప్లేకార్డులను ప్రదర్శించారు. భారీ సంఖ్యలో వ్యవసాయ కార్మికులు తరలి రావడంతో కలెక్టరేట్ వద్ద ఆందోళన పూరిత వాతావరణం నెలకొంది.

**హామీలు అమలు చేయకపోతే పోరాటం : బాగం**

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఆందోళన తప్పదని ప్రజల పక్షాన పోరాట కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు హెచ్చరించారు. అధికారంలోకి వచ్చి 20 మాసాలు గడిచిన కొన్ని హామీల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తుందన్నారు. పింఛన్లు పెంచుతామని స్పష్టమైన హామీ ఇచ్చారని 20 మాసాల కాలంలో పింఛన్ల మొత్తాన్ని పెంచడం కానీ, కొత్త పింఛన్లు ఇవ్వడం కానీ జరగ లేదన్నారు. గత ప్రభుత్వం చెప్పినట్లుగా 57 ఏళ్లకే పింఛన్లు అమలు చేయడంతో పాటు వయో వృద్ధులైన వ్యవసాయ కార్మిక దంపతులకు పింఛన్లు వర్తింపజేయాలని హేమంతరావు డిమాండ్ చేశారు. రైతు భరోసా మొదలు వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో ఏడాదికి రూ. 12వేలు జమ చేస్తామని ప్రకటించారని కానీ ఇంత వరకు ఏ వ్యవసాయ కార్మికుని బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ చేయలేదన్నారు. ఆందోళనను ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రసంగించగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, ఎస్‌కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, బిజి క్లెమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు.

## ఆమోదించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆధార్ పౌరసత్వానికి రుజువు కాదని స్పష్టం చేసింది. ఓటర్ల జాబితాలో చేర్చడానికి ఓటరు సమర్పించిన ఆధార్‌కార్డు నంబర్ యొక్క యథార్థతను ఎన్నికల సంఘం నిర్ధారించగలదని పేర్కొంది. ఓటర్ల జాబితాలో అక్రమంగా ఓటు వేయడానికి ఓటర్లు ఎవరూ కోరుకోవడంలేదని, పౌరులు మాత్రమే ఓటు వేయడానికి అనుమతించబడతారని, నకిలీ పత్రాల ఆధారంగా తాము నిజమైనవారమని చెప్పుకునే వారిని ఓటర్ల జాబితా నుండి తొలగిస్తారని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆధార్‌ను గుర్తింపు రుజువుగా అంగీకరించడానికి అవసరమైన ఉత్తర్వులు జారీ చేయాలని ధర్మాసనం ఎన్నికల సంఘాన్ని కోరింది. ఓటర్ల నుండి ఆధార్‌ను పత్రంగా అంగీకరించనందుకు ఎన్నికల అధికారులకు జారీచేసిన షోకాజ్ నోటీసులపై వివరణ ఇవ్వాలని అత్యున్నత న్యాయస్థానం ఎన్నికల సంఘాన్ని కోరింది. ముసాయిదాలో 7.24కోట్ల ఓటర్లలో 99.6శాతం మంది తమ డాక్యుమెంట్లను సమర్పించారని, 12వ డాక్యుమెంట్‌గా చేర్చాలని కోరుతున్న పిటిషనర్లు ఎటువంటి ఆచరణాత్మక ప్రయోజనాన్ని అందించరని ఎన్నికల సంఘం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేదీ వాదించారు. పౌరసత్వ ధ్రువీకరణ విషయంలో పాస్‌పోర్టుకు ఉన్న విలువ ఆధార్‌కు లేదని, అలాంటప్పుడు దానిని ఆ జాబితాలో ఎలా చేరుస్తామని ప్రశ్నించారు. సెప్టెంబరు 1న గడువు పొడిగింపు కోసం రాజకీయ పార్టీలకు చెందిన కొన్ని దరఖాస్తులను విచారిస్తున్న సమయంలో సుప్రీం కోర్టు, బిహార్‌లో ఎస్ఐఆర్ కసరత్తు కింద తయారుచేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలోని క్లెయిములు, అభ్యంతరాలు, దిద్దుబాట్లను సెప్టెంబరు 1 తర్వాత కూడాదాఖలు చేయవచ్చని ఎన్నికల సంఘానికి తెలియజేసింది. కానీ, ఓటర్ల జాబితా ఖరారు అయిన తర్వాత వీటిని పరిగణనలోనికి తీసుకుంటారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో నామినేషన్ ఫారాల చివరితేదీ వరకు ముసాయిదా జాబితాలోని వాదనలు, అభ్యంతరాలను తెలియజేయవచ్చని పేర్కొంది. బిహార్ ఎస్ఐఆర్ పోల్‌ప్యానెల్ జూన్ 24నషెడ్యూల్ ప్రకారం ముసాయిదాపై వాదనలు, అభ్యంతరాలను దాఖలు చేయడానికి గడువు సెప్టెంబరు 1తో ముగిసింది. తుది ఓటర్ల జాబితా సెప్టెంబరు 30న ప్రచురించబడుతుంది.

## రక్తసిక్తం

(మొదటి పేజీ తరువాయి)

చేయలేదు. గడచిన గురువారం నేపాల్ ప్రభుత్వం సోషల్ మీడియా వేదికలను నిషేధించింది. వీటిల్లో ప్రధానంగా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లు ఉన్నాయి. ఈ వేదికలలో యూజర్లు నకిలీ ఐడి ప్రూఫ్‌లు ఉపయోగించి దేశంలో విద్వేషం, ప్రభుత్వ వ్యతిరేకతలను రెచ్చగొట్టేందుకు దుష్ప్రచార పోస్టింగులు చేస్తున్నారని, ఈ వేదికల ద్వారా తప్పుడు వార్తలను ప్రచా రం చేస్తున్నారని, ప్రభుత్వంపై అవినీతి బురద జ ల్లుతున్నారని అందుకే సోషల్ మీడియాపై నిషేధం విధించామని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. పార్లమెంటు చుట్టుపక్కల ప్రాంతాలలో నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని, ప్రదర్శకులను అదుపు చేసేందుకు బాష్పవాయు ప్రయోగం, రబ్బరు బుల్లెట్లు, నీటి గొట్టాలను ఉపయోగించాలని ఆదేశాలు జారీ చేశామని ఖాట్మండ్ జిల్లా ప్రధాన అధికారి ముక్తీరామ్ రిజాల్ చెప్పారు. ఏడుగురు విద్యార్థులను తొలుత ఆసుపత్రికి తీసుకువచ్చారని, అప్పటికే వారు మరణించారనీ, మరో 20మంది చికిత్సపొందుతున్నారనీ నేషనల్ ట్రామా సెంటర్ వైద్యుడు డాక్టర్ దీపేంద్రపాండే రాయిటర్స్ వార్తాసంస్థకు చెప్పారు. ఎవరెస్ట్ ఆసుపత్రిలో గాయాలతో ముగ్గురు విద్యార్థులు మరణించగా, మరో యాభైమంది చికిత్స పొందుతున్నారని ఆసుపత్రి వైద్యుడు అనిల్ అధికారి చెప్పారు. సివిల్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఇద్దరు యువకులు మరణించినట్లు ఆ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహన్‌చంద్ర రెగ్మి చెప్పారు. త్రిభువన్‌యూనివర్సిటీ టీచింగ్ ఆసుపత్రిలో ఒకరు, కెఎంసి ఆసుపత్రిలో ఒకరు గాయాలతో చికిత్సపొందుతూ మరణించారు. కాగా ఇద్దరు భద్రతాసిబ్బందితోపాటు 42మంది గాయపడినట్లు పోలీసు అధికార ప్రతినిధి చెప్పారు. ఐతే ఆసుపత్రులకు పెద్దసంఖ్యలో గాయపడినవారు, మరణించినవారు వస్తూ ఉండటంతో పూర్తి సంఖ్యావివరాలు తెలియడంలేదని నేపాల్ మీడియా బ్రేకింగ్ న్యూస్‌లో వెల్లడించింది. సోషల్ మీడియాపై నిషేధాన్ని, ప్రభుత్వ అవినీతిని కూడా వ్యతిరేకిస్తూ యువతీ యువకులు దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిపారు. స్కూలు, కాలేజీ యూనిఫాంలు ధరించిన వేలాదిమంది విద్యార్థులు ఖాట్మండు వీధుల్లోకి వచ్చారు. 'అవినీతిని నిషేధించండి–సోషల్ మీడియాను కాదు' అనే బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ పార్లమెంటు భవనం దిశగా ప్రదర్శన జరిపారు. బ్యారికేడ్లు ధ్వంసం చేసి పార్లమెంటులోకి ప్రవేశించేందుకు ప్రయత్నం చేయడంతో పోలీసులు యువకులపై మొదట భాష్పవాయు ప్రయోగం చేశారు. ప్రభుత్వం కర్ఫ్యూ విధించి అనేక ప్రాంతాలకు విస్తరించింది. ఖాట్మండులోని పలుప్రాంతాలలో సైన్యాన్ని మోహరించారు.

**జర్నలిస్టుల నిరసన ప్రదర్శన చర్చలద్వారా పరిష్కారానికి విజ్ఞప్తి**

సోషల్ మీడియాపై నిషేధం విధించడాన్ని వ్యతిరేకిస్తూ ముందు రోజు ఆదివారం నేపాల్ జర్నలిస్టులు దేశ రాజధాని ఖాట్మండులోని మైతీఘర్ మండల వద్ద నిరసన ప్రదర్శన జరిపారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, సోషల్ మీడియా వేదికలపై నిషేధం ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నేపాల్ కంప్యూటర్ అసోసియేషన్ (సిఎఎన్) ఒక ప్రకటన చేస్తూ, ముఖ్యమైన సోషల్ మీడియా వేదికలను నిషేధించడంవల్ల దేశంలో విద్య, వ్యాపారం, కమ్యూనికేషన్ వంటి వాటిపై నిషేధం తీవ్ర ప్రభావం చూపిస్తుందని పేర్కొంది. దీని వల్ల నేపాల్ దేశం, ప్రజలు డిజిటల్ టెక్నాలజీలో ప్రపంచంకంటే బాగా వెనుకబడిపోయే ప్రమాదం ఉందని సిఎఎన్ అధ్యక్షుడు సునైనా ఘిమైర్ ఆ ప్రకటనలో హెచ్చరించారు. ఈ విషయంలో ఆచరణాత్మకమైన పరిష్కారం సాధించేందుకు ఈ రంగ ప్రముఖులతో, దేశంలో ఉన్న సంబంధిత ముఖ్యులతో ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. ఇటీవలికాలంలో ''నెపో కిడ్'' అనే సోషల్ మీడియాలో యువకులు చేసే ఆరోపణలు ట్రెండ్‌గా మారాయి. అవినీతి ద్వారా సంపాదించిన సొమ్ముతో దేశంలో రాజకీయనాయకులు, ప్రముఖుల పిల్లలు తెగ ఖర్చుపెడతూ ఎంజాయ్ చేస్తున్నారన్న విమర్శలు బాగా పెరిగాయి.

నేపాల్ ప్రభుత్వం ఈనెల 4వ తేదీన మొత్తం 26 సోషల్ మీడియా వేదికలను నిషేధించింది. ఫేస్‌బుక్,వాట్సాప్,ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ సోషల్ మీడియా వేదికలన్నీ నేపాల కమ్యూనికేషన్స్,ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ ఇచ్చిన గడువుతేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవడంలో విఫలమయ్యాయని అందుకే నిషేధం విధించామని పేర్కొంది. సోషల్ మీడియా కొన్ని ఆంక్షలకు అనుగుణంగా పనిచేయాలని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనివల్ల ఆంక్షలు అమలయ్యే పరిస్థితి వస్తుందని, స్వేచ్ఛగా ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి అవకాశం ఉండకపోవచ్చునని ప్రజలు భావిస్తున్నారు. ఐతే దీనిపై ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి ఆదివారం ఒక వివరణ ఇస్తూ, అధికారపార్టీ సోషల్ మీడియాకు వ్యతిరేకం కాదన్నారు. దేశాన్ని కించపరచేవిధంగా అహంకారపూరితమైన ద్వేష ప్రచారం చేస్తే సహించబోమన్నారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకించేవారి చేతుల్లో ప్రదర్శకులు తోలుబొమ్మల్లా మారారని విమర్శించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com